అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400


నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ఉత్తర గోవా నైట్‌క్లబ్బులు, హోటళ్లలో.. బాణసంచా వాడకంపై నిషేధం
ఇది బెంగాల్.. యుపి కాదు మతం పేరిట విభజన హింస సహించం 05

సంపుటి 28, సంచిక: 172 | శుక్రవారం | 12-12-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00



## ట్రంప్‌తో ప్రధాని మోదీ ఫోన్ సంభాషణ

- ఆర్థిక సంబంధాలు మరింత బలోపేతంపైనే చర్చ
- పలురంగాల్లో పరస్పర సహకారాన్ని విస్తరించే విషయంపై అభిప్రాయాలు పంచుకున్న ఇరునేతలు

**న్యూఢిల్లీ:** భారత్‌–అమెరికా వాణిజ్య ఒప్పందంపై రెండు దేశాలు దృష్టి సారించిన ఈ సమయంలో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురువారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఫోన్ ద్వారా మాట్లాడారు. ఈ సంభాషణ ప్రధానంగా ఆర్థిక సంబంధాలను మరింత తరువాయి 12లో



## సిట్ ముందు లొంగిపోండి

- ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావుకు సుప్రీం కోర్టు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న తెలంగాణ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ అధికారుల ఎదుట శుక్రవారం బేషరతుగా లొంగిపోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.ఈ కేసుకు సంబంధించి దర్యాప్తునకు ప్రభాకర్ రావు ఏమాత్రం సహకరించడం లేదని, తరువాయి 2లో



## గడువు పొడిగింపు

- ఆరు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఎస్ఐఆర్ 2.0 షెడ్యూల్ మార్పు

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాల ప్రక్షాళన కోసం ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ 2.0 కొనసాగుతున్న రాష్ట్రాల్లో గురువారంతో ఎన్యుమరేషన్ కాలం ముగిసింది. దీంతో సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. ఆరు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఎన్యుమరేషన్ కాలాన్ని తరువాయి 12లో



## తొలి పల్లె పోరులో

# కాంగ్రెస్ హవా

- రెండు వేలకుపైగా సర్పంచ్‌లు కైవసం
- వెయ్యికిపైగా బిఆర్ఎస్ అభ్యర్థులు, 200 లోపు బిజెపి, 500 పైగా స్థానాల్లో ఇతర అభ్యర్థులు గెలుపు
- 84.28 శాతం ఓటింగ్ నమోదు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో గురువారం జరిగిన గ్రామపంచాయతీల్లో ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల హవా కొనసాగింది. కడపటి వార్తలు అందే సమయానికి కాంగ్రెస్‌కు బలపరిచిన అభ్యర్థులు 2240 గ్రామాల్లో విజయం సాధించగా, బిఆర్ ఎస్ బలపరిచిన అభ్యర్థులు 1136, బిజెపి బలపరిచిన అభ్యర్థులు 182, ఇతర అభ్యర్థులు 513 మంది సర్పంచ్‌లుగా గెలుపొందారు. దాదాపు 20 మంది సిపిఐ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారు. తొలివిడతల్లో మొత్తం 3,834 సర్పంచ్ స్థానాలకు, 27,628 వార్డు మెంబర్లకు ఎన్నికలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడత ఎన్నికల పోలింగ్‌లో చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బుధవారం ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్, మధ్యాహ్నం ఒంటిగంటతో పూర్తయ్యింది. పలుచోట్ల ఒంటిగంట వరకు క్యూలో ఉన్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభించారు. తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోటెత్తారు. తొలి విడతలో మొత్తం 84.28 శాతం పోలింగ్ నమోదైంది. ఇది సాధారణ ఎన్నికలతో పోల్చితే భారీ స్పందనగా అధికారులు వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యధికంగా 92.88 శాతం పోలింగ్ నమోదై రికార్డు సృష్టించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అతి తక్కువగా తరువాయి 2లో


సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తాటిపాములలో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రంలోకి వెళుతున్న వృద్ధురాలు

## తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్

## రాష్ట్ర భవిష్యత్ ముఖచిత్రం

# ఆవిష్కరించింది



- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎఐసిసి చీఫ్ ఖర్గే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ అభినందనలు
- తెలంగాణలో భారీ పెట్టుబడులు రాబట్టేందుకు ఒప్పందాలు చేసుకోవడంపై ప్రశంసలు
- మెస్సీ గోట్ ఇండియా టూర్ రావాలని రాహుల్, ప్రియాంకలకు సిఎం ఆహ్వానం

ప్రజాపక్షం/హైదరాబాద్

'తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అభినందనలు తెలిపారు. తెలంగాణ భవిష్యత్ ముఖచిత్రాన్ని డాక్యుమెంట్ ఆవిష్కరించిందని వారు పేర్కొన్నారు. ఢిల్లీలో ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీలను వారి నివాసాల్లో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైన తీరు, తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణపై వారు చర్చించారు. సమ్మిట్‌లో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రాబట్టేందుకు ఒప్పందాలు చేసుకోవడంపై అగ్ర నేతలు సిఎంను వారు ప్రశంసించారు. సిఎం వెంట రాష్ట్ర మంత్రి జి.వివేక్ వెంకటస్వామి, ఎంపిలు సురేశ్ షెట్కార్, మందాడి అనిల్ కుమార్, పోరిక బలరాం నాయక్, తరువాయి 2లో





## నాణేలు, వారసత్వ అధ్యయనాల్లో

# అగ్రభాగంలో నిలవాలి

- యువ పరిశోధకులు అంతర శాస్త్రీయ అధ్యయనాలపై దృష్టిసారించాలి
- వారసత్వ ఆధారిత పరిశోధనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

నాణేల అధ్యయనం అంటే ఆలోచనలను అధ్యాయనం చేయడమేనని, ఈప్రక్రియలో న్యూమిస్ మ్యాటిక్స్ నాణేలు, వారసత్వ అధ్యాయనాల్లో రాష్ట్రం అగ్రస్థానంలో నిలవాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు ఆకాంక్షించారు. గురువారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల విభాగంలో న్యూ మిస్ మ్యాటిక్స్ సొసైటీ ఆధ్వర్యలో దక్షిణ భారతదేశ నాణేలు ఆర్థిక వ్యవస్థ అనే అంశంపై ఏర్పాటుచేసి నజాతీయ సెమినార్‌లో డిప్యూటి సిఎం తరువాయి 12లో

## రాష్ట్రపతి ముర్ము

# శీతాకాల విడిది

- 17న నుండి 21 వరకు రాష్ట్రపతి నిలయంలో బస
- అధికారులు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేయాలని సిఎస్ రామకృష్ణరావు ఆదేశం





ప్రజాపక్షం/హైదరాబాద్

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 5 రోజుల రాష్ట్ర పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, రాష్ట్రపతి నిలయం అధికారులు సమన్వయంతో పని చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశించారు. శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల17నుంచి 21 వరకు హైదరాబాద్ లోని రాష్ట్రపతి నిలయంలో బస చేస్తారని సిఎస్ తెలిపారు. 5 రోజులపాటు రాష్ట్రంలో రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్ల పై గురువారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సిఎస్ సమీక్షించారు. రాష్ట్రపతి పర్యటనకు సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేసి విస్తృత ఏర్పాట్లు చేయాలని సిఎస్ ఆదేశించారు. పోలీసు శాఖ తగు భద్రతా, ట్రాఫిక్, బందోబస్త్, అగ్నిమాపక శాఖ అవసరమైన సిబ్బందితో పాటు ఫైర్ టెండర్లలు, వైద్య, ఆరోగ్యశాఖ వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రోడ్డు భవనాల శాఖ విభాగం అవసరమైన బారికేడింగ్‌లు, ఇతర ఏర్పాట్లు చేయాలని, జిహెచ్ఎంసి, పోలీసు శాఖల సమన్వయంతో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ తరువాయి 2లో




## 'డిజిటల్ సేఫ్టీ'లో

# రాష్ట్రం రోల్ మోడల్

- తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం
- అందుకు అనుగుణంగా తెలంగాణ రైజింగ్ విజన్ 2047 డాక్యుమెంట్‌లో సమగ్ర రోడ్డుమ్యాప్ పొందుపరిచాం
- సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ కాంక్లేవ్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణను 'డిజిటల్ సేఫ్టీ'లో దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగానే 'తెలంగాణ రైజింగ్ విజన్ 2047' డాక్యుమెంట్ లోనూ కాంప్రహెన్సివ్ రోడ మ్యాప్ ను పొందుపర్చామన్నారు. హెచ్ఐసిసిలో గురువారం నిర్వహించిన 'సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ కాంక్లేవ్ 2025'ను ఆయన లాంఛనంగా తరువాయి 2లో

## ముస్లిం లీగ్, హిందూ మహాసభ

# కలిసి పనిచేశాయి

'వందేమాతరం'పై రాజ్యసభ చర్చలో సిపిఐ ఎంపి సందోష్‌కుమార్




**న్యూఢిల్లీ :** చరిత్రలో హిందూ మహాసభ, ముస్లిం లీగ్ పొత్తుకు అనేక ఉదాహరణలు ఉన్నాయని, గతంలో అనేక సందర్భాల్లో హిందూ మహాసభ,ముస్లిం లీగ్ కలిసి పనిచేశాయని సిపిఐ రాజ్యసభ పక్ష నాయకుడు పి.సందోష్ కుమార్ అన్నారు. వందేమాతర గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన పాల్గొన్నారు. 1940లో ముస్లిం లీగ్ సమావేశంలో పాకిస్తాన్ తీర్మానాన్ని మొదటిసారిగా ప్రవేశపెట్టిన వ్యక్తి ఫజల్–ఉల్–హఖ్ అని, తరువాతి కాలంలో బిజెపి నాయకులందరికీ ఆదర్శప్రాయుడైన శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆయనతో కలిసి ముఖర్జీ ఆర్థిక మంత్రిగా పనిచేశారని గుర్తు చేశారు. పాకిస్తాన్ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన ముస్లిం లీగ్ నాయకుడితో ఆయన మంత్రిత్వశాఖను, అధికారాన్ని పంచుకున్నారని వివరించారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో బిజెపి, సంఘ్‌పరివార్‌కు ఎలాంటి పాత్ర లేదని, ఈ వాస్తవం నుంచి వాళ్ళు తప్పించుకోలేరని అన్నారు. వందేమాతరం గీతం ప్రజలను తరువాయి 12లో

# సిపిఐ సర్పంచ్‌లు వీరే...



లేదన్న సత్యనారాయణ – కస్తాల (నల్లగొండ)
యాదయ్య – చల్మెడ (నల్లగొండ)
సంగిశెట్టి రాణమ్మ – పల్లెపహాడ్ (నల్లగొండ)
స్వప్న – మర్రిగూడెం (యాదాద్రి)
కొల్లూరు రాజయ్య – ధర్మారెడ్డిగూడెం (యాదాద్రి)
కర్రె లక్ష్మి – గోపాలపూర్ (హన్మకొండ)

బాడిశ కల్పన – రామానుజాపురం (కొత్తగూడెం)



అజ్మీర శైలజ – తూరుపాక (కొత్తగూడెం)
కుంజా కనకరత్నం – నరసాపురం (కొత్తగూడెం)
పాయం వెంకటేశ్వర్లు – పెద్ద ఆర్లగూడెం (కొత్తగూడెం)
కుంజా ప్రమీల – బి.కొత్తగూడెం (కొత్తగూడెం)
శ్యామల తిరుపతిరావు – కుర్నపల్లి (కొత్తగూడెం)
సూప సునీత – తిప్పాపురం (కొత్తగూడెం)





చిడెం ఉషారాణి – సొంబాయిగూడెం (కొత్తగూడెం)
పర్సా రాంచందర్‌రావు – చిన్న మండవ (ఖమ్మం)
దూసరి నేతాజీ – నేరడ (ఖమ్మం)
ఆవుల నర్సింహారావు – బస్వాపురం (ఖమ్మం)
గడల కళావతి – తనికెళ్ల (ఖమ్మం)
ఏపూరి పద్మ – నాగిలిగొండ (ఖమ్మం)
వార్ల వెంకయ్య – గుంతకోడూరు (నాగర్‌కర్నూల్)



# ప్రపంచం
WORLD NEWS

## మయన్మార్ ఆసుపత్రిపై జుంటా సైన్యం దాడి : 34 మంది దుర్మరణం

**ప్యాంగ్‌యాంగ్:** మయన్మార్ పశ్చిమ ప్రాంతంలో బుధవారం రాత్రి జుంటా ప్రభుత్వ సైన్యాలు ఒక ఆసుపత్రిపై దాడి చేశాయి. రఖైన్ రాష్ట్రం మ్రౌఖ్–యు పట్టణంలో ఉన్న ఆసుపత్రిపై దాడిలో 34 మంది మరణించారు. మరో 16 మంది గాయపడ్డారు. 2021లో మయన్మార్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కుప్పకూల్చి అధికారాన్ని సైన్యం స్వాధీనం చేసుకున్న తర్వాత దేశంలో అంతర్యుద్ధం ప్రారంభమైంది.అంతర్యుద్ధంలోపౌరగ్రూపులు,తెగల గ్రూపులు దేశంలోని నలుమూలలా ప్రభుత్వ సైన్యంపై సాయుధ పోరాటం ప్రారంభించాయి. అనేక జాతులకు చెందిన ముఠాలు ప్రభుత్వ సైన్యాన్ని ప్రతిఘటిస్తున్నాయి. జుంటా ప్రభుత్వ సైన్యం దాడిచేసిన ఈ ఆసుపత్రి అరకాన్ జాతికి చెందింది.అరకాన్ జాతి పౌరముఠా ప్రభుత్వసైన్యానికి వ్యతిరేకంగా హింసాత్మక పోరాటం చేస్తోంది. జుంటా సైనిక పాలకులతో పోరాటం చేస్తున్న బలమైనజాతిముఠాలలోఈఅరకాన్‌జాతిగ్రూపుఎంతో శక్తిమంతమైనది.

### వెనిజులా సూపర్ ఆయిల్ ట్యాంకర్ షిప్
# అమెరికా దళాల అక్రమ స్వాధీనం



**కారకాస్:** దక్షిణ అమెరికాలో కమ్యూనిస్టు పాలిత దేశం వెనిజులా ప్రభుత్వాన్ని కుప్పకూల్చేందుకు అమెరికా దురాక్రమణ చర్యలు ఆగకుండా కొనసాగుతున్నాయి. ఇందులో భాగం వెనిజులా ''ఆయిల్ సూపర్ ట్యాంకర్''ను అమెరికా దళాలు స్వాధీనం చేసుకోవడంతో ఒక్కసారిగా ముడి చమురు ధరలు భారీగా పెరిగి కిందకి దిగిరాకుండా అక్కడే స్థిరపడ్డాయి. వెనిజులా తీరంలో వెళుతున్న నౌకలోకి హెలికాప్టర్ల సహాయంతో ప్రవేశించి నౌకను అమెరికా రక్షణ దళాలు తమ అధీనంలోకి తెచ్చుకున్నాయి. ఈ మేరకు 45 సెకన్లు నిడివిగల ఒక వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో 2019 తర్వాత మళ్ళీ మొదటిసారి వెనిజులా చమురు నౌకను అమెరికా స్వాధీనం చేసుకుంది. రెండు హెలికాప్టర్లు, పది మంది తీరప్రాంత అమెరికా దళాలు, మరో పది మెరైన్ పడవలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్ని వెనిజులా నౌకను చుట్టుముట్టాయి. దీంతో కరీబియన్ జలాలలో మరింత ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఈ నేపథ్యంలో వెనిజులా దేశాధ్యక్షుడు నికొలస్ మదురో తీవ్రస్థాయిలో అమెరికాపై మండిపడ్డారు. తమ చమురు సూపర్ ట్యాంకర్‌ను అమెరికా దళాలు అక్రమంగా స్వాధీనం చేసుకున్నాయని, తమ చమురు ట్యాంకర్ నౌకను అమెరికా దళాలు దొంగతనం చేశాయని విమర్శించారు. ఈ విధమైన చట్టవిరుద్ధమైన చర్యలను, అక్రమ చర్యలను అమెరికా మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వెనిజులా చమురు ట్యాంకర్ అక్రమ స్వాధీన చర్యను మదురో ''అంతర్జాతీయ పైరసీ చర్య''గా అభివర్ణించారు. కాగా ట్రంప్ కూడా ఈ చమురు ట్యాంకర్ స్వాధీన చర్యను ధృవీకరించారు. వాస్తవానికి ఈ ముడి చమురు ట్యాంకర్ అన్నింటికంటే చాలా చాలా పెద్దదని, సూపర్ ట్యాంకర్ అనీ వైట్‌హౌస్‌లో పాత్రికేయులకు ట్రంప్ చెప్పారు. ఐతే ఈ ట్యాంకర్ వెనిజులాదే అని స్వయంగా చెప్పడానికి ఆయన నిరాకరించారు. తన ప్రభుత్వాన్ని కూల్చేందుకు కంకణం కట్టుకున్న ట్రంప్ సామ్రాజ్యవాద వైఖరిని నికొలస్ మదురో తీవ్రంగా ఖండించారు. వెనిజులా గగనతలంపై ట్రంప్ నిషేధం విధించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కయ్యానికి కాలు దువ్వుతున్న ట్రంప్ వైఖరిని కొంతమంది రిపబ్లికన్లు, ప్రతిపక్ష డెమోక్రాట్లు వ్యతిరేకిస్తున్నారు. మరో ఖరీదైన యుద్ధానికి అమెరికా సిద్ధపడుతోంది'' అని డెమోక్రాట్ సభ్యుడు చక్ షుమర్ విమర్శించారు. వెనిజులా ప్రజలపైన, సార్వభౌమత్వంపైన ట్రంప్ చేస్తున్న అన్యాయపూరితమైన, దురాక్రమణ చర్యగా వెనిజులా విదేశీ మంత్రిత్వ శాఖ విమర్శించింది. కరీబియన్ జల్లాలో గడచిన 60 రోజులుగా పెంటగాన్ రక్షణ దళాలు 21 పడవలపై దాడులు చేసి 80 మందిని హతమార్చింది. మదురో నాయకత్వంలో ఉన్న కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూల్చివేస్తామని ట్రంప్ బాహాటంగా ప్రకటనలు చేస్తూ కరీబియన్ జలాల్లో శక్తిమంతమైన అమెరికా విమానవాహక యుద్ధ నౌకలను మోహరించారు.

### చైనా–రష్యాలకు పోటీగా
## జపాన్–అమెరికా అణుబాంబర్ల 'ఎయిర్ షో'



**టోక్యో:** చైనా–రష్యా యుద్ధ విమానాలు ఉమ్మడిగా గగనతల గస్తీ కార్యకలాపాలు నిర్వహించడంతో దానికి పోటీగా బుధవారం అమెరికా–జపాన్ యుద్ధవిమానాలు ఉమ్మడి విన్యాసాలు నిర్వహించాయి. జపాన్ సముద్ర జలాలపై అమెరికా అణు యుద్ధ బాంబర్లు చక్కెర్లు కొట్టి విన్యాసాలు నిర్వహించాయి. జపాన్‌కు చెందిన ఎఫ్–35, ఎఫ్–15 బాంబర్ యుద్ధ విమానాలతో కలిసి అమెరికా అణు బాంబర్ బి–52 యుద్ధ విమానాలు ఎయిర్ షో నిర్వహించాయి. జపాన్, దక్షిణ కొరియా దేశాల చుట్టూ ఉన్న సముద్ర జలాలలో అంతకుముందురోజు చైనా–రష్యా యుద్ధ విమానాలు విన్యాసాలు నిర్వహించడంతో దీనికి ప్రతీకారంగా ఈ అమెరికా–జపాన్ ఎయిర్ షో జరిగింది. చైనా–జపాన్ మధ్య కొద్దికాలంగా ఉద్రిక్తతలు మరింత పెరగడంతో జపాన్, దక్షిణ కొరియా సమీప ప్రాంతాలోల చైనా చేస్తున్న గగనతల గస్తీ కార్యకలాపాలలో మంగళవారంనాడు రష్యా యుద్ధ విమానాలు కూడా జతకలిశాయి. జపాన్ ప్రధానమంత్రిగా తకైచీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఉద్రిక్తతలు పెరిగాయి. తైవాన్‌పై చైనా దాడిచేస్తే జపాన్‌కు ప్రమాదం పెరుగుతుందని, స్వీయ రక్షణకోసం సైనిక చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తకైచీ గతనెల జపాన్ పార్లమెంటులో వ్యాఖ్యలు చేసిన దగ్గర నుండి ఈ ప్రాంతంలో శాంతి భద్రత పరిస్థితులు దిగజారుతున్నాయి. పరిణామాలమధ్య చైనా వార్షిక సహకార ప్రణాళికలో భాగంగా రష్యా యుద్ధ విమానాలు కూడా జత కలిశాయి. ఆమరునాడేపోటీగాఅమెరికా–జపాన్‌యుద్ధ విమానాలు ఎయిర్ షో చేశాయి.

# పశ్చిమాసియాలో శాంతికి మోదీ మద్దతు

### నెతన్యాహూతో ద్వైపాక్షిక సమస్యలపై ఫోన్ భేటీ



**జెరూసలెం:** పశ్చిమ ఆసియాలో శాంతి సాధనకు భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన పూర్తి మద్దతు తెలియజేశారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ బుధవారం ఉదయం మోదీకి ఫోన్ చేశారు. నాయకులు ఇద్దరూ వర్తమాన ప్రపంచ రాజకీయాలు, పశ్చిమాసియాలో పరిణామాలపై సంభాషించారు. గాజాలో శాంతి స్థాపనకు, అమలు జరుగుతున్న శాంతి ప్రణాళికకుతన పూర్తి మద్దతు ఎప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా నెతన్యాహూకు మోదీ భరోసా ఇచ్చారు. రెండు దేశాలమధ్యా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పటిష్టం చేసుకోవడంపై నాయకులు ఇద్దరూ చర్చించారు. రెండు దేశాలమధ్యా వ్యూహాత్మక భాగస్వామ్యం సాధిస్తున్న పురోగతిపట్ల నాయకులిద్దరూ సంతృప్తి వ్యక్తం చేశారు. రెండు దేశాలమధ్యా సంబంధాలను మరింత పటిష్టం చేసుకుని సహకారాన్ని బలోపేతం చేసుకోవాల్సిన ఆవశ్యకతను వారు పునరుద్ఘాటించారు. పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా సంబంధాలను వృద్ధి చేసుకోవాలని నాయకులిద్దరూ ఆంకాంక్షించారు. నాయకులు ఇద్దరూ త్వరలో ముఖాముఖీ సమావేశం జరపాలని కూడా ఒక అంగీకారానికి వచ్చినట్లు ఇజ్రాయెల్ విదేశీమంత్రిత్వశాఖ ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ అప్‌లోడ్ చేసింది.

గాజాలో శాంతి ప్రణాళికను సత్వరం అమలు చేయడంతో పాటు ఆ ప్రాంతంలో శాంతి సాధన యత్నాలకు ఆయన మద్దతు తెలియజేశారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నాగానీ ఉపేక్షించేదిలేదని ఈ సందర్భంగా మోదీ అన్నారు. ఉగ్రవాదాన్ని సహించకూడదని, నిర్మూలన చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు ఇద్దరూ ఉగ్రవాదాన్ని ఏకాభిప్రాయంతో ఖండించారు. ఉగ్రవాదం తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను పునరుద్ఘాటించారు. ప్రాంతీయ, ద్వైపాక్షిక కీలక సమస్యలపై ఎప్పటికప్పుడు అభిప్రాయాలను ఇచ్చిపుచ్చుకోవాల్సిన ఆవశ్యకతను వారు నొక్కిచెప్పారు.

### హోండూరస్ అధ్యక్ష ఎన్నికల్లో
## ట్రంప్ జోక్యంపై సర్వత్రా నిరసన



**టెగుసిగల్ప:** సెంట్రల్ అమెరికాలో పసిఫిక్ తీర దేశం హోండూరస్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల ప్రక్రియ, దాని తీరు తెన్నులు చెల్లుబాటు కావని, ఈ ఎన్నికల ఫలితాలను గుర్తించేదిలేదని ఆ దేశ కాంగ్రెస్ ప్యానల్ హెచ్చరిక చేసింది. నవంబరు 30వ తేదీన హోండూరస్‌లో అధ్యక్ష పదవికి పోలింగ్ జరిగింది. తీవ్ర వివాదం ఏర్పడంతో ఎన్నికల కౌటింగ్ బుధవారం 11వ రోజు కూడా కొనసాగింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ ఎన్నికల వ్యవహారంలో తలదూర్చారు. తాను మద్దతు ఇచ్చిన అభ్యర్థి విజయం సాధించకపోతే హోండూరస్‌కు ఇచ్చే ఆర్థిక సహాయాన్ని నిలిపివేస్తానని ఆయన హెచ్చరిక చేయడంతో ఈ సమస్య మరంత జటిలంగా మారింది. 128 మంది సభ్యులు గల హోండూరస్ జాతీయ కాంగ్రెస్‌లో 65 స్థానాలు గెలుచుకున్నవారే ప్రభుత్వాన్ని స్థాపించగలుగుతారు. కాగా ట్రంప్ జోక్యంపై సర్వత్రా విమర్శలు చెలరేగుతున్నాయి. దేశంలో నిరసనలు కొనసాగుతున్నాయి. ట్రంప్ మద్దతు ఇచ్చిన మితవాద నేషనల్ పార్టీ అభ్యర్థి నస్రీ అస్ఫురా (67) మొదట ఆధిక్యంలో కొనసాగారు. ఆ తర్వాత మధ్యేవాద అభ్యర్థి నస్రుల్లా స్వల్ప ఆధిక్యంలోకి వచ్చారు. అధికార వామపక్షాలకు చెందిన అభ్యర్థి రిక్సీ మంకాడా 19.09 శాతం ఓట్లతో మూడోస్థానంలో ఉన్నారు. అధికార లిబ్రేపార్టీ గెలిచే అవకాశాలు లేకపోవడంతో ఆ పార్టీ ట్రంప్ మద్దతు ఇచ్చిన అస్ఫురాను సవాలు చేస్తున్న సాల్వడార్ నస్రల్లాను ప్రోత్సహిస్తున్నది. ఫలితాలను తారుమారు చేసేందుకు ఎన్నికల సంఘం ప్రయత్నిస్తోందన్న ట్రంప్ ఆరోపణలమధ్య జాప్యం కొనసాగుతోంది. మోసం జరిగే అవకాశాలు ఉన్నాయని, ఒకవేళ ఎన్నికల వ్యవస్థ మోసానికి పాల్పడితే మూల్యం చెల్లిస్తారని హెచ్చరించారు. నస్రుల్లా,అస్ఫురా ఇద్దరు 40 శాతం ఓట్లతో సాంకేతికపరంగా సముజ్జీలుగా నిలిచారని, అందువల్ల ఈ ఓట్లను మానవశ్రమ ద్వారా సిబ్బందే లెక్కిస్తారని ఎన్నికల మండలి తొలుత ప్రకటించింది. మొత్తం ఐదుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. కానీ ప్రధాన పోటీ ముగ్గురు మధ్యే జరుగుతోంది.



## ఆవిష్కరించింది (మొదటి పేజీ తరువాయి)

డాక్టర్ మల్లు రవి, కుందూరు రఘువీర్ రెడ్డి, గడ్డం వంశీకృష్ణ ఉన్నారు.

**'మెస్సీ గోట్ ఇండియా టూర్'కు రాహుల్ గాంధీ, ప్రియాంకలకు ఆహ్వానం**
'మెస్సీ గోట్ ఇండియా టూర్' కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ బయలుదేరే ముందు పార్లమెంట్ ఆవరణలో సిఎం మీడియాతో మాట్లాడారు. 'ఈనెల 13న ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీ హైదరాబాద్ వస్తున్నారు. ఒక ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరవుతున్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నా కాబట్టి నన్ను కూడా ఒక అతిథిగా ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ఈ కార్యక్రమానికి ఎలాంటి సంబంధం లేదు. ప్రముఖ క్రీడాకారుడు వస్తున్నందున ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఇస్తు న్నాం. ఢిల్లీలో కలిసిన అందరినీ ఈ కార్యక్రమానికి రావాలని ఆహ్వానించాను' అని ముఖ్యమంత్రి తెలిపారు.

**ముఖ్యమంత్రికి ఎంపిల అభినందనలు :** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను ఘనంగా నిర్వహించడంతో పాటు రాష్ట్రానికి రూ.5.75 లక్షలకోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వివిధ సంస్థ లు ముందుకొచ్చిన నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని తెలంగాణ పార్లమెంట్ సభ్యులు అభినందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్ రెడ్డిని పార్లమెంట్‌లో ఎంపిలు పోరిక బలరాం నాయక్, సురేష్ షెట్కార్, డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎం.అనిల్ కుమార్ కలిసి పుష్పగుచ్ఛాలందించి అభినందనలు తెలిపారు.

**గొప్ప నాయకుడు ప్రణబ్ ముఖర్జీ : తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి నివాళి**
దశాబ్దాల పాటు ప్రజాసేవకు అంకితమైన గొప్ప నాయకుడు ప్రణబ్ ముఖర్జీ అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కొనియాడారు. భారత మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఢిల్లీలోని సిఎం అధికారిక నివాసంలో ప్రణబ్ ముఖర్జీ చిత్రపటం వద్ద సిఎం రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రణబ్ ముఖర్జీ దేశానికి చేసిన సేవలను సిఎం గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపిలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, గడ్డం వంశీ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, నాయకులు రోహిన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నా రు.

## రాష్ట్రం రోల్ మోడల్
(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... రోజుకో తరహాలో మోసాలకు పాల్పడుతూ సైబర్ నేరగాళ్లు సవాలు విసురుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాదిలో దేశవ్యాప్తంగా 265 మిలియన్లకు పైగా సైబర్ దాడులు జరిగాయన్నారు. తెలంగాణలోని కీలక రంగాలకు చెందిన సంస్థలు, కంపెనీలపై గతేడాది 17వేలకు పైగా రాన్సమ్ వేర్ దాడులు జరిగినట్లు ఓ ప్రముఖ సెక్యూరిటీ సంస్థ అధ్యయనంలో తేలిందన్నారు. ఒక్క సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనే ఏడాది వ్యవధిలో రూ.800 కోట్లకు పైగా సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టడం వాస్తవ పరిస్థితికి నిదర్శనమన్నారు. ఇలాంటి తరుణంలో సాంప్రదాయ పోలీసింగ్ కాకుండా స్మార్ట్ పోలీసింగ్ అవసరమని గుర్తు చేశారు. పౌరుల భాగస్వామ్యంతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయగలమని వివరించారు. మోసం జరిగిన తర్వాత కాకుండా ముందే స్పందించి సైబర్ నేరగాళ్లను కట్టడి చేసే వ్యవస్థ అవసరమన్నారు. కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ ఆధారిత ఇంటిగ్రేటేడ డేటా సిస్టమ్స్, రియల్ టైం మానిటరింగ్, ఓపెన్ ఇన్ఫర్మేషన్ లాంటి అధునాతన వ్యవస్థల ద్వారా తమ ప్రభుత్వం పౌరుల డిజిటల్ సేఫ్టీకి చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ...వారిని 'వారియర్స్'గా తీర్చిదిద్దుతున్నామన్నారు.

# గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణానికి రెండోరోజూ భారీగా సందర్శకులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్–2025లో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ స్టాళ్లు, కార్పొరేట్ కంపెనీల స్టాళ్లను గురువారం పెద్దఎత్తున సాధారణ ప్రజలు, విద్యార్థినీ, విద్యార్థులు సందర్శించారు. ఉదయం నుండే పెద్ద సంఖ్యలో ఈ స్టాళ్లను దర్శించడానికి బారులు తీరారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో రోజు కార్యక్రమాలు 'డిస్కవర్ తెలంగాణ: కల్చరల్ హెరిటేజ్ అండ్ నెక్స్‌జెన్ టూరిజం' అనే సదస్సు తో ప్రారంభమైంది. వివిధ కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఈ సదస్సులో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. తెలంగాణ చరిత్ర, మ్యూజియం సంస్కృతి, పర్యాటక అభివృద్ధి, ఆహార సంస్కృతి తదితర విభిన్న కోణాల్లో విలువైన విశ్లేషణలను ఈ సదస్సులో పాల్గొన్న వక్తలు వివరించారు. తెలంగాణను ప్రపంచ స్థాయిలో ఒక సాంస్కృతిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశాలను వీరు వివరించారు. ఈ సదస్సులో డాక్టర్ మామిడి హరికృష్ణ, బిరద్ రాజారామ్, పి.పద్మావతి, గోపీ బెల్లుప్పాల ప్రసంగించారు. అనంతరం 'తెలంగాణ రైజింగ్ ఎంపవరింగ్ ఆల్, గ్రోవింగ్ టుగెదర్' అనే సదస్సులో ప్రముఖులు విద్యార్థులతో సమావేశమయ్యారు. ఒరాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లుగా చేపట్టిన ప్రగతిని, తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలపై క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సదస్సు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏరోస్పెస్, మూసీ రివర్ డెవలప్‌మెంట్, హ్యాండీ క్రాఫ్ట్స్ టూరిజం, ఎడ్యుకేషన్, కరీంనగర్ ఇక్కత్, ఫిలిగ్రి, చేర్యాల పెయింటింగ్స్, సైబర్ క్రైమ్ చెదనలో ఉపయోగించే పలు ఆధునాతన పరికరాలు, డ్రోన్స్, రోబో తదితర 27కు పైగా స్టాళ్లను సందర్శకులు అత్యంత ఆసక్తిగా తిలకించారు. ప్రధానంగా, ఆధునిక పరికరాలు, వైమానిక అంశాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కాగా, శుక్రవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 7 గంటలవరకు ఈ గ్లోబల్ సదస్సును సందర్శించవచ్చని రాష్ట్ర సమాచార, పౌరసరఫరాల శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

## నాన్‌బెయిలబుల్ వారెంట్ అవాస్తవం : మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్‌వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వేసిన పరువునష్టం కేసులో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖపై కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు కొన్ని పత్రికలు, ఛానలళ్లు, వెబ్ సైట్లలో వచ్చివ వార్తలను ఆమె ఖండించారు. ఈ వార్తలు పూర్తి అవాస్తవమని కొండా సురేఖ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కేసులో తదుపరి విచారణ ఫిబ్రవరి 5వ తేదీన కోర్టుకి హాజరుకావాలని న్యాయస్థానం స్పష్టం చేసిందని తెలిపారు. ఈ మేరకు మీడియా మిత్రులు అందరూ ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## శీతాకాల విడిది
(మొదటి పేజీ తరువాయి)

అధికారులను సిఎస్ సూచించారు. రాష్ట్రపతి నిలయంలో 24 గంటలు స్నేక్ క్యాచర్ బృందాన్ని అందు బాటులో వుంచాలని ఆదేశించారు. జిహెచ్‌ఎంసి సమన్వయంతో రాష్ట్రపతి నిలయం పరిసరాల్లో కోతుల బెడదను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను నియమించాలని, అదేవిధంగా తేనెటీగలను పట్టుకోవానికి ముందుస్తు ఏర్పాట్లు చేయాలని జిహెచ్‌ఎంసి అధికారులను ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో డిజిపి శివధర్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి. ఆనంద్, హైదరాబాద్ నగర పోలీస్ కమీషనర్ విసి సజ్జనార్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, పొలిటికల్ కార్యదర్శి ఈ. శ్రీధర్, అదనపు డిజిపిలు మహేష్ భగవత్, జిహెచ్‌ఎంసి కమీషనర్ ఆర్.వి. కర్ణన్, అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ సి.హెచ్ ప్రియాంక, ప్రొటోకాల్ డైరెక్టర్ శివలింగయ్య ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## లొంగిపోండి (మొదటి పేజీ తరువాయి)

ఆయనకు గతంలో మంజూరు చేసిన మధ్యంతర అరెస్ట్ ఉపశమనాన్ని ఎత్తివేయాలని కోరుతూ సిట్ అధికారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కేసులో కీలకమైన ఐఫోన్‌కు సంబంధించిన క్లౌడ ఖాతాల పాస్‌వర్డ్‌లను ఆయన రీసెట్ చేసి, సమాచారం ఇవ్వ డం లేదని తమ పిటిషన్‌లో ఆరోపించారు.సిట్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్ ధర్మాసనం ఈరోజు విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. అయితే, విచారణ సందర్భంగా ప్రభాకర్ రావును శారీరకంగా హింసించవద్దని దర్యాప్తు బృందానికి ప్రత్యేకంగా సూచించింది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాలతో ఈ కేసులో ప్రభాకర్ రావు చుట్టూ ఉచ్చు మరింత బిగుసుకున్నట్లయిం ది.

# భారత్‌ను పోగొట్టుకున్న అధ్యక్షుడుగా ట్రంప్ చరిత్రలో మిగిలిపోతారు

### డెమోక్రాట్ సిడ్నీ కామ్లాగర్ డోవ్ హెచ్చరిక

వాషింగ్టన్: భారతదేశంపట్ల ట్రంప్ అనుసరిస్తున్న వైఖరిని, టారిఫ్‌ల విధానాన్ని అమెరికా ప్రతిపక్ష డెమోక్రటిక్‌పార్టీ చట్టసభ సభ్యురాలు సిడ్నీ కామ్లాగర్ డోవ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. టారిఫ్‌లపై పెరుగుతున్న వివాదాలు, పెరుగుతున్న వీసా ఫీజులు వంటివన్నీ ద్వైపాక్షిక విశ్వాసాన్ని దెబ్బతీసే రాజకీయ ఫిర్యాదులుగా ఆమె ఉటంకిస్తూ, భారతదేశాన్ని కోల్పోయిన అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ భావి చరిత్రలో మిగిలిపోతారని హెచ్చరించారు.

భారత్–అమెరికా మధ్య ఉన్న సంబంధాలను ఆయన చెడగొట్టారని, ఆ దేశం ఇప్పుడు రష్యాకు చేరువ అయ్యిందని, ఎంతో కష్టపడి నిర్మించిన విదేశీ దౌత్యసంబంధాలను, విదేశాంగ విధానాన్ని జో బైడెన్ ప్రభుత్వం ట్రంప్ చేతుల్లో పెడితే ఆయన ఈ సంబంధాలను చెడగొట్టారని విమర్శించారు. అమెరికా కాంగ్రెస్‌లో విదేశీ వ్యవహారాల ఉపసంఘం వద్ద ఆమె తన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. దక్షిణ సెంట్రల్ ఆసియాలో భారత్–అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యంపై సభా ఉపసంఘం ఆమె వ్యక్తం చేసిన అభిప్రాయాలను ఆసాంతం ఆలకించింది. రష్యా పూర్వపు సామ్రాజ్యానికి పునరుజ్జీవనం కలిగిస్తున్న ట్రంప్ భారతదేశాన్ని సుంకాల పెంపు చర్యలతో వెంటాడి తరిమేందుకే దేశాధ్యక్షుడయ్యారా? అని ప్రశ్నించారు. వీసాలపై భారీగా వడ్డనలు వేయడం ద్వారా, రాజకీయ సమస్యలు సృష్టించడంద్వారా 21వ శతాబ్దంలో అమెరికాకు ఉండాల్సిన అత్యంత ముఖ్యమైన ఒక భాగస్వామ్య దేశంతో సంబంధాలను సమస్యల్లో పడేశారని సిడ్నీ దోవ్ విమర్శల దాడి చేశారు. రక్షణ, ఇంథన రంగం దగ్గర నుండి కృత్రిమ మేధ వరకూ అమెరికాలో అభివృది చెందుతున్న అన్ని రంగాలలో అమెరికా స్థానం బలోపేతం కావడానికి భారతదేశంతో సంబంధాలు ఎంతో పునాదిగా ఉంటాయని ఈ విషయాన్ని ట్రంప్ విస్మరించారన్నారు. ప్రపంచంలో ఏ దేశంపైనా కూడా (ఒక్క బ్రెజిల్ తప్ప) లేనంతగా 50 శాతం సుంకాలు విధించి భారతదేశాన్ని ఒంటరిగా దూరంగా ఉంచడం ద్వారా మన రెండు దేశాల మధ్యా నాయకత్వ స్థానాలలో నిత్యం ఉండాల్సిన సంబంధాలు, సమావేశాలు లేకుండా విజయవంతంగా పట్టాలు తప్పించిందని విమర్శించారు.

జోబైడెన్ ప్రభుత్వం ఎంతో శక్తిమంతమైన ద్వైపాక్షిక సంబంధాలను రూపొందించి కొత్త ప్రభుత్వం చేతుల్లో పెడితే నిలకడలేని వైఖరితో ఈ సంబంధాలను ట్రంప్ చెడగొట్టారని ధ్వజమెత్తారు. ఈ సంబంధాలన్నింటినీ మరుగుదొడ్లో ఫ్లష్ వాటర్‌ను వదిలేసినట్లుగా కొట్టిపారేశారని విమర్శించారు. ''క్వాడ్'' (క్వాడ్రలేటరల్ సెక్యూరిటీ డైలాగ్)కు తిరిగి జవసత్వాలు చేకూర్చాల్సిన అవసరం ఉందని అన్నారు. క్వాడ్‌లో భారత్,అమెరికా,ఆస్ట్రేలియా,జపాన్ దేశాలు సభ్యులుగా ఉన్నాయి. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో వర్ధమాన రక్షణ సాంకేతిక భాగస్వామ్య సామర్థ్య భాగస్వామ్యం, గొలుసుకట్టు సరఫరా వ్యవస్థ భాగస్వామ్యాన్ని పెంచిపోషించలేకపోయారని, ట్రంప్ వ్యక్తిగతమైన మనోవేదనలను నెరవేర్చుకోవడానికి జాతి ప్రయోజనాలను, దౌత్య మూలధనాన్ని పణంగా పెట్టారని విమర్శించారు. ట్రంప్ అధికారంలోకి వచ్చేసరికి ఈ ఏడాది ఆరంభం నాటికి జో బైడెన్ ప్రభుత్వం ఎంతోకష్టపడి సమకూర్చిన ద్వైపాక్షిక సంబంధాలను వారికి అప్పగించిందని, ఆ బాధ్యతలను ట్రంప్ యంత్రాంగం నిర్వహించలేకపోయిందని విమర్శించారు. డిసెంబరునెలారంభంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ భారతదేశంలో పర్యటన విశేషాలను, ఆ రెండు దేశాలమధ్యా పెరుగుతున్న అనుబంధాన్ని ఉటంకిస్తూ, పుతిన్–మోదీలు సన్నిహితంగా తిరుగుతూ కారులో దిగిన ఫోటోను షేర్ చేసి ఆన్‌లైన్‌లో సిడ్నీ కమలాగర్ ట్రంప్ యంత్రాంగంపై దుమ్మెత్తిపోశారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో అమెరికా ప్రయోజనాల పరిరక్షణకు భారతదేశం అవసరం ఎంతో ఉందని, చైనాను అదుపు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాకిస్థాన్ ప్రభుత్వంతో అమెరికా ఇటీవల పెంచుకుంటున్న అనుబంధాన్ని కూడా ఆమె ప్రశ్నించారు.

## కాంగ్రెస్ హవా
(మొదటి పేజీ తరువాయి)

71.79 శాతం పోలింగ్ నమోదైంది. ఈ విడతలో మొత్తం 45,15,141 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించారు. మొదటి విడతలో 3,834 సర్పంచ్ స్థానాలకు, 27,628 వార్డు మెంబర్ స్థానాలకు పోలింగ్ జరిగింది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్ద సంఖ్యలో భారులు తీరారు. అయితే, క్యూలైన్‌లలో ఉన్న ఓటర్లకు ఓటేసేందుకు అధికారులు అనుమతించారు. చాలా గ్రామాల్లో ఫలితాలు ప్రకటించగా, కొన్ని చోట్ల అర్ధరాత్రి వరకు ఫలితాలు వెలువడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాత్రి వరకు పోలింగ్ ఫలితాలు ప్రకటించి, ఉప సర్పంచ్ ఎన్నికలను నిర్వహించనున్నారు. కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులు పోలింగ్‌ను పర్యవేక్షించారు. తొలి విడుతలో 4,236 సర్పంచ్ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల కాగా, ఇందులో 396 సర్పంచ్ స్థానాలు, 9,633 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 3,834 సర్పంచ్ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. 12,960 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మూడు విడుతల్లో జరుగనున్న పంచాయతీ ఎన్నికల కోసం 93,905 మంది సిబ్బందిని నియమించినట్టు ఎస్‌ఈసి రాణి కుమిదిని కమిషనర్ తెలిపారు. మూడు విడుతల్లో జరుగనున్న పంచాయతీ ఎన్నికల కోసం 93,905 మంది సిబ్బందిని నియమించినట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. 3,591 మంది రిటర్నింగ్ అధికారులను, 2,489 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా 3,461 పోలింగ్ కేంద్రాలను, 45,086 బ్యాలెట్ బాక్సులను వినియోగిస్తున్నట్లు తెలిపారు.

**జిల్లాల వారీగా పోలింగ్ నమోదు శాతం..**
సంగారెడ్డి జిల్లాలో 84.7 శాతం, మెదక్ జిల్లాలో 85.9 శాతం, సిద్దిపేట జిల్లాలో 80.1 శాతం వరంగల్ జిల్లాలో 81.2 శాతం , ములుగు జిల్లాలో 73.57 శాతం హనుమకొండ జిల్లాలో 81.39 జనగామలో 78.57 శాతం , భూపాలపల్లి జిల్లాలో 82.26 శాతం, కరీంగనర్ జిల్లాలో 81.42 శాతం, నిజామాబాద్ జిల్లాలో 80.50 శాతం, సూర్యాపేట జిల్లాలో 87.77 శాతం, మహబూబ్ నగర్ జిల్లాలో 83 శాతం, నారాయణపేట జిల్లాలో 81.71 శాతం, నాగర్ కర్నూల్ జిల్లాలో 82.73 శాతం , జోగులాంబ గద్వాల జిల్లాలో 86.55 శాతం, వనపర్తి జిల్లాలో 81.67 శాతం , కుమ్రంబీమ్ జిల్లాలో 77.07 శాతం పోలింగ్ నమోదు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## నేటి నుంచి రైతు ఖాతాల్లో 'మొక్కజొన్న' నిధులు

55,904 మంది రైతు ఖాతాల్లో రూ. రూ.588 కోట్లు

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించిన మొత్తాన్ని శుక్రవారం నుండి రైతుల ఖాతాలలో జమచేసేలా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రంలో రైతుల నుంచి ఇప్పటి వరకు 2.45 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను సేకరించామని, ఈ ధాన్యానికి గాను రూ. 588 కోట్లు రైతుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయనున్నట్లు వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు. మొత్తం 55,904 మంది రైతులు లబ్ధి పొందనున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేనప్పటికీ, రాష్ట్రంలోని మొక్కజొన్న రైతులు నష్టపోకుండా ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వమే పంట సేకరణ చేపట్టిందని మంత్రి తుమ్మల వివరించారు. రైతులను ఆదుకోవడం రాష్ట్ర ప్రభుత్వ కర్తవ్యమని, వారికి ఎటువంటి నష్టం కలగకుండా చూడటం తమ మొదటి ప్రాధాన్యత అని అన్నారు.

## 'చిత్రపురి'ప్రస్తుత కమిటీపై విచారణకు ప్రభుత్వ ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చిత్రపురి కాలనీలోని తెలుగు సినీ వర్కర్స్ కోఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ లిమిటెడ్ ప్రస్తుత కార్యవర్గంపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ప్రస్తుత కమిటీ పదవీ కాలం బుధవారంతో ముగిసింది. ఈ కమిటీపై పలు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో విచారణ అధికారిగా వై.పరిమళ దేవిని ప్రభుత్వం నియమించింది. ఈ సొసైటీలో వందలాది కోట్ల కుంభకోణం జరిగింది గతంలో ఆరోపణలు రావడంతో 20 ఏళ్లలో సొసైటీ నిధులపై విచారణ జరిపిన కమిటీ ఇటీవలే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. తాజాగా నూతన కమిటీపై కూడా ఆరోపణలు రావడంతో దీనిపై కూడా విచారణ జరపనుంది.

## రైతు వ్యతిరేక విత్తన బిల్లు ప్రతిపాదనను తిరస్కరిస్తున్నాం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక విత్తన బిల్లు ప్రతిపాదనను తాము తిరస్కరిస్తున్నామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. రైతు సంఘాలతో పాటు విత్తన నిపుణులు, వ్యవసాయ రంగ నిపుణులు, రాజకీయ పార్టీలతో కూలంకషమైన చర్చ తర్వాతనే ఈ బిల్లుపై ముందుకు తీసుకుపోవాలని, రైతు కేంద్రంగా, రైతు ప్రయోజనాలే పునాదిగా నూతన విత్తన బిల్లు ఉండాలని సూచించారు. విత్తనాల అంశంలో రాష్ట్రాల పాత్ర లేకుండా చేస్తున్న విత్తన బిల్లును అందరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విత్తన బిల్లు వల్ల రైతులకు తీవ్రమైన నష్టం జరుగుతుందని, ముఖ్యంగా ఈ బిల్లులో నకిలీ విత్తనాలను కట్టడి చేసే అంశంపై స్పష్టత లేదని, నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు నిర్దిష్ట సమయంలోనే నష్టపరిహారం అందించే అంశంపై గ్యారంటీ లేదని తెలిపారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా విత్తనాల ధరలను నిర్ణయించే విధంగా ఈ బిల్లులో నిబంధనలు ఉన్నాయని, గతంలా విత్తనాల ధరల నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేకుండా పోతుందని కెటిఆర్ తెలిపారు. ఈజ్ ఆఫ్ బిజినెస్ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు ఆధిపత్యం అప్పగించే ప్రయత్నాలను పక్కన పెట్టాలని సూచించారు. త్వరలోనే ఈ అంశంపైన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, మాజీ ఎంపి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ తరపున ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించి, కేంద్రానికి మరిన్ని సూచనలు ఇస్తామని కెటిఆర్ అన్నారు.

## సిఎం జోలికి వస్తే సహించే ప్రసక్తే లేదు

ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోలికి వస్తే సహించ ప్రసక్తే లేదని ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం బిఆర్ఎస్ ఎంఎల్ఎ గాదరి కిశోర్‌ని హెచ్చరించారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి పట్టుకొని ఏకవచనంతో దూషించిన గాదరి కిషోర్ తక్షణమే సిఎంకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.గాదరి కిషోర్ భాష మార్చుకోకపోతే బాగుండదన్నారు. తాము అధికారంలో ఉన్నాం కాబట్టే సహనంగా ఉంటున్నామని, దీనిని అలుసుగా తీసుకుని ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. తుంగతుర్తిలో గాదరి కిషోర్ చేసిన అభివృద్ధి చూపిస్తే తను సగం గుండు సగం మీసం తీసుకుంటా కాంగ్రెస్ అభివృద్ధి పనులను చూసి బీఆర్ఎస్ ఓర్వలేకపోతుందన్నారు. తెలంగాణకు పెట్టుబడులు వచ్చి ఉద్యోగాలు వస్తే బీఆర్ఎస్ నేతలకు మింగుడు పడడం లేదని, 10 ఏళ్లలో బిఆర్ఎస్ రూ.7 లక్షల కోట్లు అప్పు చేస్తే సిఎం రేవంత్‌రెడ్డి రెండేళ్లలో 7 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చారన్నారు. తప్పు చేస్తే విమర్శించండి. సరి చేసుకుంటాం తప్ప తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు.

## హైటెక్స్‌లో ఎస్‌బిఐ మెగా ప్రాపర్టీ ఎక్స్‌పో

ఈనెల 19 నుంచి 21 వరకు నిర్వహణ :
చీఫ్ జనరల్ మేనేజర్ సహదేవన్ రాధాకృష్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మెగా ప్రాపర్టీ ఎక్స్‌పో 2025ను ఈనెల 19 నుండి 21 వరకు నిర్వహించనున్నట్లు ఎస్‌బిఐ చీఫ్ జనరల్ మేనేజర్ సహదేవన్ రాధాకృష్ణన్ తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ కోఠిలోని ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయంలో ఎక్స్‌పోకు సంబంధించిన ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇంటి కళను సాకారం చేసేందుకు ఈ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నామన్నారు. హైటెక్స్ హాల్ నెం 4లో ఈ ప్రాపర్టీ షో ఉంటుందని, ఈ ఎక్స్‌పోలో ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలు పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రైవేట్ బ్యాంకల కంటే తక్కువ వడ్డీ రేట్లతో ఎస్‌బిఐ హోమ్ లోన్‌ను మంజూరు చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణంలోనూ భాగస్వామ్యం అవుతామన్నారు. హోమ్ లోన్ ప్రాసెస్‌ను త్వరితగతిన పూర్తి చేసే విధంగా ఎస్‌బిఐ పని చేస్తుందని సహదేవన్ రాధాకృష్ణన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐ ఉన్నతాధికారులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో 'మురికివాడల్లో' మార్పు లేదు : కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో పదేళ్ల బిఆర్ఎస్, ప్రస్తుత రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో హైదరాబాద్‌లోని మురికవాడల పరిస్థితుల్లో ఎటువంటి మార్పు లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. మురికవాడల అభివృద్ధికి కార్యక్రమాలను చేపడుతామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీనిచ్చినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటిచర్యలూ తీసుకోలేదన్నారు. 'జాగృతి జనం బాట'లో భాగంగా హైదరాబాద్‌లోని సైదాబాద్, కత్‌పూరా,గౌరిపురా తదితర ప్రాంతాల్లో గురువారం కవిత పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మురికవాడల ప్రాంతాల్లో పట్టాలు రాలేదని, అర్హులైన వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలని, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయాలని కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మహానగరంలో గ్రామాల కంటే కూడా దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉన్నదని, గౌలిపుర లో నీళ్లు ఆయిల్ తరహా ఉన్నదని విమర్శించింది. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని లేదంటే ప్రజల తరపున తాముపోరాటం చేస్తామని కవిత హెచ్చరించారు.

## టెన్త్ పరీక్ష షెడ్యూల్ అశాస్త్రీయం

సిపిఐ(ఎం) జాన్ వెస్లీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో 10వ తరగతి వార్షిక పరీక్ష షెడ్యూల్ అశాస్త్రీయంగా ఉన్నదని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. సుదీర్ఘకాలం పరీక్షలను నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో తీవ్ర ఒత్తిడి, మానసిక అలసట, ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణమే ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, విద్యా నిపుణుల సలహాలతో శాస్త్రీయమైన పద్ధతిలో కొత్త పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల స్థితిగతులపై కనీస అవగాహన లేకుండా, శాస్త్రీయత లేకుండా ఒక్కో పరీక్షకు ఐదు రోజుల చొప్పున సుదీర్ఘ అసమాన గ్యాప్ ఇచ్చారన్నారు.

# తెలంగాణ క్రీడాశాఖలో విప్లవాత్మక మార్పులు

'ప్రజాపక్షం' ఇంటర్వ్యూలో మంత్రి వాకిటి శ్రీహరి

119 నియోజకవర్గాల్లో 'ఒలింపిక్స్ రెడీ' క్రీడా వేదికలు

ములుగు జిల్లాలో 40 ఎకరాల్లో స్పోర్ట్స్ స్కూల్

(బిరుదరాజు వాసుదేవరాజు)

"తెలంగాణ రాష్ట్రంలో నీళ్లు, నిధులు, ఉద్యోగాలతో పాటు క్రీడలను సైతం అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించింది. 2014 నుంచి శిథిలావస్థలో ఉన్న క్రీడా శాఖను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇప్పుడిప్పుడే గాడిలో పెట్టి ప్రపంచ స్థాయిలో నిలబెడుతున్నాం. తెలంగాణలో గ్రామస్థాయి నుంచి యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని, స్ఫూర్తిని వెలికితీసేందుకు ప్రత్యేక స్పోర్ట్స్ పాలసీని రూపొందించాం. ఇది తెలంగాణ భావితరాల భవిష్యత్తును మార్చుతుంది" అని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం రెండేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా రాష్ట్రంలో క్రీడా శాఖ పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి వాకిటి శ్రీహరితో 'ప్రజాపక్షం ప్రతినిధి' ఇంటర్వ్యూ ఈ విధంగా ఉంది.

**ప్రశ్న: రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యలేమిటి ?**

**మంత్రి శ్రీహరి :** రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 'ఒలింపిక్స్ రెడీ' క్రీడా వేదికలు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే ఒలింపిక్స్‌రెడీ మినీ స్టేడియంలు ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది. గ్రామీణ స్థాయి క్రీడాకారులకు ఇందులో ప్రాధాన్యత ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లో క్రీడా రంగాన్ని మరింత శక్తివంతం చేయడానికి అనేక కీలక కార్యక్రమాలను అమలు చేసింది. గ్రామీణ స్థాయి నుండి అంతర్జాతీయ ప్రమాణాల వరకు క్రీడాకారుల కోసం మౌలిక వసతులు, శిక్షణా కేంద్రాలు, స్పోర్ట్స్ పాలసీలు, బడ్జెట్ పెంపు వంటి విభాగాల్లో విస్తృత మార్పులు తీసుకువచ్చింది.

**ప్రశ్న: రానున్న ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేందుకు ఎలాంటి ప్రణాళికలు రూపొందిస్తున్నారు?**



**మంత్రి శ్రీహరి :** రాష్ట్ర ప్రభుత్వం యువ క్రీడాకారులను 2036 ఒలింపిక్స్‌లో భారత ప్రతినిధులుగా పంపడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. ప్రత్యేక ఒలింపిక్ శిక్షణా సెంటర్లు బయోమెట్రిక్ అథ్లెట్ ట్రాకింగ్, ఫిజియో, న్యూట్రిషన్, మానసిక శిక్షణా విభాగాల విస్తరణ తెలంగాణ క్రీడాకారులను ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేసేందుకు సిఎం రేవంత్‌రెడ్డి స్పోర్ట్ పాలసీని రూపొందిచడం జరిగింది. తద్వారా క్రీడాకారులకు వారి క్రీడల్లో మరిత క్రీడా నైపుణ్యం పెంచుతాము. స్పోర్ట్స్ డెవలప్మెంట్‌పై అందరి సలహాలు, సహకరాలు కూడా తీసుకుంటున్నాము.ఇది యువతను అంతర్జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయడంలో కీలక భూమిక పోషిస్తుంది.

**ప్రశ్న: ఫ్యూచర్ సిటీలో స్పోర్ట్స్‌పై దృష్టి పెట్టారా?**

**మంత్రి శ్రీహరి :** హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 1,000 ఎకరాల స్పోర్ట్స్ సిటీ స్థాపన ప్రక్రియ కూడా ప్రారంభ దశల్లో ఉంది. ప్రపంచ స్థాయి ఇండోర్, ఔట్‌డోర్ స్టేడియాలు, శిక్షణా కేంద్రాలు, అకాడమీలు, విదేశీ భాగస్వామ్యంతో స్పోర్ట్స్ హబ్‌గా రూపొందుతుంది.

**ప్రశ్న: స్పోర్ట్స్ అభివృద్ధికి ఎన్ని నిధులు కేటాయిస్తున్నారు?**

**మంత్రి శ్రీహరి :** 2025 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో క్రీడాశాఖ కేటాయింపులు గణనీయంగా పెరిగాయి. గత ఏడాదితో పోలిస్తే రూ.100 కోట్ల అదనపు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, యువ క్రీడాకారుల కోసం కోచింగ్, పాఠశాలల క్రీడా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చింది.

**ప్రశ్న: తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ-2025 ప్రత్యేకతలు ఏమిటి ?**

**మంత్రి శ్రీహరి :** తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ2025 ద్వారా క్రీడా శాఖ మరింత అభివృద్ధి చెందుతుంది. సరికొత్త స్పోర్ట్స్ పాలసీ 2025 రాష్ట్రాన్ని చాంపియన్స్ తయారుచేసే కేంద్రంగా తీర్చిదిద్దే విధంగా రూపొందించబడింది.

**ప్రశ్న: స్పోర్ట్స్ పాలసీ ద్వారా క్రీడాకారులకు ఎలాంటి ఉత్సాహం లభిస్తుంది?**

**మంత్రి శ్రీహరి :** ఒలింపిక్ బంగారు పతక విజేతలకు రూ.6 కోట్ల రివార్డు ఇవ్వనున్నాము. ప్రపంచ, జాతీయ పతక విజేతలకు స్కాలర్‌షిప్‌లు పెంచాము. గ్రామీణ క్రీడాల ప్రోత్సాహానికి ప్రత్యేక ఫండ్ ఏర్పాటు చేశాము.

**ప్రశ్న: స్కూల్ లెవల్‌లో ప్రతిభను వెలికితీసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

**మంత్రి శ్రీహరి :** స్కూల్ లెవల్ టాలెంట్ హంట్ కోసం ప్రభుత్వం మాజీ క్రికెట్ కెప్టెన్ అనిల్ కుంబ్లేతో ఒప్పందం కుదుర్చుకుంది. అతని ఫౌండేషన్‌తో కలిసి రాష్ట్రవ్యాప్తంగా టాలెంట్ ఐడెంటిఫికేషన్ ప్రోగ్రామ్ ప్రారంభమైంది. మొదటి దశలో 238 పాఠశాలలు ఎంపిక చేశాము. అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ, కోచింగ్, శారీరక విద్యా ఉపాధ్యాయులకు ఆధునిక శిక్షణ ఇస్తాము.

**ప్రశ్న: రాష్ట్రంలో స్పోర్ట్స్ స్కూల్ ప్రతిపాదన ఏమైనా ఉందా ?**

**మంత్రి శ్రీహరి :** ములుగు జిల్లాలో కొత్తగా రెసిడెన్షియల్ స్పోర్ట్స్ స్కూల్ కోసం 40 ఎకరాలు కేటాయించాం. ఈ స్కూల్ భవిష్యత్తులో ఓ ప్రాంతీయ క్రీడా శిక్షణా కేంద్రంగా అభివృద్ధి కానుంది.

**ప్రశ్న: తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ఏఏ ఒప్పందాలు చేసుకున్నారు?**

**మంత్రి శ్రీహరి :** గ్లోబల్ సమ్మిట్ భాగంగా ప్రభుత్వంతో పలు ప్రవేట్ సంస్థలు ఎంఒయులు కుదుర్చుకున్నాయి జిఎంఆర్ స్పోర్ట్స్, దుబాయ్ స్పోర్స్ కోసం రూ.1000 కోట్లతో శాటిలైట్ స్పోర్ట్స్ సిటీ ఏర్పాటు చేస్తారు. ఇండియాఎక్స్‌ట్రీమ్ అడ్వెంచర్ ప్రైయివేట్ లిమిటెడ్ రూ.500 కోట్లతో అడ్వెంచర్ స్పోర్స్ ఏర్పాటు చేస్తారు. సూప్రెక్రోస్ ఇండియా లిమిటెడ్ రూ.75 కోట్లతో గచ్చిబౌలి స్టేడియంలో మోటారు రేసింగ్ గేమ్స్ ఏర్పాటు చేశారు. తద్వారా 10 వేల మందికి ఉపాధి కలుగుతుంది.

# సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆధిక్యం

ప్రజల విశ్వాసానికి నిదర్శనం
టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పంచాయతీ ఎన్నికలు తొలి విడతలో కాంగ్రెస్ మద్దతుదారుల ఘనవిజయం పార్టీపై ప్రజల అపార నమ్మకానికి నిదర్శనమని టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 90 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ అనుబంధ అభ్యర్థులు విజయం సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ ఫలితాలు ప్రజల ఆశయాలు, ఆకాంక్షలకు అద్దం పట్టడంతో పాటు, ప్రభుత్వంపై ఉన్న విశ్వాసాన్ని మరోసారి తేటతెల్లం చేశాయన్నారు. పంచాయతీ ఎన్నికలను కాంగ్రెస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో, గ్రామ స్థాయి వరకు వ్యూహాత్మక ప్రచారం, సమన్వయం, పర్యవేక్షణ చేపట్టడంతో విజయాన్ని సాధించగలిగామని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండు సంవత్సరాలుగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరువై, గ్రామీణ ఓటర్లలో కాంగ్రెస్‌పై నమ్మకం బలపడిందన్నారు. స్థానిక సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేయడం కూడా ఈ ఫలితాలకు కారణమని చెప్పారు. సంక్షేమం, సామాజిక న్యాయం, అభివృద్ధి నినాదంతో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని, మైనారిటీలు, దళితులు, గిరిజనులు, మహిళలు, రైతులు, యువత విస్తృతంగా మద్దతు తెలపడం గ్రామీణ పాలనా వ్యవస్థలో నూతన దిశకు సంకేతమని ఆయన అభిప్రాయం వ్యక్త చేశారు. ఈ ఎన్నికల్లో సామాజిక న్యాయం స్పష్టంగా ప్రతిబింబించిందన్నారు. ఈ విజయం పార్టీపై మరింత బాధ్యతను ఉంచిందని, గ్రామీణ అభివృద్ధిని వేగవంతం చేయడంలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మహేశ్ గౌడ్ హామీ ఇచ్చారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి కేంద్రంగా మార్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతున్నదని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల తొలివిడత ఫలితాలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల పట్ల గ్రామీణ స్థాయిలో ఏర్పడిన అనుకూల వాతావరణానికి నిదర్శనమని, ఇవి తెలంగాణలో కాంగ్రెస్ బలోపేతానికి మార్గదర్శకమన్నారు.



## ఆయిల్ ఫెడ్ కార్యాలయాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆయిల్‌ఫెడ్ ఉద్యోగులు విధులకు ఆలస్యంగా హాజరవ్వడం పట్ల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అసంతృప్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఆయిల్ ఫెడ్ కార్యాలయాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల పనితీరు, నిర్వహణ, ఉద్యోగుల హాజరు, రైతులకు అందిస్తున్న సేవలు తదితర అంశాలను సమీక్షించారు.

# అధికారులు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి కార్మికులను ఆదుకోవాలి

మూడు నెలల నుంచి జీతాలు లేక
అల్లాడుతున్న 20 వేల మంది
రైల్వే ఔట్‌సోర్సింగ్ వర్కర్స్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వేలో పనిచేస్తున్న 20 వేల మంది ఔట్ సోర్సింగ్ వర్కర్లు మూడు నెలల నుంచి జీతాలు లేక అల్లాడుతున్నారని రైల్వే ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అఖిలభారత అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాఘవ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లకు సంబంధిత రైల్వే అధికారులు బిల్లులు చెల్లించకపోవడం వల్ల జీతాలు నిలిచిపోయాయని వారు స్పష్టం చేశారు. వెంటనే అధికారులు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి కార్మికులను ఆదుకోవాలని వారు కోరారు. మూడు నెలల నుండి కాంట్రాక్టర్లకు, రైల్వే అధికారులు బిల్లులు చెల్లించకుండా కాలం వెళ్లబుచ్చుతున్నారన్నారు. రైల్వే కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా ఇదే పరిస్థితి కొనసాగితే ఇటు కాంట్రాక్టర్ల పరిస్థితి, అటు కార్మికులు గడ్డు స్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రైల్వే అధికారులు బిల్లులు చెల్లిస్తేనే కాంట్రాక్టర్లు వెంటనే కార్మికులకు కూడా జీతాలు చెల్లిస్తారు, లేనిపక్షంలో కార్మికులు మరియు కాంట్రాక్టర్లు ఆందోళన బాటపడతామని వారు హెచ్చరించారు. ఔట్‌సోర్కింగ్ వర్కర్లకు రైల్వే అధికారులు ఆగస్టు మాసంలో ఇచ్చిన బిల్లులు రైల్వే బోర్డు సర్కిల్ సర్వీస్ కాంట్రాక్టర్లకు ప్రతినెల బిల్లులు చెల్లించాలని రూల్ ఉన్నప్పటికీ ఆగస్టు నుండి ఇప్పటివరకు బిల్లు ఏ ఒక్క కాంట్రాక్టర్‌కు కూడా చెల్లించలేదు, కాంట్రాక్టర్లు కూడా జీతాలు సరిగా ఇవ్వడంలేదు అని తెలిపారు. దక్షిణమధ్య రైల్వేలోని హైదరాబాద్, సికింద్రాబాద్, గుంటూరు, విజయవాడ, గుంతకల్, నాందేడ్ డివిజన్ పరిధిలో ప్రతి రోజు సుమారు 20వేల మంది ఔట్ సోర్కింగ్ ఉద్యోగులు తమ సేవలను అందిస్తున్నారన్నారు. ఈ కార్మికులు ప్రతి రోజు ట్రైన్ క్లీనింగ్, రైల్వే స్టేషన్‌లు క్లీన్, రైట్ ఆన్ బార్డ్ క్లినింగ్, బెడ్‌రోల్ వాషింగ్ తదితర పనులు చేస్తున్నారన్నారు. ఒక్కో కార్మికుడికి నెలకు రూ.18వేల నుంచి రూ.24 వేల వరకు జీతాలు ఉన్నాయన్నారు. వీరికి మూడు నెలల నుంచి జీతాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదాలు ఉన్నాయన్నారు. విద్యాసంవత్సరం త్వరలో ముగుస్తున్నందున వారి పిల్లలకు ఫీజులు చెల్లించాల్సి ఉందని, లేనిపక్షంలో వారికి వార్షిక పరీక్షలు రాయనివ్వరని తెలిపారు.

కార్మికుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సకాలంలో జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని వారు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవను కోరారు. ఇప్పటికే వేల సంఖ్యలో కార్మికులు అప్పులపాలై మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. ఇంటి అద్దెలు కూడా చెల్లించలేక పోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలో వీరి జీతాలు చెల్లించాలని, లేనిపక్షంలో కార్మికులు ఆందోళన బాట పట్టే అవకాశాలు ఉన్నాయని అన్నారు. తెలంగాణ, ఎపి రాష్ట్రాల్లో వేలాది కోట్ల రూపాయలతో రైల్వే స్టేషన్‌లను పునరాభివృద్ధి పనులు చేపట్టిన అధికారులు పేరుకు పోయిన కార్మి కుల జీతాలు రూ.300 కోట్లు విడుదల చేసేందుకు తాత్సారం చేయడం సిగ్గుచేటని వారన్నారు.

# నకిలీ విత్తనాలతో మోసపోయాం

వరి సాగులో నష్టం..కాలయాపన
చేస్తున్న జిల్లా అధికారులు
రైతు కమిషన్‌ను ఆశ్రయించిన
మెదక్ జిల్లా రైతులు
క్షేత్ర స్థాయి పరిశీలనకు అధికారులను
పంపిస్తాం: కోదండరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నకిలీ వరి విత్తనాలతో తాము మోసపోయామని, తమకు న్యాయం చేయాలని మెదక్ జిల్లా చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన రైతులు వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్‌ను ఆశ్రయించారు. హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డితో గురువారం సమావేశమయ్యారు. ఒకటి,రెండు రోజుల్లో అధికారులను క్షేత్ర స్థాయికి పంపించి, నివేదికను తెప్పించుకుని, వాటి ఆధారంగా న్యాయం జరిగేలా చూస్తామని రైతులకు కోదండరెడ్డి హామీనిచ్చారు. ఒక ప్రైవేట్ సీడ్ కంపెనీని నమ్మి సుమారు వంద ఎకరాలకు పైగా వరి సాగుచేస్తే, ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదని, పెట్టిన పెట్టుబడి కూడా పోయిందని 40 మంది రైతులు కమిషన్ ముందు వాపోయారు. ఎకరానికి 30 నుంచి 35 క్వింటాళ్ల ధాన్యం పండుతుందని, కోత సమయంలో వచ్చి ప్రభుత్వం ఇచ్చే ధర కంటే క్వింటా కు అదనంగా 150 రూపాయలు ఇస్తామని సదరు సీడ్ కంపెనీ ఆశ చూపారని వివరించారు. ఆ విత్తనాలతో ఎకరాకు 8 క్వింటాళ్లు రావడంతో వరి సాగుచేసిన రైతుల్లో ఆందోళన మొదలైందని కమిషన్ కు రుక్మాపూర్ రైతులు వివరించారు. కాగా ఇప్పటికే సీడ్ కంపెనీల మోసాన్ని కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, దీనిపైన అధికారులు కమిటీ వేసి కాలయాపన చేస్తున్నారు, తమకు నష్టపరిహారం ప్రకటించడం లేదని వివరించారు. రైతు కమిషన్ చొరవ తీసుకొని రుక్మాపూర్ రైతులకు సత్వర న్యాయం చేయాలని రైతులు కోరారు.


## బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది నా క్లయింట్ చిందాలియా పుష్ప, W/o. చిందాలియా అశోక్ అనే వ్యక్తి నివాస గృహం పాత ఇంటి నం. 4-122/A, కొత్త ఇంటి నం. 7-122, అసెస్‌మెంట్ నం. 1187005342 కలిగిన ఆస్తికి సంపూర్ణ యజమాని మరియు యజమాని అయ్యారని. ఓపెన్ ప్లాట్ 150.00 చదరపు గజాలు లేదా 125.41 చదరపు మీటర్లకు సమానం. గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ ఏరియా 354.39 చదరపు అడుగులు & గ్రౌండ్ ఫ్లోర్ ACC & మడ్ టైల్స్ ప్లింత్ ఏరియా 600.00 చదరపు అడుగులు. మొత్తం ప్లింత్ ఏరియా 954.39 చదరపు అడుగులు. ఇక్కడ ఉంది: పటేల్ రోడ్. వార్డ్ నెం.21, బ్లాక్ నెం.6, షాద్‌నగర్ మునిసిపాలిటీ, ఫరూక్‌నగర్ మండలం, తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా. ఫరూక్‌నగర్ సబ్-రిజిస్ట్రార్, రంగారెడ్డి రిజిస్ట్రేషన్ జిల్లా. తెలంగాణ, 17-02-2025 తేదీ 17-02-2025 ప్రకారం చిందాలియ అశోక్ నాకు అనుకూలంగా అమలు చేసిన డాక్యుమెంట్ నెం. 1726/2025 ప్రకారం రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్ ద్వారా, ఎవరైనా పేర్కొన్న ఆస్తిపై ఏదైనా క్లెయిమ్ లేదా అభ్యంతరం కలిగి ఉంటే, వారు ప్రచురణ తేదీ నుండి (7) రోజులలోపు వారి క్లెయిమ్‌కు మద్దతుగా అన్ని సంబంధిత పత్రాలతో కింద సంతకం చేసిన వ్యక్తిని వ్యక్తిగతంగా సంప్రదించాలి, నిర్ణీత వ్యవధిలోపు ఎటువంటి అభ్యంతరాలు రాకపోతే, ఎటువంటి క్లెయిమ్‌లు లేదా అభ్యంతరాలు లేవని భావించబడుతుంది.

లక్క చంద్రశేఖర్, న్యాయవాది
ఫ్లాట్ నెం. 203/ఎ, 2వ అంతస్తు,
6-3-850/9203/ఎ, శిరీష ప్లాజా,
అమీర్‌పేట, హైదరాబాద్-16
ఫోన్: 9951931764.



తెలంగాణ ప్రభుత్వము
వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుడిమల్కాపూర్.

నెం.వ్య.మా.క./గుడి/38/2025-26 **టెండరు ప్రకటన** తేదీ: 11/12/2025

వ్యవసాయ మార్కెట్ కమిటీ గుడిమల్కాపూర్ నందు రిటైల్ కూరగాయల మార్కెట్ నందు షాపులు కిరాయికి కలవు. కావున ఆసక్తి కల వారి నుండి టెండర్లు ఆహ్వానించడమైనది. టెండర్ ఫారం ధర మరియు ధరావత్తు సొమ్మును డిమాండు డ్రాఫ్ట్ ద్వారా సమర్పించినచో టెండర్ ఫారం పొందవచ్చును. డిమాండు డ్రాఫ్టును సెక్రటరీ, అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ, గుడిమల్కాపూర్ వారి పేరు మీద ఉండవలయును.

| క్ర.మ. సంఖ్య | వివరములు | టెండరు షెడ్యూలు ఫారం ధర | ధరావత్తు (EMD) రూ. |
| --- | --- | --- | --- |
| 1. | వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుడిమల్కాపూర్ పరిధిలో గల రిటైల్ కూరగాయల మార్కెట్ నందు కమర్షియల్ షాప్స్ No.7,15,20 లకు నెలవారీ కిరాయి కొరకు. | రూ.3,000/- | రూ.1,00,000/- |

టెండరు షెడ్యూలు జారీచేయుటకు తేదీ : 12.12.2025 తేదీ ఉదయము గం.10.30 నుండి తేదీ 18.12.2025 రోజున మధ్యాహ్నం 3.00 వరకు కార్యాలయ పనివేళలో టెండరు షెడ్యూలు అమ్మబడును. టెండరు షెడ్యూలు సమర్పించుటకు తేదీ : 20.12.2025 నాడు ఉదయము : గం.11.30 నుండి మధ్యాహ్నం గం.12.00 వరకు, తేదీ : 20.12.2025నాడు గం.12.30లకు టెండరు షెడ్యూలు తెరువబడును. అసంపూర్తిగా ఉన్న టెండర్ గాని, అభ్యంతరములు ఉన్న టెండర్లు అన్ని ఎలాంటి కారణము చూపకుండా టెండరు ఆమోదించుటకు లేదా తిరస్కరించుటకు లేదా వాయిదావేయుటకు లేదా మార్పు చేయుటకు లేదా టెండరు ప్రక్రియను ఏ దశలోనైన రద్దుచేయు అధికారము ఈ దిగువ సంతకముదారునకు కలదు. ఇట్టి విషయము నందు ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు. ఇతర వివరాల కొరకు కార్యాలయము నందు సంప్రదించగలరు.

సం/- చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుడిమల్కాపూర్.

సం/- కార్యదర్శి (FAC), వ్యవసాయ మార్కెట్ కమిటీ,గుడిమల్కాపూర్.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రజాభవన్‌కు తరలిరండి

రామ రాజేశ్ ఖన్నా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం ఉదయం 10గంటలకు ప్రజాభవన్‌కు తరలిరావాలని ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేశ్ ఖన్నా ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఎన్ హెచ్ ఎం లో వివిధ రకాల ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ ఉద్యోగులను కొంతమందిని అవుట్ సోర్సింగ్‌లోకి మార్చారని పేర్కొన్నారు.

# మతరాజ్యానికి బిజెపి కుట్ర

శతాబ్ది ఉత్సవాల స్ఫూర్తితో ఫాసిస్టు శక్తులను ప్రతిఘటిద్దాం

కమ్యూనిస్టు ఉద్యమ వీరుల త్యాగ ఫలితమే స్వాతంత్ర్య ఫలాలు

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా



**అనంతపురం:** శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు ఇదే స్ఫూర్తితో ఫాసిస్టు శక్తులను ప్రతిఘటించడానికి సమాయత్తం కావాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. అనంతపురంలోని లలిత కళాపరిషత్ వేదికగా సిపిఐ జిల్లా కమిటీ నేతృత్వంలో గురువారం జరిగిన అమరవీరుల సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి అధ్యక్షత వహించగా అతిథులుగా సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకష్ణ, ఎపి రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శులు చిరుతల మల్లికార్జున, జె.రాజారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ అనంతపురం ప్రాంతంతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. నీలం రాజశేఖర్ రెడ్డి జాతీయ కార్యదర్శిగా ఉండగా... పార్టీ సిద్ధాంతకర్తగా తాను ఎన్నోసార్లు అనంతపురం సందర్శించానని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో అనేకమంది కమ్యూనిస్టు నాయకులు ప్రజాసంక్షేమం కోసం తమ వ్యక్తిగత జీవితాలను, ఆస్తులను త్యాగం చేశారన్నారు.

భారతదేశం వలసరాజ్యంగా ఉన్నప్పుడు కమ్యూనిస్టు పార్టీ, కాంగ్రెస్ పార్టీ రెండూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాయన్నారు. కమ్యూనిస్టు కార్యకర్తలపై బ్రిటిష్ పాలకులు అణిచివేతలు, కుట్ర కేసులు నమోదుచేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ... ఎంగెజ్ వంటి కార్యకర్తలకు ఉరిశిక్ష విధించారని పేర్కొన్నారు. పూర్ణ స్వరాజ్ నినాదాన్ని భారత కమ్యూనిస్టు పార్టీనే మొదటగా ఇచ్చిందని, స్వతంత్ర భారత్‌కు రాజ్యాంగం అవసరం అనే విషయాన్ని కూడా కమ్యూనిస్టులే స్పష్టంగా ప్రతిపాదించారని రాజా తెలిపారు. మోదీ సర్కారు పార్లమెంటును నడుపుతున్న తీరును ఆయన విమర్శించారు. దేశ చరిత్రలోనే అత్యంత తక్కువ పనిదినాలుగా ప్రస్తుత సమావేశాలు జరుగుతున్నప్పటికీ పాలకులు వందేమాతరం వంటి విషయాలపై చర్చలు ముందుకు తెస్తున్నారన్నారు.

భారత కమ్యూనిస్టు పార్టీ 1925లోనే ఆవిర్భవించిందని గుర్తుచేసిన రాజా... స్వాతంత్ర్యోద్యమంలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమీ లేదని స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్...బ్రిటిష్ పాలకులకు అనేకసార్లు సహకరించిందన్నారు. ప్రస్తుత పరిస్థితులు దేశానికి ప్రమాదకరమని... స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న కమ్యూనిస్టులు, కాంగ్రెస్ నాయకులు బయట ఉండగా... అదే సమయంలో వలసవాదులకు సహకరించినవారే ఇప్పుడు రాజ్యాధికారాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించారు. మోదీ బయటకు గాంధీ పేరును జపిస్తున్నప్పటికీ ఆయన మనసులో గాంధీ హత్యకు బాధ్యుడైన నాథూరామ్ గాడ్సేనే ఉన్నాడని ఆరోపించారు. మహాత్మా గాంధీ ఇచ్చిన సర్వమత సౌహార్ద్రత, సమానత్వం సందేశాలను కమ్యూనిస్టులే ఆచరణలో పాటిస్తున్నారని రాజా పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ స్వేచ్ఛ, సమానత్వం విలువలను రాజ్యాంగ పీఠికలో పొందుపరచినా మతవాదులతో ఎప్పుడూ రాజీపడలేదన్నారు. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగంలోని లౌకిక, సోషలిస్టు పదాలను తొలగించి దేశాన్ని మత రాజ్యంగా మార్చే ప్రయత్నం చేస్తోందని రాజా తీవ్రంగా విమర్శించారు.

ఇటువంటి పరిస్థితుల్లో బీజేపీకి చంద్రబాబు నాయుడు, నితీశ్‌కుమార్ వంటి నేతలు మద్దతు ఎందుకిస్తున్నారని ప్రజలు ప్రశ్నించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ విధానాలు దేశ కార్మికుల, కష్టజీవుల ప్రయోజనాలకు పనికిరావని, అవి అంబానీఆదానీల ప్రయోజనాల కోసం మాత్రమే అమలు అవుతున్నాయని రాజా విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు ఆంధ్ర ప్రజలు వ్యతిరేకంగా నిలబడుతున్న విషయాన్ని గుర్తుచేశారు. భారత కమ్యూనిస్టుల చరిత్ర త్యాగాలతో కూడుకున్నదన్నారు. ఇటువంటి చరిత్ర కల కమ్యూనిస్టులు మతాధారిత ప్రభుత్వాలపై తప్పకుండా పోరాటం కొనసాగిస్తారని రాజా ప్రకటించారు. కష్టజీవులు ఉన్నంతవరకు కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఎవ్వరూ నాశనం చేయలేరని...అదే కమ్యూనిస్టుల అంతిమ విజయం అవుతుందని ఆయన స్పష్టం చేశారు.

**ఎర్ర జెండా పోరాటాలతోనే పేదోడికి భూమి: రామకృష్ణ**

సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకష్ణ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో అలుపెరగని పోరాటాలు సలిపిన ఎర్రజెండా... పేదవాడికి భూమి దక్కేవరకు ఉద్యమాన్ని కొనసాగించిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో 4500 మంది అసువులు బాసి 10 లక్షల ఎకరాలు భూమిని పేదలకు పంచడం జరిగిందన్నారు. రాయలసీమలో ముఖ్యంగా అనంతపురం జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు నిర్బంధాలకు ఎదురొడ్డి భూస్వాముల చెరలో ఉన్న వేల ఎకరాల భూమిని పేదలకు పంచి దున్నేవాడికి భూమి నినాదాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లారని చెప్పారు. ఐదుకల్లు సదాశివన్,నీలం రాజశేఖరరెడ్డి,తరిమెల నాగిరెడ్డి, వీకే ఆదినారాయణ రెడ్డి, గుత్తి రామకష్ణ, బంగి రామప్ప, బంగి ఎర్రిస్వామి, పిఎస్.శర్మ వంటి స్వాతంత్ర్య ఉద్యమ నాయకులు పేదల పక్షాన నిలబడి పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

# ఇక జిహెచ్‌ఎంసిలో 12 జోన్‌లు,60 సర్కిళ్లు

శివారు ప్రాంతాల్లో తగ్గిన వార్డుల సంఖ్యలో

పాత ప్రాంతాల్లో పెరిగిన వార్డుల సంఖ్య

నూతన జోన్‌లు, సర్కిళ్ల ఏర్పాటు ప్రక్రియకు శ్రీకారం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) పరిధి ఇటీవల విస్తరించిన నేపథ్యంలో, ఎన్నికల వార్డుల సంఖ్య పెరిగిన దానికి అనుగుణంగా పాలనా విభాగాల సంఖ్య కూడా రెట్టింపు కానుంది. హైదరాబాద్ నగర శివారు పట్టణ స్థానిక సంస్థలు ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 20 మున్సిపాలిటీలు జిహెచ్ఎంసిలో విలీనమైన విషయం తెల్సిందే. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సిజిజి)తో కలిసి జిహెచ్‌ఎంసి వార్డుల పునర్విభజన కసరత్తు పూర్తి చేసింది. ఈ క్రమంలో ఇప్పటికే ఉన్న 150 వార్డులకుగాను 300 వార్డుల కోసం ముసాయిదా నోటిఫికేషన్‌ను ప్రచురించిన విషయం తెల్సిందే. ప్రస్తుతం జిహెచ్‌ఎంసిలో ఆరు జోన్‌లు, 30 సర్కిళ్లు ఉన్నాయి. ప్రతి జోన్‌కు ఒక జోనల్ కమిషనర్, ప్రతి సర్కిల్‌కు ఒక డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌ల పర్యవేక్షణలో పరిపాలన సాగుతోంది. తాజా మార్పుల ప్రకారం, ఇక 12 జోన్‌లు, 60 సర్కిళ్లు కొత్తగా ఏర్పాటు కానున్నాయి. వార్డుల పునర్విభజన ప్రక్రియలో భాగంగా సూచనలు, అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. సూచనలు, అభ్యంతరాల స్వీకరణ అనంతరం వార్డుల పునర్విభజనలో మార్పులు చేర్పులు అనంతరం ప్రభుత్వ ఆమోదానికి పంపించనున్నారు. ప్రభుత్వం వార్డుల పునర్విభజనకు తుది నోటిఫికేషన్ వెలువరించిన అనంతరం కొత్త జోన్‌లు, సర్కిళ్లకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించేందుకు అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. శాసనసభ నియోజకవర్గం, వార్డుల పరంగా నూతన జోన్‌లు, సర్కిళ్లు ఏర్పాటు చేయనున్నారు. వార్డుల పునర్విభజనపై సభ్యులు చర్చించడానికి, సలహాలు ఇవ్వడానికి, అభ్యంతరాలను లేవనెత్తడానికి ఈనెల 16న పాలకమండలి ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.

**వార్డుల విభజనకు ప్రధాన ఆధారం ఓటర్ల సంఖ్య..**

వార్డు/డివిజన్ సరిహద్దులను నిర్ణయించడానికి ఓటర్ల సంఖ్య ప్రధాన ప్రమాణంగా తీసుకున్నామని ఒక సీనియర్ అధికారి తెలిపారు. ప్రతి వార్డు/డివిజన్‌లో సుమారు 40,000 మంది ఓటర్లు ఉండేలా నిర్దేశించారు. దీనిలో 10,000 ఓటర్ల తేడాకు అవకాశం ఉంది. దీని ఫలితంగా అధిక జనాభా సాంద్రత ఉన్న వార్డులు, తక్కువ జనాభా సాంద్రత ఉన్న వార్డుల కంటే భౌగోళికంగా చిన్నవిగా మారే అవకాశం ఉంది.

**ఎక్కడెక్కడ పెరిగాయి..**అధిక జనాభా ఉన్న కొన్ని వార్డుల సరిహద్దులు ప్రస్తుత పునర్విభజనలో మారిపోయాయి. దీనివల్ల శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ముషీరాబాద్, పాతబస్తీలోని మరి కొన్ని శాసనసభ నియోజకవర్గాలలో వార్డుల సంఖ్య పెరిగింది. ఈ ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో ప్రజలు నివసించే బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయి. జనాభా సాంద్రత కారణంగా ప్రధాన నగరంలో కూడా అనేక ప్రాంతాలలో వార్డుల సంఖ్య పెరిగింది. అయితే కొత్తగా విలీనమైన ప్రాంతాలలో జనాభా తక్కువగా ఉండటంతో వార్డుల సంఖ్య తక్కువగా ఉంది. పాతబస్తీలో వార్డుల సంఖ్య దాదాపు రెట్టింపు కావడంతో ఈ మార్పులు రాజకీయంగా చాలా ప్రాధాన్యతను సంతరించుకుంది.

**నిధులలో అన్యాయంపై ఆందోళన..**వార్డుల పునర్విభజనపై ప్రజలు, రాజకీయ వర్గాల నుండి నిరసనలు మొదలయ్యాయి. ఈ మార్పులకు వ్యతిరేకంగా ఇప్పటికే జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కి వినతిపత్రాలు సమర్పించారు. గతంలో బడంగ్‌పేట్, జల్‌పల్లిలకు చెందిన నివాసితులు తమ ప్రాంతాలను చార్మినార్ జోన్‌లో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే ఉన్న చార్మినార్ జోన్ నుండి ఆస్తి పన్ను వసూలు చాలా తక్కువగా ఉంది. గతంలో తమ కార్పొరేషన్ రంగారెడ్డి జిల్లాలో ఆస్తి పన్ను వసూలులో అగ్రస్థానంలో ఉండేది. మమ్మల్ని చార్మినార్‌తో కలిపితే, తక్కువ వసూలు ఉన్న ప్రాంతాల అభివృద్ధికి మా నిధులు ఉపయోగిస్తారు. తద్వారా తాము నివసించే ప్రాంతాలు నష్టపోతాయి అని బడంగ్‌పేట్‌కు చెందిన స్థానికులు వాపోయారు. ఈ మేరకు వారు జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. బిజెపి, ఎంఐఎం నేతలు కూడా కమిషనర్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందచేశారు.

## మరింత బలోపేతం అవుతున్నాం

పంచాయతీ ఫలితాలే నిదర్శనం

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పంచాయతీ ఎన్నికల మొదటి దశ ఫలితాల్లో గ్రామీణ ప్రజలు ఇచ్చిన విజయంతో మరింత బలోపేతం అవుతున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ క్రమేణా గ్రామాల్లో బలోపేతం అవుతోందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారని అన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ గ్రామీణాభివృద్ధి పథకాలే ఈ విజయానికి కారణమన్నారు.

వీటిలో కొత్త రోడ్లు, వీధి దీపాలు, శ్మశానవాటికలు, రైతు వేదికలు, ఉచిత బియ్యం, పక్కా ఇళ్లు, మరుగుదొడ్లు, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, మహిళా సంఘాలకు రుణాలు, స్వయం ఉపాధి పథకాలు, ఉపాధి హామీ నిధులు, తాగునీరు, ఆరోగ్య భద్రత, పిఎంకిసాన్ వంటి పథకాలు గ్రామీణ జీవనాన్ని మెరుగుపరుస్తున్నాయన్నారు. మిగిలిన రెండు దశల ఎన్నికల్లో బిజెపి మరింత బలంగా పోటీ చేస్తుందన్నారు.

## అఖండ–2 రేట్ల పెంపు నిలిపివేత
### హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హీరో, ఏపీలో టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ2 సిన్మా టిక్కెట్ రేట్లను పెంపుదలకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు సస్పెండ్ చేసింది. మెమో అమలును నిలిపివేసింది. కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా జీవో ఎలా జారీ చేస్తారని ప్రభుత్వాన్ని ప్రకటించింది. టిక్కెట్ రేట్ల వ్యవహారం విచారణ పెండింగ్లో ఉండగా, మెమో జారీ చేయడం కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని అభిప్రాయపడింది. సుమోటోగా ఎకోర్టు దిక్కరణ కింద చర్యలు ఎందుకు తీసుకోరాదో చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. గతంలో ఇదే తరహా మెమోను హైకోర్టు నిలిపివేసిన తర్వాత కూడా ప్రభుత్వం కొత్త సిన్మా వచ్చినప్పుడల్లా మెమో ఇవ్వడంపై అసహనం వ్యక్తం చేసింది. హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో పాటు తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర టెలివిజన్ అండ్ థియేటర్ అభివృద్ధి సంస్థ, 14 రీల్స్ ప్లస్కు నోటీసులు జారీ చేసింది. విచారణ శుక్రవారం కొనసాగిస్తామని జస్టిస్ ఎన్వీ శ్రవణ్కుమార్ గురువారం ప్రకటించారు. అఖండ 2 సినిమా టికెట్ల ధర పెంపును సవాల్ చేస్తూ. హైదరాబాద్ చందానగర్కు చెందిన కిలారు సుమన్తోపాటు మరో ఇద్దరు అత్యవసర లంచ్మోషన్ పిటిషన్లు దాఖలు చేశారు.

అఖండ2 టికెట్ ధరలు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు టికెట్ రేట్లు పెంచుకునేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టిక్కె రూ.50, మల్టీప్లెక్సో రూ.100 అదనంగా పెంపునకు అనుమతిచ్చిందన్నారు. గురువారం జరిగే ప్రీమియర్ షో టికెట్ ధరను రూ. 600గా నిర్ణయించిందన్నారు. ఈ మేరకు హోం శాఖ ఈ నెల 10న మెమో జారీ చేసిందన్నారు.గతంలో ఆదేశించిన మేరకు జీవో 120 ప్రకారం టికెట్ ధరలకు కట్టుబడి ఉండేలా ప్రభుత్వాన్ని తిరిగి ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది వాదిస్తూ, పిటిషనర్లు టికెట్లు కొనలేదని, వారిపై జీవో ప్రభావం లేదన్నారు. టిక్కెట్రేట్ల పెంపు మెమోకు వ్యతిరేకంగా ఉత్తర్వులు ఇవ్వొద్దని కోరారు. అనంతరం హైకోర్టు మెమోను సస్పెండ్ చేస్తూ వెలువరించిన ఉత్తర్వుల కాపీని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ఈమెయిల్ చేయాలని ఆదేశించింది.

## కేటినెట్ హోదా కల్పనపై పిల్
### బిఆర్ఎస్‌పి అభ్యంతరాల తోసివేత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలకు క్యాబినెట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ బిఆర్ఎస్ నాయకుడు ఎర్రోళ్ల శ్రీనివాస్ దాఖలు చేసిన పిల్కు నెంబర్ కేటాయించాలని రిజిస్ట్రీకి ఆదేశాలిచ్చింది. ప్పి రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చింది. ఇదే అంశంపై 2017లో నాటి ప్రతిపక్ష నాయకుడు రేవంత్రెడ్డి వేసిన పిల్తో కలిపి ఈ పిల్ను కూడా వచ్చే వారంలో విచారిస్తామని చెప్పింది. ప్రస్తుత సీఎం రేవంత్రెడ్డి 2017లో దాఖలు చేసిన దాఖలు చేసిన పిల్ను ఈ పిటిషన్కు జత చేయాలని చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం ప్రకటించింది.

క్యాబినెట్ హోదా కల్పనకు గతంలోని బిఆర్ఎస్ ప్రభుత్వ చర్యను 2017లో అప్పటి ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి హైకోర్టులో సవాలు చేశారని పిటిషనర్ న్యాయవాదులు చెప్పారు. తాము దాఖలు చేసిన పిల్కు రిజిస్ట్రీ నెంబర్ కేటాయించకపోవడం చెల్లదన్నారు. రాజకీయ నాయకులు ప్రతిపక్షంలో ఉండగా ఓ నిర్ణయం తీసుకుంటారని., అధికార పగ్గాలు అందకోగానే అందుకు విరుద్ధంగా చర్యలు ఉంటున్నాయని చెప్పారు. మొత్తం ఎమ్మెల్యేల్లో 15 శాతానికి మించి క్యాబినెట్ ర్యాంక్ ఉండకూడదని ఆర్టికల్ 164 (1ఏ) నిర్దేశిస్తోందని చెప్పారు. ఇప్పుడు 16 మంది మంత్రులుగా ఉన్నారని, మరో 14 మందికి క్యాబినెట్ హోదా కల్పన చెల్లదన్నారు. వాదనల అనంతరం హైకోర్టు పిల్కు నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. విచారణను వాయిదా వేసింది.

# 95ఏళ్ళ వయస్సులో సర్పంచ్

**సూర్యాపేట జిల్లా నాగారం గ్రామ సర్పంచ్‌గా గుంటకండ్ల రామచంద్రారెడ్డి గెలుపు**



**ప్రజాపక్షం/సూర్యాపేట :** తుంగతుర్తి నియోజక వర్గంలోని నాగారం మండల కేంద్రంలో గురువారం గ్రామ పంచాయితీకి జరిగిన ఎన్నికలో మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తండ్రి బిఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి గుంటకండ్ల రామచంద్రారెడ్డి 135 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. స్థానిక సంస్థల తొలిపోరు ఎన్నికల్లో ఈయన గెలుపు ఓటముల పైనే జిల్లా ప్రజలందరూ ఆసక్తిగా ఎదురు చూశారు. 94 ఏండ్ల వయస్సులో రామచంద్రారెడ్డి సర్పంచ్‌గా పోటీ చేయడం సోషల్ మీడియాలో పెద్దఎత్తున ప్రచారం సాగింది. మొదట ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకయ్యేలా చేయాలని బిఆర్ఎస్ పట్టుబట్టినా స్థానిక అధికార కాంగ్రెస్ నాయకులు దానికి ఏ మాత్రం అంగీకరించలేదు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ తన వర్గానికి చెందిన కన్నెబోయిన వెంకట బిక్షం యాదవ్‌ను సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలుపగా మాజీ మంత్రి, స్వర్గీయ రాంరెడ్డి దామోదర్ రెడ్డి వర్గానికి చెందిన వారు చిప్పలపల్లి మధును పోటీలోకి దింపారు. దీంతో నాగారం పంచాయితీ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఏర్పడింది. గ్రామంలో మొత్తం 2,448 ఓట్లు ఉండగా 2,133 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 10 వార్డులు 9 వార్డుల్లో బిఆర్ఎస్ అభ్యర్థులు గెలుపొందగా ఒక వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి గెలిచాడు. కౌంటింగ్ ప్రారంభం నుండి రామచంద్రారెడ్డి, కన్నెబోయిన వెంకటబిక్షం యాదవ్ మధ్య గెలుపు ఓటములు దోబుచులాడగా చివరకు రామచంద్రారెడ్డిని విజయం వరించింది. బిఆర్ఎస్ నాయకులు రామచంద్రారెడ్డి గెలుపు నల్లేరుమీద నడకేనని భారీ మెజార్టీతో గెలుపొందుతాడని అంచనాలు వేసినా ఎమ్మెల్యే మందుల సామేల్ వర్గం బలపర్చిన కన్నెబోయిన వెంకట బిక్షం యాదవ్ గట్టి పోటీనిచ్చారు.

## బిసి రిజర్వేషన్లపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

లోక్‌సభలో చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును గవర్నర్ ఆమోదించడంలో జరుగుతున్న జాప్యంపై కాంగ్రెస్ నాయకులు చామల కిరణ్ కుమార్ రెడ్డి లోక్‌సభలో గళమెత్తారు. దేశ ప్రధానమంత్రి ఒబిసి వర్గానికి చెందిన వ్యక్తిగా ఈ అంశంపై తక్షణమే జోక్యం చేసుకుని, బిల్లు ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు, విద్య, ఉద్యోగాల్లో బిసిలకు ఏకంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకున్న విషయాన్ని కిరణ్ కుమార్ రెడ్డి సభ దృష్టికి తీసుకెళ్లారు. సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ తీర్మానాన్ని క్యాబినెట్‌లో ఆమోదించి, ఆపై అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందని వివరించారు.

**ఆరు నెలలుగా గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్**

అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిన బిసి రిజర్వేషన్ల బిల్లును ఆరు నెలల క్రితమే గవర్నర్ ఆమోదం కోసం పంపించినా, ఇప్పటికీ దానిపై ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 'తెలంగాణ రాష్ట్రంలోని బిసిల మనోభావాలు, ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. స్వయంగా ఒబిసి ప్రధానమంత్రిగా ఉన్న నరేంద్ర మోదీ ఈ బిల్లు ఆమోదానికి చొరవ తీసుకుని, ఆరు నెలల పెండింగ్‌కు తెరదించాలని కోరుతున్నాను,' అని చామల కిరణ్ కుమార్ రెడ్డి లోక్ సభలో విజ్ఞప్తి చేశారు.

## 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా

రూ.750 కోట్ల విలువైన భూమి చుట్టూ ఫెన్సింగ్




**ప్రజాపక్షం/హైదరబాద్ :** మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలం నిజాంపేట విలేజ్ సర్వే నెంబరు 191లో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా గురువారం కాపాడింది. దీని విలువ రూ. 750 కోట్లకు పైగా ఉంటుందని అంచనగా ఉంది. ఇక్కడ ప్రభుత్వ భూమి కబ్జా జరుగుతుందని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారులతో కలిసి విచారించింది. ఆక్రమణలను నిర్ధారించుకుంది. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదేశాల మేరకు శాశ్వత నివాసాల జోలికి వెళ్లకుండా. మిగతా షెడ్డులను, ప్రహరీలను తొలగించి, 10 ఎకరాల భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసి బోర్డులు ఏర్పాటు చేసింది.

## రూ.5వేలు జరిమానా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాల పరిధిలో జీవో 111ను అమలుపై దాఖలైన పిల్లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. జీవో అమలు తీరును వివరించాలన్న గత ఆదేశాలను అమలు చేయని ప్రభుత్వానికి రూ.5 వేలు జరిమానా విధించింది. వారం రోజుల్లోగా ఈ మొత్తాన్ని స్టేట్ లీగల్ సర్వీసెస్ అథార్టీకి చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. జంట జలాశయాలు పరిధిలోని ఎకో జోన్లో అక్రమ నిర్మాణాలను ఆపేలా అధికారులకు ఉత్తర్వులివ్వాలంటూ రంగారెడ్డి జిల్లా మెయినాబాద్ మండలం పెద్ద మంగళారం గ్రామానికి చెందిన మందడి మాధవరెడ్డి వేసిన పిల్ను చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ గురువారం విచారించింది. విచారణ ఈ నెల 30కి వాయిదా వేసింది.

# గువహాటిలో చల్లారని మంటలు

ఆర్మీ,ఎయిర్‌ఫోర్స్ సహాయం

**గువహటి:** అసోం రాజధాని నగరం గువహటిలోని వాణిజ్య భవన సముదాయంలో చెలరేగిన మంటలు 33 గంటల తర్వాత కూడా అదుపులోకి రాలేదు. దీంతో భారత సైన్యం, వాయుసేన కూడా జత కలిసింది. దాదాపు రెండు డజన్ల పైగా అగ్ని–ప్రమాద విపత్తు నివారణ బృందాలు కష్టపడుతున్నప్పటికీ ఈ మంటలు అదుపులోకి రాలేదని సీనియర్ అధికారి ఒకరు గురువారం చెప్పారు. ఇంకా ఆరో అంతస్తులో మంటలు చెలరేగుతున్నాయి. రెండో అంతస్తులోంచి కూడా ఇంకా పొగలు వస్తున్నాయి. వాస్తవానికి షాపింగ్ మాల్ గోదాము లోంచి మొదట మంటలు చెలరేగాయి. నిర్మాణ సమయంలో సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల అగ్నిమాపక వాహనాలు, సిబ్బంది సరైన మార్గాలలోంచి లోపలికి ప్రవేశించలేకపోతున్నారని సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. ఇప్పటి వరకూ అగ్నిమాపకదళ సిబ్బందిలో ఒకేఒక్కరికి స్వల్పగాయాలయ్యాయి.

గువహటి స్వాగత స్క్వేర్ కాంప్లెక్ వద్ద ఎబిసి పాయింట్‌లో బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు మంటలు చెలరేగాయి.ఎస్‌బిఐ జోనల్ కార్యాలయం కమర్షియల్ బ్రాంచి, ప్రీమియమ్ బ్యాంకింగ్ బ్రాంచి, షాపింగ్ మాల్, బహుళ అంతస్తుల భవంతి నివాసాలలో ఈ మంటలు చెలరేగాయి. 25కు పైగా అగ్నిమాపక బృందాలు, అగ్నిమాపక వాహనాలు 33 గంటలుగా ఈ మంటలను ఆర్పే పనిలో నిమగ్నమై ఉన్నాయి. భారత సైన్యం, వైమానిక దళం కూడా ఈ మంటలను అదుపుచేసే పనిలో జతకలిశాయి. నీటిని గగనతలమార్గంలో తీసుకువచ్చి జల్లుతున్నారు. గువహటి రిఫైనరీ సిబ్బంది కూడా ఇందులో చేరారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బందిని కూడా సహాయం కోసం పిలిపించారు. గువహటితోపాటు మోరిగావ్, కామ్‌రూప్, నల్బరి జిల్లాల నుండి కూడా అగ్నిమాపకదళాలను కూడా ఈ మంటలను అదుపు చేయడానికి తరలించారు.

## బిఆర్‌కె భవన్‌లో లిఫ్ట్‌లను ప్రారంభించిన కోదండరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన రెండు లిఫ్ట్‌ల ను తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, భవానీ రెడ్డిలతో కలిసి చైర్మన్ ఎం. కోదండరెడ్డి గురువారం ప్రారంభించారు. దాదాపు రూ. 40 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన లిఫ్ట్‌లు అందుబాటులోకి వచ్చాయి. వివిధ శాఖలతో పాటు ప్రధానంగా రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయానికి సమస్యలతో వచ్చే రైతులకు లిఫ్ట్ ఉపయోగపడుతుందని కోదండరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుకమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## మహారాష్ట్రలో 3 నెలల్లోనే 766 మంది రైతుల ఆత్మహత్య

**న్యూఢిల్లీ:** మహారాష్ట్రలో, కేవలం మూడు నెలల వ్యవధిలోనే 766 మంది రైతులుఆత్మహత్య చేసుకోవడం ఆందోళన కలిగిస్తున్నదని గురువారం రాజ్య సభ జీరో అవర్‌లో ఈ అంశాన్ని లేవనెత్తిన ఎన్‌సిపి-ఎస్‌సిపి సభ్యురాలు ఫౌజియా ఖాన్ ఆవేదన వ్యక్తం చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీకి సమర్పించిన నివేదికలో ఈ వివరాలు ఉన్నాయన్నారు. వారిలో 676 కుటుంబాలకు మాత్రమే సాయం లభించిందని, మిగతా 200 కుటుంబాలకు ప్రభుత్వం ఎలాంటి సాయం అందించలేదని ఫౌజియా ఆరోపించారు. భారీ వానలు, వరదల నేపథ్యంలో రూ. 31,628 కోట్ల నష్ట పరిహార ప్యాకేజ్ ప్రకటించినప్పటికీ, మైదానంలో రైతులకు దక్కింది నామమాత్రమేనని ఆమె అన్నారు. ఇలావుండగా, మహారాష్ట్ర ప్రభుత్వం అదనపు సాయం కోసం ఎలాంటి ప్రతిపాదనను కేంద్రానికి పంపలేదని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ లోక్‌సభలో తెలిపారు.

### ఉత్తర గోవా నైట్‌క్లబ్బులు, హోటళ్లలో...
## బాణసంచా వాడకంపై నిషేధం

**ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా అధికార యంత్రాంగం**

**పనాజీ :** దేశవ్యాప్తంగా వర్తనీయాంశమైన ఉత్తర గోవాలోని నైట్‌క్లబ్‌లో జరిగిన ఇటీవలి అగ్నిప్రమాదంతో అధికార యంత్రాంగం మేల్కొని ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఉత్తర గోవాలోని 'బిర్చ్ బై రోమియో లేన్ నైట్‌క్లబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 25మంది మరణించిన అనంతరం అక్కడి నైట్‌క్లబ్బులు, హోటళ్లు, పర్యాటక సంస్థల్లో బాణసంచా, స్పార్కర్లు, బాణసంచా తయారీలో స్మోక్ (పైరోటెక్నిక్స్) వాడకాన్ని నిషేధిస్తూ జిల్లా అధికార యంత్రాంగం ఒక ఉత్తర్వును జారీ చేసింది. డిసెంబరు 6న అర్ధరాత్రి అర్పోరాలోని నైట్‌క్లబ్‌లో జరిగిన విషాదకరమైన అగ్నిప్రమాదం తర్వాత ముందు జాగ్రత్త చర్యగా ఉత్తర గోవా జిల్లా బుధవారం సాయంత్రం ఈ ఉత్తర్వులు జారీచేసిందని అధికార వర్గాలు వెల్లడించాయి. భారత్ నాగరిక్ సురక్ష సంహిత2023లోని సెక్షన్ 163 కింద పర్యాటక సంస్థల లోపల బాణసంచా, స్పార్కర్లు, పైరోటెక్నిక్ ఎఫెక్ట్స్, జ్వాల విసిరే రకం పరికరాలు, పొగజనరేటర్లు, అగ్ని/ పొగ ఉత్పత్తి చేసే పరికరాల వాడకం, పేల్చడం, అగ్ని ప్రమాదం చేయడాన్ని నిషేధిస్తూ ఈ ఉత్తర్వు జారీ చేయబడింది' అని జిల్లా పరిపాలనా సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. డిసెంబరు 6న దాదాపు అర్ధరాత్రి సమయంలో ఉత్తర గోవాలోని బిర్చ్ బై రోమియో లేన్ నైట్ క్లబ్‌లో సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో ఐదుగురు పర్యాటకులు సహా 25మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. కాగా, ఈ నిషేధ ఉత్తర్వు ప్రకారం ఉత్తర గోవా అంతటా ఉన్న అన్ని నైట్ క్లబ్‌లు, బార్‌లు, విశ్రాంతి హోటళ్లు, గెస్ట్ హౌస్‌లు, రిసార్ట్స్, బీచ్ షాక్స్, తాత్కాలిక నిర్మాణాలు, కార్యక్రమ వేదికల వినోద సంస్థలకు వర్తిస్తుంది. అర్పోరాలోని 'బిర్చ్ బై రోమియో లేన్ నైట్‌క్లబ్‌లో జరిగిన విషాదకరమైన అగ్నిప్రమాదంపై ప్రాథమిక విచారణలో ప్రాంగణం లోపల విద్యుత్ బాణసంచా పేలిందని, దీంతో మంటలు చెలరేగాయని 25మంది అధికారులు ఇంతకు ముందు చెప్పారు.

**నైట్ క్లబ్ యజమానులు సౌరభ్, గౌరవ్‌లూథ్రాలు పోలీసుల అదుపులోకి..**

గోవాలోని నైట్ క్లబ్ అగ్ని ప్రమాదంలో 25మంది మరణించిన తర్వాత భారతదేశం నుండి పారిపోయిన యజమానులు సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రాలను థాయ్‌లాండ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. భారత ప్రభుత్వ అభ్యర్థన మేరకు నైట్ క్లబ్ యజమానులపై ఇంటర్‌పోల్ బ్లూ కార్నర్ నోటీస్ జారీ చేయగా వారిని అదుపులోకి తీసుకున్నామని వారు చెప్పారు. నిందితులు సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రాలను థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌లో అదుపులోకి తీసుకున్నామని, వారిని భారతదేశానికి తీసుకువచ్చే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. డిసెంబరు 7 తెల్లవారుజామున 1.17గంటలకు ఫుకెట్‌కు ఒక ట్రావెల్ పోర్టల్ ద్వారా టికెట్లు బుక్ చేసుకున్నారు. ఉత్తరగోవా అర్పోరాలో ఉన్నటువంటి వారి 'బిర్చ్ బై రోమియో లేన్' నైట్ క్లబ్‌లో జరిగిన అగ్నిప్రమాదం గురించి తెలుసుకున్న సౌరభ్ లూథ్రా, గౌరవ్ లూథ్రాలు గంటలోపు వారు ఈ ప్రక్రియను పూర్తిచేశారని అధికారులు తెలిపారు. పోలీసులు, అధికార యంత్రాంగం మంటల్లో చిక్కుకున్న బాధితులను, సిబ్బందిని రక్షిస్తున్న సమయంలోనే వారు ఆదివారం తెల్లవారుజామున ఇండిగో విమానంలో వెళ్లిపోయారని వివరించారు. వారిపై బ్లూ కార్నర్ నోటీస్ జారీచేయాలని గోవా పోలీసులు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ)ను సంప్రదించారు.



విచారణ కోసం ఢిల్లీ నుండి గోవాకు సహ యజమాని అజయ్ గుప్తా...

బిర్చ్ బై రోమియో లేన్ సైలెంట్ పార్ట్‌నర్ అని చెప్పుకున్న అజయ్‌గుప్తాను పోలీసులు విచారణ కోసం ట్రాన్సిట్ రిమాండ్‌పై ఢిల్లీ నుండి గోవాకు తీసుకొచ్చారు. బుధవారం రాత్రి 9:45గంటలకు గోవా పోలీసులు అజయ్‌గుప్తాతోకలిసిమనోహర్ఇంటర్నేషనల్‌ఎయిర్‌పోర్టులో దిగారు. తదుపరి విచారణ కోసం అయన్ను అంజునా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు ఒక అధికారి తెలిపారు. జమ్మూ నివాసిఅయిన అజయ్‌గుప్తాను బుధవారం ఉదయం ఢిల్లీలోని అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వినోద్ జోషి ముందు హాజరుపరిచారు. అతడిని రాష్ట్రానికి తీసుకెళ్లడానికి గోవాపోలీసులకు36గంటలట్రాన్సిట్ రిమాండ్ మంజూరు అయ్యింది. వెన్నెముక గాయంతో బాధపడుతున్న గుప్తాకు అతని బదిలీ సమయంలో సరైన వైద్య సంరక్షణ అందించాలని అధికారులను కోర్టు ఆదేశించింది.

## బెంగాల్ నుండి పోలింగ్ బూత్‌ల సమాచార జాప్యం : ఇసి ఆందోళన




**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఆకాశ హర్మ్యాలలో, ఇతర హౌసింగ్ సొసైటీలలో ఏర్పాటు చేసే పోలింగ్ బూత్‌లకు సంబంధించిన సమాచారం ఆ రాష్ట్రం నుండి రావడంలేదని కేంద్ర ఎన్నికల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ఈ సమాచారాన్ని పంపించకుండా జాప్యం చేస్తున్నారని ఎన్నికల కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. నిర్దేశిత గడువులోపు ఎన్నికల కమిషన్‌కు ఈ సమాచారాన్ని పంపించాల్సి ఉండగా ఇంతవరకూ ఈ సమాచారం అందలేదు. కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఎన్నికలకు సమయం తక్కువగా ఉందని ఎన్నికల సంఘం ఆందోళన పడుతోంది. ఒక పోలింగ్ బూత్‌లో ఓటర్ల సంఖ్య 1200 కంటే ఎక్కువగా ఉండకూడదని కూడా ఎన్నికల సంఘం నిర్ణయించింది. అంతకు మించితే కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. దీనికి సంబంధించిన సమాచారం కూడా సకాలంలో కేంద్ర ఎన్నికల సంఘానికి చేరుకోవాలి. కానీ జాప్యం జరుగుతోందని సంబంధిత అధికారి చెప్పారు. ఆకాశహర్మ్యాలలో కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరంపై విస్తారంగా సర్వే నిర్వహించాల్సిన అవసరం ఉంది. గ్రూప్ హౌసింగ్ సొసైటీలలో కూడా ఈ సర్వే జరగాలి ఎందుకంటే పోలింగ్ బూత్‌లలో ఓటర్ల సంఖ్య 1200 కంటే మించకూడదు. జిల్లాస్థాయి ఎన్నికల అధికారులు కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే విషయాలను ఖరారు చేయాల్సి ఉంటుంది. వాటిని ఏర్పాటు చేసేందుకు ఎన్నికల సంఘం అనుమతి తీసుకోవాలి. పశ్చిమ బెంగాల్ సిఇఓ కార్యాలయానికి ఈ మేరకు ఒక లేఖ పంపించామని ఎన్నికల సంఘం తెలిజేసింది. కానీ సమాచారం పంపించడంలో జాప్యం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. "మీ కార్యాలయం నుండి ఇప్పటివరకూ కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ఎలాంటి సమాచారం మాకు రాలేదు, ఎందుకు పంపలేదు" అని ఎన్నికల సంఘం వివరణ అడిగింది. ఐతే జిల్లాస్థాయి ఎన్నికల అధికారులు తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని, వారే జాప్యానికి కారణమని కూడా తెలుస్తున్నది. డిసెంబరు 16వ తేదీన బెంగాల్‌లో ఓటర్ల జాబితాల ముసాయిదా ప్రతులను ప్రచురించారు. ఇక పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయడానికి సంబంధించి సర్వే నిర్వహించాల్సి ఉంది. ముఖ్యంగా ఆకాశహర్మ్యాలలో ఎన్ని కొత్తగా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలన్న విషయాన్ని జిల్లాస్థాయి అధికారులు ఖరారు చేయడం లేదని ఎన్నికల సంఘం ఆందోళన చెందుతోంది. జిల్లాస్థాయి అధికారులకు ఇప్పటికే ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రతిపాదనలను డిసెంబరు 31 నాటికి సమర్పించవలసి ఉంది. 250 ఇళ్ళుగానీ, 500 మంది ఓటర్లు గానీ ఉంటే ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

## బెంగళూరు నుండి 60 ఇండిగో విమానాలు రద్దు




**ముంబై:** బెంగళూరు నుండి 60 ఇండిగో విమాన సర్వీసులను గురువారం రద్దు చేశారు. సంబంధిత విమానాశ్రయం గురువారం ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. అదేవిధంగా ఇండిగో సిఇఓ పిటర్ ఎల్బెర్స్‌ను తమ ఎదుటకు వచ్చి హాజరు కావాలని, ఇండిగోల రద్దు వ్యవహారంపై సమగ్ర నివేదిక సమర్పించాలని డిజిసిఎ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఎవియేషన్) ఆదేశించింది. ఈ మేరకు పిటర్ ఎల్బెస్‌కు ఆదేశాలు అందాయి. గురువారం నాటి సమాచారంతో సహా ఇటీవల జరిగిన రద్దు వ్యవహారంపై ఆయన సమగ్ర నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. కాగా బుధవారం (డిసెంబరు 10) 220 ఇండిగో విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఢిల్లీ, బెంగళూరు, ముంబయి మార్గాలలో ఈ సర్వీసులను రద్దుచేశారు. ఢిల్లీలోనే అత్యధికంగా 137 విమాన సర్వీసులను రద్దు చేశారు. గడచిన 10 రోజులుగా దేశంలో తలెత్తిన ఈ సంక్షోభంపై ఇండిగో ఛైర్మన్ విక్రమ్ మెహతా మొదటిసారి బుధవారం నోరు విప్పిమాట్లాడారు. విమాన సర్వాసుల నిర్వహణలో ఏర్పడిన గందరగోళంపై క్షమాపణలు తెలియజేశారు. ఈ గందరగోళం వెనుక విమానాలలో తలెత్తిన చిన్న చిన్న సాంకేతిక లోపాలు కూడా కారణంగా ఉన్నాయని చెప్పారు. చలికాలంలో వాతావరణం సహకరించకపోవడంవల్ల షెడ్యూలు మార్పు ఉంటుందని, దీనివల్ల రద్దీ పెరుగుతుందని, పైగా పైలట్ల డ్యూటీలను కూడా సర్దుబాటు చేయాల్సి ఉంటుందని, ఇవన్నీ సమస్యలుగా సంస్థను చుట్టుముడతాయని మెహతా చెప్పారు. దేశంలో ఉన్న ఇతర విమానయాన సంస్థలకు కూడా ఇదే విధమైన సమస్యలు నప్పటికీ ఇంత దారుణంగా వారి సేవలకు భంగం కలగకపోవడం విచిత్రవిషయం. ఐతే గడచిన తొమ్మిది నెలలలో ఇండిగో సంస్థలో 378 మంది పైలట్లు తగ్గారు. కావాల్సిన పైలట్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ ఏడాది మార్చి 20వ తేదీన పార్లమెంటు ప్రశ్నోత్తరాల్లో ఒక ప్రశ్నకు సమాధానంగా ఇండిలో 5,463 మంది పైలట్లు ఉన్నారని ప్రభుత్వం వెల్లడించింది. ఐనప్పటికీ డిసెంబరు8వతేదీన పార్లమెంటులో ఇదే అంశంపై మంత్రి ఇచ్చిన సమాధానంలో ఇండిగో పైలట్ల సంఖ్యను 5,085గా పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వం ఇండిగో కార్యాలయాలలో ఈ పరిస్థితిని పర్యవేక్షించేందుకు ఇద్దరు ప్రభుత్వ అధికారులనుఏర్పాటుచేయాలనినిర్ణయించింది. ఈ సిబ్బంది రోజువారీ నివేదికలను ప్రభుత్వానికి స మర్పిస్తారు. ఇదిలా ఉండగా పైలట్స్ బోడీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ (ఎఫ్‌ఐపి) సమీపగతంలో కొన్ని ఆరోపణలు చేసింది. ఇతర విమాన సంస్థలలో నిర్ణీత ప్రకారం చార్టులు తయారు చేస్తున్నారు. అందువల్ల ఆయా సంస్థలలో విమానాలు షెడ్యూలు ప్రకారం నడుస్తున్నాయి. కానీ ఇండిగో అనుసరించినసంప్రదాయ విరుద్ధమైన విధానాలు ప్రత్యక్ష సమస్యలకు దారితీశాయి.

## మా సూచీలు మేమే ఇచ్చుకుంటాం!

**కాలుష్య సమస్యపై కేంద్రం కొత్త సిద్ధాంతం**

**న్యూఢిల్లీ:** దేశంలో పెరుగుతున్న కాలుష్య సమస్యకు పరిష్కారాన్ని కనుగొని, ఆచరించాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నది. గ్లోబల్ క్లైమేట్ రిస్క్ ఇండెక్స్‌లో భారత్ తొమ్మిదో స్థానంలో ఉన్నప్పటికీ, దేశీయ పాలసీల రూపకల్పనకు ఏ బాహ్య ర్యాంకింగ్‌నైనా ప్రాతిపదికగా ప్రభుత్వం గుర్తించదని గురువారం పార్లమెంట్‌కు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పర్యావరణ, కాలుష్య సూచీలను సొంతంగానే రూపొందించుకుంటామని రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు జవాబులో, పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తెలిపారు. గ్లోబల్ క్లైమేట్ రిస్క్ ఇండెక్స్ అనేది తీవ్రమైన వాతావరణ పరిస్థితుల వల్ల దేశాల్లో ఏర్పడిన మానవ, ఆర్థిక నష్టాల ఆధారంగా ర్యాంకింగ్‌ను నిర్ధారిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అన్ని దేశాలూ ఈ సూచీని ప్రామాణికంగా తీసుకుంటాయి. కానీ, మోదీ సర్కారు ఈ సూచీని ప్రామాణికంగా తీసుకోబోమని తేల్చి చెప్పింది. తీవ్రమైమ వాతావరణ మార్పులు, చోటు చేసుకునే ఘటనల కారణంగా కలిగే ఆర్థిక నష్టాల అంచనాలు విస్తృతంగా మారుతాయని, మొత్తం నష్టాల్లో వాతావరణ మార్పు ప్రభావాన్ని ప్రత్యేకంగా వేరు చేయడం ఇప్పటికీ పెద్ద సవాలేనని మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ అన్నారు. బ్రెజిల్‌లోని బెలేం నగరంలో జరిగిన 'కాప్30' శిఖరాగ్ర సదస్సులో జర్మనీ విడుదల చేసిన క్లైమేట్ రిస్క్ ఇండెక్స్ (సిఆర్ఐ) 2026 ప్రకారం, గత మూడు దశాబ్దాల్లో అత్యంత ప్రమాదకర వాతావరణ ఘటనలు భారతదేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. 430కి పైగా చోటుచేసుకున్న సంఘటనల్లో 80,000 మందికి పైగా మరణించినట్టు నివేదిక చెబుతోంది. ఇలాంటి ప్రభావాలను ఎదుర్కొనేందుకు భారతదేశం జాతీయ విపత్తు నిర్వహణ విధానాన్ని అనుసరిస్తుందని, సురక్షితమైన, విపత్తులను ప్రతిఘటించగల భారతదేశాన్ని నిర్మించడం దాని లక్ష్యమని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ విధానం న్యాయ, ఆర్థిక, సంస్థాగత ఏర్పాట్లు, నివారణ, తగ్గింపు, సిద్ధత, స్పందన, సహాయ చర్యలు, పునరావాసం, పునర్నిర్మాణం, పునరుద్ధరణ వంటి లక్ష్యాలను సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వాతావరణ శాస్త్ర, సాంకేతిక శాఖ నిర్వహించిన క్లైమేట్ వల్నరబిలిటీ అసెస్‌మెంట్‌లో అత్యంత సమస్యాత్మక రాష్ట్రాల కోసం ప్రత్యేక నిధులు లేదా పథకాలు ఉన్నాయా? అనే ప్రశ్నకు, మంత్రి సమాధానమిస్తూ, భారత వాతావరణ చర్యలు జాతీయ వాతావరణ మార్పు కార్యాచరణ ప్రణాళిక (ఎన్‌ఎపిసిసి) ఆధారంగా ఉంటాయని తెలిపారు. దేశంలోని 34 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ తమ రాష్ట్ర వాతావరణ మార్పు కార్యాచరణ ప్రణాళికలను ఎన్‌ఎపిసిసికి అనుగుణంగా రూపొందించాయని, వాటి అమలు ఆయా ప్రభుత్వాల బాధ్యతగా ఉంటుందని ఆయన తెలిపారు.

### వైజాగ్ కాలుష్యం డబ్లుహెచ్‌ఒ ప్రమాణాల కంటే 10 రెట్లు అధికం

**న్యూఢిల్లీ:** రాజ్యసభలో గురువారం జీరో అవర్ సందర్భంగా ఇద్దరు వైఎస్‌ఆర్‌సిపి సభ్యులు, విశాఖపట్నంలో పెరుగుతున్న గాలి కాలుష్యం, అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని ఒక జాతీయ రహదారి విభాగం దిగజారుతున్న పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పార్టీ సభ్యుడు గొల్ల బాబూరావు మాట్లాడుతూ విశాఖపట్నం వరుసగా ఆరు సంవత్సరాలుగా దేశంలోని అత్యంత కాలుష్యం ఉన్న 10 నగరాల్లో ఒకటిగా నిలుస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. అక్కడ గాలి కాలుష్య స్థాయి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) సూచించిన పరిమితుల కంటే 10 రెట్లు ఎక్కువగా ఉందని గుర్తుచేశారు. ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ పరిశోధన కేంద్రం ప్రకారం, 2024 సెప్టెంబర్‌లో దేశవ్యాప్తంగా 67 నగరాలు రోజువారీ టాప్10 కాలుష్య నగరాల జాబితాలో చోటు సంపాదించగా, వాటిలో విశాఖ కనీసం ఐదుసార్లు కనిపించి, ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత కాలుష్య నగరంగా నిలిచిందని బాబూరావు చెప్పారు. 2024 సెప్టెంబర్, 2025 నవంబర్ నెలల్లో పరిస్థితి మరింత దిగజారిందని తెలిపారు. పరిశ్రమలు, వాహన ఉద్గారాలు, రోడ్డు ధూళి, నిర్మాణ కార్యకలాపాలు, బయోమాస్ దహనం వంటి అంశాలే వైజాగ్‌లో కాలుష్య సమస్యకుప్రధాన కారణాలని చెప్పారు. కాలపరిమితి మించిన వాహనాలను ఢిల్లీలో నిషేధిస్తే, వాటిని ఇతర రాష్ట్రాలకు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కుఅత్యధికంగాఅమ్ముతున్నారనిబాబూరావు అన్నారు.వాహనాల్లో సుమారు 70 కేవలం ఆంధ్రప్రదేశ్ వాసులే కొనుగోలు చేయడం ఆందోళన కలిగిస్తున్నదని, ఇది కాలుష్యాన్ని మరింత పెంచుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## జెన్‌జీతో డిజిటల్ ఆర్థికవ్యవస్థకు ఊపు

**న్యూఢిల్లీ:** భారతదేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ సరికొత్త మార్పును చూస్తోంది. ఎలా ఖర్చు చేయాలి? ఎలా ఆదా చేసుకోవాలి? క్రెడిట్‌ను ఎలా వినియోగించాలి? అనే దానిపై దేశ యువత తమదైన ముద్ర వేస్తున్నది. ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ మద్దతుతో పనిచేస్తున్న యువతకు అనుగుణమైన యూపీఐ ఫింటెక్ ప్లాట్‌ఫారమ్ సూపర్ మనీ విడుదల చేసిన తొలి వార్షిక వినియోగదారుల అధ్యయనం 'సూపర్‌స్పెండ్స్ 2025' ఈ పరిస్థితిని స్పష్టంగా చూపిస్తోంది. దేశవ్యాప్తంగా మిలియన్ల లావాదేవీల డేటాను విశ్లేషించిన ఈ నివేదిక జెన్‌జీ ఎలా కొత్త ఆర్థిక సంస్కృతిని నిర్మిస్తున్నారో వివరిస్తోంది. సూపర్ మనీ వినియోగదారుల్లో 72 శాతం మంది 30 ఏళ్ల లోపు వారు. ఈ వయసు వర్గం భారతదేశంలో డిజిటల్ చెల్లింపుల పెరుగుదలకు ప్రధాన ఇంధనంగా నిలుస్తోంది. వీరి కోసం పేమెంట్లు కేవలం లావాదేవీలు మాత్రమే కాదు. వ్యక్తిగత ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా తీసుకునే వ్యూహాత్మక నిర్ణయాలుగా మారాయి. ప్రతీ లావాదేవీని క్యాష్ బ్యాక్ రూపంలో 'ఖర్చుసంపాదన' అవకాశంగా చూడటం, అందరికీ కొత్త మార్గాన్ని చూపుతోంది. ఇందులో భాగంగా రోజువారీ చెల్లింపుల సంఖ్య గతంలో లేనంతగా పెరిగింది. వినియోగదారులు నెలకు 50కి పైగా చెల్లింపులు చేస్తుండగా... కొంతమంది నెలకు 200కి పైగా లావాదేవీలు నమోదు చేస్తున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల మధ్య గ్రోసరీ కొనుగోళ్లు, సాయంత్రం 6 నుంచి 11 గంటల మధ్య డైనింగ్, ఫుడ్ ఆర్డర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

## ఇ-సిగరెట్‌పై లోక్‌సభలో దుమారం

**న్యూఢిల్లీ:** ఈసిగరెట్‌పై లోక్‌సభలో దుమారం చెలరేగింది. తణమూల్ కాంగ్రెస్ ఎంపీలు ఈసిగరెట్ తాగుతుంటే చూసినట్లుగా బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ స్పీకర్ ఓం బిర్లా దృష్టికి తీసుకొచ్చారు. దేశమంతా ఈసిగరెట్‌పై నిషేధం ఉన్నట్లుగా అనురాగ్ ఠాకూర్ తెలిపారు. దీంతో లోక్‌సభ సభ్యులను ఉద్దేశించి స్పీకర్ రూలింగ్ ఇచ్చారు. ఇకపై సభలో ఎవరైనా సిగరెట్ తాగినట్లుగా తన దృష్టికి వస్తేచర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ప్రశ్నోత్తరాల సమయంలో అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ సభలో ఈసిగరెట్లు తాగడానికి అనుమతిస్తారా అంటూ స్పీకర్‌ను అడిగారు. అందుకు ఓం బిర్లాససేమిరా అన్నారు. దీనిపై అనురాగ్ ఠాకూర్ స్పందిస్తూ కొన్ని రోజులుగా సభలో తణమూల్ ఎంపీ ఈసిగరెట్ తాగుతున్నారని ఆరోపించారు. అతని పేరు మాత్రం వెల్లడించబోనని చెప్పారు. దేశవ్యాప్తంగా ఈసిగరెట్లు నిషేధించబడ్డాయని, అయినప్పటికీ సభలో తాగుతున్నట్లు తెలిపారు. చాలా రోజులుగా తణమూల్ కాంగ్రెస్ ఎంపీలు ఇలా చేస్తున్నారని, వెంటనే దర్యాప్తు చేయాలని కోరారు. ఓం బిర్లా జోక్యం చేసుకుంటూ సభలో సభ్యులు గౌరవాన్ని కాపాడుకోవాలని, లేదంటే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. పార్లమెంటరీ సంప్రదాయాలు, నియమాలకు కట్టుబడి ఉండాలని కోరారు. ఇకపై ఇలాంటివి తన దృష్టికి వస్తేచర్యతీసుకుంటాననివార్నింగ్ఇచ్చారు. 2019నాటినుంచి ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిషేధం ఉంది. భారతదేశంలో పూర్తిగా నిషేధించారు. తయారు చేయడం,దిగుమతి చేసుకోవడం, విక్రయించడం, పంపిణీ చేయడం, నిల్వ చేయడం లేదా ప్రకటన చేయడంచట్టవిరుద్ధం.పార్లమెంట్‌రూల్‌బుక్ ప్రకారం ధూమపానం నిషేధించబడిందని పేర్కొంది.

## అమిత్ షాలో ఆందోళన కనిపించింది: రాహుల్

**న్యూఢిల్లీ:** కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఛలోక్తులు విసిరారు. ఎన్నికల సంస్కరణలపై నిన్న రాజ్యసభలో మాట్లాడుతూ అమిత్‌షా చాలా కంగారుగా కనిపించారని రాహుల్ గాంధీ అన్నారు. ఆయన వాడిన భాష కూడా సరిగా లేదని విమర్శించారు. లోక్‌సభలో అమిత్‌షా ప్రసంగాన్ని ఉద్దేశించి గురువారం రాహుల్‌గాంధీ మీడియాతో మాట్లాడారు. 'నిన్న అమిత్‌షాజీ ఆందోళనగా కనిపించారు. ఆయన వాడిన భాష సరిగా లేదు. చేతులు వణుకుతూ కనిపించాయి. ఏ ప్రశ్నకు కూడా ఆయన నేరుగా సమాధానం చెప్పలేదు. వేటికీ ఆధారం చూపించలేదు. మీడియా ముందు నేను చేసిన వ్యాఖ్యలన్నింటిని పార్లమెంట్‌లో చర్చిద్దామని ఆయనకు సవాలు విసిరాను. కానీ ఆయన నుంచి ఎలాంటి సమాధానం రాలేదు' అని రాహుల్ అన్నారు. కాగా, పార్లమెంట్‌లో ప్రధా ని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతున్నప్పుడల్లా రాహుల్ బయటకు వెళ్లిపోతారని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ విమర్శించారు. రాహుల్ గాంధీ హిట్ అండ్ రన్ ఫార్ములాను అనుసరిస్తున్నారని, ఇదేనా ఆయన దృష్టిలో ప్రజాస్వామ్యమంటే అని ప్రశ్నించారు. భవిష్యత్తులో అయినా ఆయన ఆ అలవాటును మానేస్తారని అనుకుంటున్నానని చెప్పారు.



### ఇది బెంగాల్... యుపి కాదు
## మతం పేరిట విభజన హింస సహించం

**అర్హులైన ఒక్క ఓటరు పేరు తొలగించినా ధర్నా చేస్తా**
**కృష్ణనగర్ సభలో మమతా బెనర్జీ**



**కోల్‌కతా:** ఇది బెంగాల్... ఉత్తరప్రదేశ్ కాదంటూ సీఎం మమతా బెనర్జీ ఉద్ఘాటించారు. ఓటర్ల జాబితాల ప్రక్షాళన పేరిట నిర్వహిస్తున్న ఎస్‌ఐఆర్ క్రమంలో అర్హులైన ఒక్క ఓటరు పేరును తొలగించినా తాను స్వయంగా ధర్నాకు దిగుతానని హెచ్చరించారు. దేశ హోంమంత్రి భయంకరుడని వ్యాఖ్యానించారు. మతం పేరిట ప్రజలను విభజించడం, హింసకు పాల్పడటం వంటివి సహించేది లేదని కృష్ణనగర్ సభలో మమతా బెనర్జీ తేల్చిచెప్పారు. 'దేశ హోంమంత్రి చాలా ప్రమాదకరమైన వ్యక్తి. ఆయన ఎంతటి భయంకరుడే మీరే కళ్లారా చూడండి. ఒక కంటితో చూస్తే దుర్యోధనుడు. మరో కంటితో చూస్తే దుశ్శాసనుడు' అని మమత వ్యాఖ్యానించారు. 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండటంతో ఎస్‌ఐఆర్ ప్రక్రియను బీజేపీ అస్త్రంగా మల్చుకున్నదన్నారు. 'అర్హులైన ఓటర్ల పేర్లలో ఒక్కటి తొలగించినా ధర్నా చేస్తా' అని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో నిర్బంధ కేంద్రాలు (డిటెన్షన్ క్యాంపులు) ఉండబోవని ప్రకటించారు. ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందు ఎస్‌ఐఆర్ చేపట్టారంటే వారు ఓటర్ల కోసం ఎంతగా ఆరాటపడుతున్నారో అర్థం చేసుకోవచ్చు అని మమత వ్యాఖ్యానించారు. తన సొంత ఎమ్యునరేషన్ ఫారమే ఇప్పటివరకు నింపలేదని చెప్పారు. అల్లరి మూకల పార్టీకి నేను నా పౌరసత్వాన్ని రుజువు చేయాలా అని సీఎం ప్రశ్నించారు. కోల్‌కతాలో ఈనెల 7న (పాంచ్ లాఖో కోంథె గీతా పాఠ్' (గీతా పఠనం) కార్యక్రమంలో హింసపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇది బెంగాల్, ఉత్తరప్రదేశ్ కాదు. వీధి విక్రేతలపై దాడి చేస్తే సహిస్తామా? గత రాత్రి నిందితులందరినీ అదుపులోకి తీసుకున్నాం' అని మమత సభలో ఆవేశంగా మాట్లాడారు. రాష్ట్ర సామాజిక బంధాలను చెడగొట్టేందుకు, ప్రజలను విభజించేందుకు బీజేపీ యత్నిస్తోందని ఆరోపించారు. మత కార్యక్రమాలను రాజకీయాల కోసం వాడుతోందని దుయ్యబట్టారు. 'మత విభజనలను నేను నమ్మను. అన్ని మతాల వారు కలిసి మెలిసి ఉండాలని కోరుకుంటాను. గీత పఠనం కోసం బహిరంగ సభ నిర్వహించాల్సిన అవసరం ఏమిటి? భక్తులు తమ మదిలో దైవాన్ని ఆరాధిస్తారు' అని మమత అన్నారు. గీత అంటూ జపం చేసే వారికి ధర్మం గురించి శ్రీకృష్ణుడు ఏం చెప్పాడో తెలుసా అని ప్రశ్నించారు. ధర్మం అంటే ఆదరించడమని, విభజించడం కాదని హితవు పలికారు. పశ్చిమ బెంగాల్ వినాశనాన్ని వారు (బీజేపీ) కోరుకుంటున్నారని, రాష్ట్రాన్ని వశపర్చుకోవాలని, బెంగాలీ మాట్లాడకుండా చేయాలని భావిస్తున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. బెంగాలీలు అందరినీ బంగ్లాదేశీయులుగా ముద్రవేసి, అందరినీ నిర్బంధ కేంద్రాలకు పంపాలని కోరుకునే హోంమంత్రి మనకు ఉన్నారు కానీ అలా ఎప్పటికీ జరగనివ్వము. ఎవరినీ బెంగాల్ నుంచి పంపనివ్వబోం. ఎవరినైనా బలవంతంగా పంపివేస్తే, వాళ్లను తిరిగి ఎలా తీసుకు రావాలో మాకు తెలుసు' అని మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. బీజేపీ అనుకూల అధికారులను ఎస్‌ఐఆర్ విధుల్లో ఎన్నికల సంఘం నియమిస్తోందని ఆరోపించారు. ఢిల్లీ నుంచి కొందరు బీజేపీ అనుకూల వర్గీయులను తీసుకొచ్చి బెంగాల్‌పై నిఘా పెట్టారని విమర్శించారు. ఎస్‌ఐఆర్ విచారణ సమయంలో జిల్లా మెజిస్ట్రేట్ పనిని వారు పర్యవేక్షిస్తున్నారని మమతా బెనర్జీ అన్నారు. కాగా, గీత పఠనం కార్యక్రమం నేపథ్యంలో వేదిక సమీపంలో చికెన్ ప్యాటీస్ అమ్మే ఇద్దరిపై నిందితులు దాడి చేశారు. వారితో బలవంతంగా గుంజీలు తీయించారు. వారి సామాన్లు ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. ఫుటేజితో పాటు ఇతర అధారాలను ధ్రువీకరించిన తర్వాతే అరెస్టులు జరిగినట్లు పోలీసులు వెల్లడించారు.

### లఖీంపూర్ ఖేరీ హింస కేసు నిందితుడు ఆశీష్ మిశ్రా...
## కూతురు పరీక్షల కోసం వెళ్లేందుకు 'సుప్రీం'అనుమతి

**న్యూఢిల్లీ :** లఖింపూర్ ఖేరీ హింస (2021) కేసులో నిందితుడైన కేంద్ర మాజీ మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు ఆశిష్ మిశ్రాను డిసెంబరు 25 నుండి 31వరకు జరుగనున్న తన కుమార్తె 12వ తరగతి బోర్డు పరీక్షల కోసం స్వస్థలానికి ప్రయాణమయ్యేందుకు సుప్రీంకోర్టు గురువారం అనుమతించింది.అత్యున్నత న్యాయస్థానం అక్టోబరు 20న తన స్వస్థలం లఖింపూర్ ఖేరీలో జరుపుకోనున్న దీపావళి పండుగ ఉత్సవాలకు తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లేందుకు అక్టోబరు 9న అనుమతించిన విషయం తెలిసిందే. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి ద్విసభ్య ధర్మాసనం ఎదుట ఆశిష్ మిశ్రా తరపున హాజరైన సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ దావే తన వాదనలు పరిగణనలోనికి తీసుకుని ఆ పిటిషన్‌ను అనుమతించారు. ఎలాంటి రాజకీయ భాగస్వామ్యం లేకుండా సహా మునుపటి బెయిల్ షరతులు వర్తిస్తాయని ఆయన పునరుద్ఘాటించారు. క్లుప్త విచారణ సందర్భంగా, అజయ్ మిశ్రా, ఇతరులకు వ్యతిరేకంగా కొనసాగుతోన్న విచారణ స్థితిని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ గమనించారు. 36మంది సాక్షులను ఇప్పటికే విచారించామని, మరో 85మందిని ఇంకా విచారించాల్సి ఉందని చెప్పారు. అదే విధంగా మరో విచారణకు సంబంధించి దాదాపు 35మంది సాక్షులను విచారించాల్సి ఉందని ధర్మాసనానికి వివరించారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అడిషనల్ అడ్వకేట్ జనరల్ ఈ కేసులను విచారిస్తున్న అదే న్యాయమూర్తి ముందు 789 విచారణలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.అంతకుముందు ఆశీష్ మిశ్రాను తన స్వస్థలానికి తీసుకెళ్లడానికి ధర్మాసనం అనుమతిస్తూ రాజకీయ కార్యకర్తలు లేదా ఇతర వ్యక్తులు అలాంటి వేడుకలలో ఏ హోదాలో పాల్గొనకూడదనే ముందస్తు బెయిల్ షరతులు విధించబడతాయని తెలియజేసింది. ఈకేసు విచారణ పెండింగ్‌లో ఉన్నప్పుడు లఖిన్‌ను హాజరు కాకుండా ఉండమని అత్యున్నత న్యాయస్థానం మిశ్రాను ఆదేశించింది. లఖీంపూర్ ఖేరీ హింసకేసులో సాక్షులుగా మిశ్రాను నిందిస్తూ ఆరోపణలు వచ్చిన అనంతరం జనవరి 20న రాష్ట్ర పోలీసుల నుంచి అత్యున్నత న్యాయస్థానం ఒక నివేదికను కోరింది.



ప్రజాపక్షం
శుక్రవారం, 12 డిసెంబరు

# 'ఉస్మానియా'కు సముచిత ప్రాధాన్యం

చారిత్రాత్మక ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1,000 కోట్లను కేటాయించడం హర్షణీయ పరిణామం. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ప్రతిష్ఠాత్మకమైన యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీకి వెళ్ళారు. వేలాది విద్యార్థుల సమక్షంలో నిధుల విడుదలకు పరిపాలన అనుమతులిస్తూ జారీచేసిన జిఓ కాపీని వైస్ ఛాన్సలర్‌కు అందజేయడం ఒక కీలక ఘట్టం. గత ఆగస్టు మాసంలో ఒకసారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్ళి, మళ్ళీ వచ్చే డిసెంబర్ నాటికి నిధులు ఇస్తానని ప్రకటించారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఆయన జిఓ ఇవ్వడం ద్వారా యూనివర్సిటీకి ఇస్తున్న ప్రాధాన్యత స్పష్టమవుతోంది. వందేళ్ళకు పైగా చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీలో చదివి పదుల వేల మంది విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, రాజనీతిజ్ఞులు, ఆర్థిక వేత్తలు, ఇంజనీర్లు, మేధావులుగా ప్రఖ్యాతి చెందారు. మాజీ ప్రధాన మంత్రి పి.వి.నరసింహారావు, కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి, సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి వంటి జాతీయ నేతలను అందించి గణుతికెక్కింది.

అటు అధ్యయనంతో పాటు, సామాజిక చైతన్యంలో కూడా ఉస్మానియాది ఎల్లప్పుడు ముందు వరుసే. ప్రస్తుతం దేశవ్యాప్తంగా బంకించంద్ర ఛటర్జీ రచించిన 'వందేమాతరం' జాతీయ గేయం 150వ వార్షికోత్సం నిర్వహించబడుతోంది. దాని ప్రశస్థిపై పార్లమెంటు ఉభయసభల్లో సభ్యులు గంటల తరబడి చర్చించారు కూడా. ఆంగ్లేయుల కాలంలో జాతీయోద్యమానికి వందేమాతరం గీతం స్ఫూర్తిపతాకగా నిలిచింది. బెంగాల్ విభజన సమయంలో వందేమాతర నినాదాలు దేశవ్యాప్తంగా మిన్నంటాయి. నిజాం సంస్థానంలో కూడా ఆ తరువాత మరో రూపంలో వందేమాతరం గీతం ప్రకంపనలు సృష్టించింది. ఉస్మానియా యూనివర్సిటీలో వందేమాతరం గీతంపై 1938లో నాటి పాలకులు నిషేధాన్ని విధించారు. దానిని ధిక్కరిస్తూ యూనివర్సిటీ విద్యార్థులు వందేమాతర గీతాన్ని ప్రతిరోజు పాడడంతో వారిని యూనివర్సిటీ నుంచి తొలగించారు. ఈ చర్యకు వ్యతిరేకంగా విద్యార్థుల వందేమాతర ఉద్యమం దావానలంలా పాకింది. సంస్థానంలోని ఔరంగాబాద్, వరంగల్, నల్లగొండ, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాలలో నిరసనలు ఉధృతమై, విద్యార్థులు చాలాకాలం తరగతులు బహిష్కరించారు. చివరకు క్షమాపణ కోరితే విద్యార్థులను తిరిగి చేర్చుకుంటామని చెప్పినా, 350 మంది ఉస్మానియా విద్యార్థులు తిరస్కరించడంతో, శాశ్వత బహిష్కరణకు గురయ్యారు. ఇది ఉస్మానియా యూనివర్సిటీ దేశభక్తి చరిత. సమాజంలోని అన్ని రకాల సామాజిక, రాజకీయ అంశాలపై యూనివర్సిటీ చర్చా వేదికగానే కాకుండా, ఉద్యమ కేంద్రంగా కూడా ఉండేది. జాతీయవాద, వామపక్ష, అతివాద వామపక్ష, మితవాద, తదితర విద్యార్థి నాయకులు ఇక్కడ తీర్చిదిద్దబడ్డారు. యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ఎన్నికలు ఆ తరువాత మెరికల్లాంటి నాయకులను దేశానికి, రాష్ట్రానికి అందించింది.

తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమాలకు సైతం ఉస్మానియా యూనివర్సిటీ సారథ్యం వహించింది. ఇంతటి ఖ్యాతి కలిగిన యూనివర్సిటీ చరిత్ర తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత క్రమంగా మసకబారింది. ఇందుకు ప్రధాన కారణం నాటి పాలకుల నిర్లక్ష్యం. వేల సంఖ్యలో బోధన, బోధనేతర పోస్టులు ఖాళీ అయినప్పటికీ, భర్తీకి నేరపూరిత నిర్లక్ష్యం వహించింది. అవసరాలకు సకాలంలో నిధులు ఇవ్వకపోవడంతో మౌలిక సదుపాయలలో కూడా వెనుకబడింది. ఒక దశలో యూనివర్సిటీలోని కొంత భూమిని ఇతర అవసరాలకు వినియోగించాలన్న యత్నాన్ని విద్యార్థుల తిరుగుబాటుతో నాటి ప్రభుత్వం విరమించుకోవాల్సి వచ్చింది. బోధనా సిబ్బంది తీవ్ర కొరతతో పాటు, యూనివర్సిటీ సంస్కృతిలో కూడా అలసత్వ ధోరణి ఏర్పడిందని పదవీ విరమణ చేసిన వారు, ప్రస్తుత ప్రొఫెసర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అభ్యాసన, అధ్యయన, పరిశోధన నాణ్యత కొరవడినట్లు వాపోతున్నారు. దశాబ్దాల క్రితమే విద్యార్థి సంఘ ఎన్నికలు నిషేధం, కెరీరిజం ప్రబలడంతో గంభీరమైన సైద్ధాంతిక విద్యార్థి రాజకీయాలు కనుమరుగయ్యాయి. యూనివర్సిటీలో చేరే విద్యార్థులు కూడా తాము చేరిన కోర్సులపై ఆసక్తి కంటే పోటీ పరీక్షలపైనే ఆసక్తి ప్రదర్శిస్తున్నారు.

ఇటీవల కాలంలో విద్యారంగ ప్రక్షాళనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనలు చేయడమే కాకుండా, ప్రణాళికలలో కోసం పలు కమిటీలను నియమించారు. ముఖ్యంగా ఉస్మానియా యూనివర్సిటీపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ, ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫర్డ్ స్థాయిలో దీనిని తీర్చిదిద్దాలనే ఆకాంక్ష ఆయనలో ఉంది. ఆ దిశగా అడుగులు వేసేందుకు మౌలిక వసతులకు రూ. వెయ్యి కోట్లు మంజూరు చేయడమే గాక, అధ్యాపకుల నియామకాలలో రాజకీయ, సిఫార్సుల ప్రమేయం లేకుండా చూస్తానని పూచీనిచ్చారు. ప్రభుత్వం అడుగులు సానుకూలంగానే ఉన్నప్పటికీ, ఉస్మానియా యూనివర్సిటీని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలనే ఆకాంక్షను నిజం చేసేందుకు, ప్రభుత్వంతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు, సమాజం, ఇలా అందరిదీ సమష్టి బాధ్యత. కేవలం చదువులకే పరిమితం కాకుండా భావసంఘర్షణా కేంద్రంగా భాసిల్లేలా చూడాలి. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ నమూనా నుంచి అనేక అంశాలను అక్కున స్వీకరించాలి. అక్కడ దేశంలోని అత్యంత వెనుకబడిన ప్రాంతాలు, అట్టడుగు సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులకు అడ్మిషన్‌లలో ప్రాధాన్యతనిస్తారు. అలా సీటు పొందిన అనేక మంది రాటుదేలి, తరువాతి కాలంలో దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. ప్రపంచ ప్రఖ్యాత విద్యావేత్తలే కాకుండా, జెఎన్‌యు అనేక మంది సివిల్ సర్వీసెస్ అధికారులను అందించింది. యూనివర్సిటీని కేవలం విద్యాలయంలా కాకుండా సామాజిక మేథో కేంద్రంగా భావించాలి. దానిపై చేసే ఖర్చును వ్యయంగా కాకుండా సామాజిక అవసరంగా చూడాలి. అప్పుడే అత్యుత్తమ ఫలితాలొస్తాయి. ఉస్మానియా యూనివర్సిటీనే కాకుండా కాకతీయ యూనివర్సిటీ, మహాత్మాగాంధీ యూనివర్సిటీ, తెలంగాణ యూనివర్సిటీ తదితర విశ్వవిద్యాలయాల ప్రమాణాల మెరుగుపై కూడా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలి. యుద్ధప్రాతిపదికన చర్యలు కొనసాగిస్తేనే యూనివర్సిటీలు మెరుగుపడతాయి. ఒకడుగు ముందుకు రెండడుగులు వెనక్కులాగా కాకూడదు.

# కార్మికుల భద్రతపై నీలినీడలు

భారతదేశం పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది, ఇది శుభ పరిణామం. అయితే, ఈ ఎదుగుదల వెనుక మన కార్మికుల ప్రాణాలు, ఆరోగ్యం ప్రమాదంలో పడుతున్నాయనే చేదు వాస్తవం ఉంది. ప్రపంచంతో పోటీ పడాలని న్నా, కర్మాగారాల్లో తరచూ జరుగుతున్న దుర్ఘటనలు, ముఖ్యంగా ఇటీవలి ఘోర సంఘటనలు, పరిశ్రమల్లో భద్రతా విధానాలపై తీవ్రంగా ఆలోచింపజేస్తున్నాయి. ప్రమాదాలు జరిగిన తర్వాత విచారణలు, నష్టపరిహారాలు ఇవ్వడం పరిష్కారం కాదు. అసలు ప్రమాదాలే జరగకుండా నివారించే పద్ధతులను పాటించాలి. ప్రతి ప్రాణం విలువైనదే అని మనం గుర్తించాలి. గతం లో కర్మాగారాల్లో రక్షణకు సంబంధించి మన దేశంలో అనేక చట్టాలు ఉండేవి. కర్మాగారాల చట్టం 1948, గనుల చట్టం 1952 వంటివి వాటిలో కొన్ని. వీటిని సరళీకృతం చేసి, సమగ్రంగా అమలు చేసే ఉద్దేశంతో వృత్తి రక్షణ, ఆరోగ్యం, పని పరిస్థితుల నిబంధనావళి 2020 (సురక్షా నిబంధనావళి) తీసుకురాబడింది. ఇది 13 పాత కార్మిక చట్టాలను ఒకే నిబంధనావళి కిందకు తెచ్చి, చిన్న పరిశ్రమలను కూడా చేర్చింది. యజమానులు సురక్షితమైన పని వాతావరణం, వ్యక్తిగత రక్షణ పరికరాలు, ప్రమాదాలపై శిక్షణ ఇవ్వడం తప్పనిసరి. అలాగే ప్రమాదాలను అంచనా వేసి నివారించాలి, ప్రమాదకర పనులు చేసేవారికి వైద్య పరీక్షలు చేయించాలి. పెద్ద కంపెనీలు రక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలి. ఈ సురక్షా నిబంధనావళితో పాటు, పర్యావరణ పరిరక్షణ చట్టం 1986, ప్రమాదకర రసాయనాల తయారీ, నిల్వ, దిగుమతి నిబంధనలు 1989 వంటివి రసాయన భద్రత, వ్యర్థాల నిర్వహణ గురించి వివరిస్తాయి. రాష్ట్ర అగ్నిమాపక చట్టాలు, జాతీయ భవన నియమావళి అగ్ని ప్రమాదాల నివారణకు మార్గదర్శకా లు అందిస్తాయి. ఇలా బలమైన చట్టాలు ఉన్నప్పటికీ, ముఖ్యంగా చిన్న, అసంఘటిత రంగాల్లో వీటిని పటిష్ఠంగా అమలు చేయడంలోనే అసలైన సవాలు ఉంది. 2023 – 2025 మధ్య కాలం లో దేశంలో కర్మాగారాల్లో ప్రమాదాలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా రసాయన, మందుల తయారీ పరిశ్రమల్లో ఇవి ఎక్కువగా జరుగుతున్నాయి. ఇది వ్యవస్థలోని లోపాలను స్పష్టం చేస్తోంది. ఈ ప్రమాదాలు సరిగా నిర్వహణ లేకపోవడం, సిబ్బందికి సరైన శిక్షణ లేకపోవడాన్ని చూపించాయి. కర్మాగారాల్లో ప్రమాదాల తాజా పూర్తి అధికారిక వివరాలు వెంటనే అందుబాటులో ఉండవు. 2017 నుండి 2020 కాలానికి కర్మాగారాల సలహా సేవలు, కార్మిక సంస్థల డైరెక్టరేట్ జనరల్ నివేదిక ప్రకారం, నమోదైన కర్మాగారాలలో ప్రతిరోజూ సగటున ముగ్గురు కార్మికులు చనిపోతున్నారు, పదకొండు మంది గాయపడుతున్నారు. ఇండస్ట్రియల్ ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య డిసెంబర్ 2024 నివేదిక ప్రకారం, 2024లో పని ప్రదేశాల్లో 400 మందికి పైగా కార్మికులు మరణించారు. ఈ సంఖ్యలు తక్కువగా నమోదు కావడం వల్ల వాస్తవానికి ఇంకా ఎక్కువగా ఉండవచ్చని ఈ నివేదికలు చెబుతున్నాయి.



ఎస్.కె.జకీర్

# సంకల్పమే రేవంత్ రెడ్డి బలం!

రేవంత్ రెడ్డి, కెసిఆర్‌ను పడగొట్టి గెలిచారు. గెలవడమే కాకుండా నిలబడ్డారు. నిలదొక్కుకున్నారు. ఇప్పుడిక 2029 లో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు ఇప్పటినుంచే వ్యూహాలు రచిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఫలితం ద్వారా బిజెపి మూడో స్థానానికి వెళ్ళిపోయినందున బిఆర్ఎస్ తో ప్రధానంగా తలపడవలసి ఉంది. కలబడవలసి ఉంది. రేవంత్ అనూహ్యమైన నిర్ణయాలు, దూకుడు బిఆర్ఎస్‌కు మింగుడుపడడం లేదు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్నట్లేనని విశ్లేషకులంటున్నారు. ఒకవేళ మళ్ళీ ఆయన క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చినా మునుపటి వాడి, వేడి ఉండవని వారు అభిప్రాయపడుతున్నారు. కనుక రేవంత్‌ను ఢీ కొనే బాధ్యత ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీసుకుంటారేమో! లేదా పార్టీ అధ్యక్ష పదవిని హరీశ్ రావుకు కట్టబెడితే ఆ సన్నివేశం వేరుగా ఉండవచ్చు. బిఆర్ఎస్ నుంచి గెంటివేతకు గురయిన కవిత వ్యాఖ్యలు, వ్యవహార శైలి రేవంత్ రెడ్డి నెత్తిన పాలు పోసినట్లవుతున్నాయి. కవితకు, ఆమె పూర్వాశ్రమం బిఆర్ఎస్‌కు మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమంటున్నది. బిఆర్ఎస్ మాజీ మంత్రులు, ప్రస్తుత ఎమ్మెల్యేలపై కవిత పెద్ద పెట్టున విమర్శలు గుప్పిస్తున్నారు. వారి అవినీతి, భూ కబ్జాలపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు కెసిఆర్ కూతురనే మొహమాటంతో వాళ్లంతా ఉపేక్షించారు. కానీ ఆమె ఆరోపణల తీవ్రత పెరగడంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వంటి నాయకులు ప్రత్యారోపణలు ప్రారంభించారు. ఆమె కారణంగానే పార్టీ ఓడిపోయిందని, తన తండ్రి అండ చూసుకొని గతంలో ఆమె భూదందాలు చేశారని, అక్రమంగా సంపద కూడబెట్టుకున్నారంటూ మాధవరం చెలరేగిపోయారు. బిఆర్ఎస్ నాయకుల ఆరోపణల్లో నిజానిజాల సంగతి ఎలా ఉన్నా కాంగ్రెస్ పార్టీకి, కవిత మూలంగా పరోక్షంగా ప్రయోజనం చేకూరుతోంది.

రెండేళ్ల పరిపాలన పూర్తయిన తర్వాత ఎవరికైనా ఆత్మ పరిశీలన ఉంటుంది. సింహావలోకనం ఉంటుంది. రేవంత్ రెడ్డికి తెలంగాణలో ఎలాంటి పరిస్థితి ఎదురవుతోంది? ఆయన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారా? హైకమాండ్ లక్ష్యాలను సాధించారా? ఎటువంటి సవాళ్లను ఎదుర్కొంటున్నారు? ఎటువంటి సమస్యలను కొని తెచ్చుకున్నారు? ప్రభుత్వ అధినేతగా తన మార్క్ చూపించడంతోపాటు.. మార్పును కూడా ప్రజలకు అనుభవంలోకి తెచ్చారు. తన బృందంతో కలిసి పనిచేస్తూ కొత్త కొత్త విజయాలను నమోదు చేశారు. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని విధంగా ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేసి సరికొత్త ఘనత సృష్టించారు. తక్కువ సమయంలోనే 60వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసి రికార్డు సృష్టించారు. సన్న ధాన్యం పండించిన రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్ ఇస్తున్నారు. మూసీ నదిని సుందరీకరించేందుకు అడుగులు పడుతున్నాయి. వచ్చే 50 సంవత్సరాల అవసరాలు తీర్చే విధంగా హైదరాబాదు నగరం అభివృద్ధికి ప్రణాళిక రూపొందించారు. దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీల నిర్మాణానికి రేవంత్ ముందడుగు వేశారు.

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కంకణబద్ధమై ఉన్నట్టు సిఎంఒ కార్యాలయం ప్రకటించింది. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించింది. 500 రూపాయలకు వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తోంది. 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వాడే గృహాలకు ఉచితంగా కరెంట్ సప్లై చేస్తోంది. పంట పొలాలకు 24 గంటల పాటు విద్యుత్ సరఫరా అవుతుంది. హైదరాబాద్ నగరంలో కాలుష్యం తగ్గించడానికి 3000 వరకు ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నారు. బాపూ ఘాట్ ప్రాంతంలో అతిపెద్ద గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ నగర వాసులకు గోదావరి నుంచి తాగునీరు అందిస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ కంటే మెరుగ్గా ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి పునాదులు పడ్డాయి.

గతంలో నిర్లక్ష్యానికి గురైన రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థుల కాస్మెటిక్ చార్జీలను రేవంత్ ప్రభుత్వం పెంచింది. మహిళల ఆర్థిక స్వావలంబనకు అడుగులు వేస్తున్నది. బడుగు బలహీన వర్గాల విద్యార్థుల కోసం ప్రపంచ స్థాయిలోనే విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నారు. ధరణి పోర్టల్ స్థానంలో భూభారతి వచ్చింది. మీడియాకు స్వేచ్ఛ కల్పించారు. మాదకద్రవ్యాలపై ఉక్కు పాదం మోపారు. పెట్టుబడులను కూడా భారీగా ఆకర్షిస్తున్నారు. ప్రాంతీయ బాహ్య వలయ రహదారి, రైలు ప్రాజెక్టులను కేంద్రం మంజూరు చేయడంతో తెలంగాణ దిశ మరింతగా మారనుంది. టైర్ 2 పట్టణాలలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు కానున్నాయి. వరంగల్ నగరాన్ని రెండవ రాజధానిగా తీర్చిదిద్దే కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి వ్యక్తికి పది లక్షల రూపాయల విలువైన ఉచిత వైద్యం అందించేందుకు ప్రణాళికలు రూపొందుతున్నాయి. ప్రతినెల ఉద్యోగులకు ఒకటవ తేదీన జీతాలు లభిస్తున్నాయి. తెలంగాణ తల్లి విగ్రహం సచివాలయంలో ఏర్పాటు చేశారు. రైతు భరోసా కూడా రైతుల ఖాతాలలో జమ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ముమ్మరమవుతోంది. సామాజిక మాధ్యమాల వేదికగా బిఆర్ఎస్ రేవంత్ ప్రభుత్వాన్ని ఎండగడుతోంది. మొత్తంగా చూస్తే రెండేండ్లలో రేవంత్ రెడ్డిది తీసిపారవేయదగ్గ పరిపాలన మాత్రం కాదని విశ్లేషకులు అంటున్నారు. రేవంత్ రెడ్డి 100కు 75 మార్కులకు పైగా తెచ్చుకున్నారని చెబుతున్నారు. ఇక మూడో ఏట నుంచి పరిపాలనలో నూతన ఒరవడి కొనసాగిస్తే రాజకీయంగా ఇబ్బంది ఉండదని రాజకీయ విశ్లేషకుల అంచనా.




ఇదిలా ఉండగా రేవంత్ ఎంతో దూరదృష్టితో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ సూపర్ హిట్ అయ్యింది. రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో విశ్వాసం కనిపిస్తుంటే ప్రతిపక్షాలకు కొన్ని మీడియా సంస్థలకు కంటగింపుగా మారింది. తన రియల్ ఎస్టేట్ అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సదస్సు నిర్వహిస్తున్నారంటూ విమర్శలు చేశారు. మన దేశంలో ఇప్పటికే అనేక రాష్ట్రాలు ప్రపంచ పెట్టుబడి సదస్సులను నిర్వహించాయి. అయితే బిఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం దావోస్ లాంటి సదస్సుల్లో పాల్గొనేందుకు చూపించిన చొరవ, అటువంటి సదస్సులను హైదరాబాద్‌లో నిర్వహించడంలో మాత్రం చూపలేదు. 2003లో ఆనాటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో బిజెపి 'వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్'ను నిర్వహించారు. ఆ సదస్సులోనే గుజరాత్ ప్రభుత్వం రూ.87,000 కోట్ల విలువైన ఎంఒయులు కుదుర్చుకున్నది. అప్పటిదాక ఓ మోస్తరు రాష్ట్రంగా ఉన్నదల్లా ఒక్కసారిగా ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎదిగింది. ఆ తర్వాత 2007లో మధ్యప్రదేశ్, 2010లో కర్ణాటక, 2015, 2019 సంవత్సరాల్లో రెండుసార్లు తమిళనాడు, 2018లో మహారాష్ట్ర ఇలాంటి గ్లోబల్ సమ్మిట్లను నిర్వహించి కోట్ల పెట్టుబడులు రాబట్టాయి. ఇదే విధంగా రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్‌లు కూడా పెట్టుబడుల సదస్సులను నిర్వహించాయి. ఆంధ్రప్రదేశ్ విజయవాడలో 'ఇన్వెస్టోపియా గ్లోబల్ ఆంధ్రప్రదేశ్ 2025'ను నిర్వహించింది. ఆ తర్వాత నవంబర్ నెలలో సిఐఐతో కలిసి నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్‌లో గూగుల్ డేటా సెంటర్‌తో కలిపి దాదాపు రూ.13.25 లక్షల కోట్ల ఒప్పందాలను చేసుకుంది.

పెట్టుబడులు ఆకర్షించే ఈ పోటీలో తెలంగాణ వెనకబడిపోకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాయువేగంతో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2025కు అంకురార్పణ చేశారు. యువ ముఖ్యమంత్రిగా ప్రతీ అవకాశాన్నీ అందుకుని రాష్ట్రాన్ని ప్రగతిపథంలో పరుగులు పెట్టించాలని ఆయన ప్రయత్నిస్తున్నారు. గతంలో పాలించిన ముఖ్యమంత్రుల వలె రేవంత్‌కు ఈగో లేదు. అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు ప్రజలకు చెబుతున్నారు. 42 దేశాల నుంచి 1686 మంది ప్రతినిధులు, 225 మంది విదేశీ అతిథులతో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించి రూ.5.75లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలతో ప్రపంచానికి తెలంగాణ పరిపాలన సత్తాను సిఎం రేవంత్ రెడ్డి చాటారు. చాటారు. యావత్ భారతదేశ సమ్మిట్‌ల చరిత్రలో ఇదొక రికార్డు!

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ హైదరాబాద్ మహా నగరానికి దక్షిణ దిశలో రియల్ ఎస్టేట్ రంగానికి కూడా కొత్త ఊపు తెచ్చింది. భారత్ ఫ్యూచర్ సిటీ పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ సంస్థలు వెంచర్లు వేస్తున్నాయి. రంగారెడ్డి జిల్లాలోని కడ్తాల్ సమీపం లో, మహేశ్వరం మండలంలోని తుమ్మలూరు ప్రాంతంలో, శ్రీశైలం హైవేతో పాటు నాగార్జునసాగర్ మార్గంలో ఇప్పటికే వేసిన లేఅవుట్లలో సైట్ విజిట్లు జోరందుకున్నాయి. 2047 సంవత్సరానికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడం అంటే ప్రతీ సంవత్సరం అద్భుతమైన 8– 9శాతం వృద్ధిరేటు సాధించాలి. ఈ లక్ష్యంతో, ప్రజల జీవితాలు ముడిపడ్డాయన్న భయాన్ని అధికారుల్లో నింపడం కోసమే ముఖ్యమంత్రి ఇంత శ్రమిస్తున్నారని చెప్పక తప్పదు. ఐటిలో అద్భుతాలు చేశామని ప్రగల్భాలు పలికే గత పాలకులు, వారి పదేళ్ళ పాలనలో హైదరాబాద్ ఎందుకు బెంగళూరును దాటలేకపోయిందన్న ప్రశ్నకు మాత్రం జవాబు చెప్పరు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైంది. భారత్ ఫ్యూచర్ సిటీపై పారిశ్రామిక వేత్తలకు ఆసక్తి పెరిగింది. దాదాపు 30వేల ఎకరాల్లో అభివృద్ధి చేయనున్న భారత్ ఫ్యూచర్ సిటీలో పది రంగాల్లో పెట్టుబడులు సాధించడంపై ప్రభుత్వం ఈ సదస్సులో దృష్టి సారించింది. పది రంగాలను ప్రభుత్వం పది జోన్లుగా విభజించింది. ఇందులోని అన్ని జోన్లలో పెట్టుబడులు పెట్టేందుకు జాతీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. ఎడ్యుకేషన్ జోన్‌లో ఆఫ్ క్యాంపస్ పెట్టేందుకు యూనివర్సిటీ ఆఫ్ లండన్ ముందుకొచ్చింది. స్పోర్ట్స్ హబ్ పెట్టుబడులకు దుబాయ్ స్పోర్ట్స్ సిటీ ఒప్పందం కుదుర్చుకుంది. ఫారెస్ట్ జోన్‌లో గుజరాత్ జామ్‌నగర్ తరహాలో వంతారా ఏర్పాటుకు రిలయన్స్ సిద్ధమైంది. మెడికల్ టూరిజం విభాగంలో అపోలో హాస్పిటల్స్, ఆతిథ్య రంగంలో స్టార్ హోటళ్ల నిర్మాణానికి నోవాటెల్, ఫర్నిచర్ పార్క్ జోన్లో మలేషియన్ కంపెనీ జెవి భారత కంపెనీ బాంటియాతో కలిసి పెట్టుబడులు పెట్టనుంది. 100 ఎకరా ల్లో ఏర్పాటు కానున్న ఎఐ సిటీలో ఎఐ యూనివర్సిటీ, మ్యానుఫ్యాక్చరింగ్ జోన్‌లో సెంబ్కార్ప్ ఇండస్ట్రియల్ పార్క్, టౌన్‌షిప్‌లో ట్రంప్ గ్రూప్, రిక్రియేషన్ జోన్‌లో ఫిల్మ్ స్టూడియో నిర్మాణానికి సల్మాన్ ఖాన్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నారు.



ఎస్.బాబు
టిజిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు
9951801191

# వికసిత భారత్ అంటే ఇదేనా?

దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, భారత్ వికసిస్తోందని మన ప్రధాన మంత్రి ఎప్పు డూ అంటుంటారు. కాని ఇప్పటికీ త్రాగటానికి మంచినీరు దొరకక ఎన్నో కిలోమీటర్లు గ్రామీణ ప్రజలు బిందెలు, కుండలు పట్టుకుని నీటిజాడను వెతుక్కుంటున్నారు. ఇలా నీరులేని గ్రామాలు, సేద్యంలేని పొలాలెన్నో. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో మహిళలు 48.5% ఉన్నారు. లింగ నిష్పత్తి 1000 మంది పురుషులకు 943 మంది మహిళలు ఉన్నారు. కాని లింగ సమానత్వంలో ప్రపంచంలో మనం 136 స్థానంలో ఉన్నాం. మన ప్రక్కనున్న బంగ్లాదేశ్ 25వ స్థానంలో మనకందనంత దూరంలో ఉంది. మహిళల అక్షరాస్యత కేవలం 70 శాతం మాత్రమే. కాని పారిశ్రామిక దేశాల్లో 97 శాతం మహిళలు అక్షరాస్యత సాధించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో కేవలం 2.2 శాతం మాత్రమే విద్యకు కేటాయిస్తుంటే అక్షరాస్యత ఎలా పెరుగుతుంది? స్త్రీలను గౌరవించి, విద్యాబుద్ధులు నేర్పించి, వారికి అధికారం ఇచ్చే దేశా న్ని అభివృద్ధి చెందిన దేశంగా భావించాలి అన్నారు స్వామి వివేకానంద. మహిళలపై యాసిడ్ దాడులు, అత్యాచారాలు, హత్య లు దేశంలో పెచ్చుమీరుతున్నాయి. మహిళలకు ఆస్తి హక్కు, రాజకీయ రంగంలో రిజర్వేషన్ల అమలుతోనే వికసిత భారత్ సాధ్యమవుతుందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు.

2024లో ప్రధానమంత్రి అమెరికా పర్యటన సందర్భంగా లాంగ్ ఐలండ్‌లో ప్రసంగిస్తూ ఇండియాలో 25 కోట్ల మందిని పేదరికం నుండి బయట పడేశామన్నారు. మరి ప్రార్థనా మందిరాల వద్ద, చౌరస్తాలు, చెత్త డంపిగ్ ప్రదేశాలు మరియు అధునాతనమైన బ్రిడ్జిల కింద బిచ్చగాళ్ళు ఎందుకుంటున్నారు? ఆ 25 కోట్ల మందిలో ఈ కడు నిరుపేదలు లేరా? మురికివాడల్లో నివసించే వారి తలరాతలు మారిపోయాయా? ఆకలి కేకలతో రగిలిపోతున్న నిరుపేద కార్మిక శ్రామిక వర్గం బీదరికం నుండి బయటపడిందా? బీదరికం నుండి బయటపడేశామని చెప్పుకుంటున్న మన ప్రధానమంత్రి, దేశం బీదరికంలో 126వ స్థానంలో ఉన్న సంగతి మర్చిపోయారా? దానికి కారణం పౌష్టిక ఆహార లోపంతో పిల్లలు బరువు తగ్గటమే. ఐదు వేళ్ళు రెండు పూటలా నోట్లోకి వెళ్ళని పేదరికం మనది అంటే అతిశయోక్తి కాదు. రోజుకి 75 రూపాయల కంటే తక్కువ ఆదాయం ఉన్న వారిని నిరుపేదలుగా వరల్డ్ బ్యాంక్, యునైటెడ్ నేషన్స్ ఆఫ్ ఆర్గనైజేషన్స్ నిర్ధారించాయి. ఈ నిరుపేదలు భారతదేశంలో 41.6 శాతం ఉన్నారు. ప్రపంచంలో 120 కోట్లమంది నిరుపేదలుంటే వారిలో 3వంతు ఇండియాలోనే ఉన్నారని గణాంకాలు చెప్తున్నాయి.

బాల బాలికల చేత పనిచేయించకూడదని 1986లో బాల కార్మిక నిషేధ చట్టం వచ్చింది. కాని అది అమలు జరగటం లేదు. ఫలితంగా దేశంలో 715 సంవత్సరాల వయసులో ఉన్న బాల కార్మికులు 2.8 కోట్ల మంది ఉన్నారని ఐ.ఎల్.ఓ గణాంకాలు చెప్తున్నాయి. చట్టం అమలు చేయకపోవడంతో బాల కార్మికులు బానిసలుగా మారి ఫ్యాక్టరీల పొగ గొట్టాలకు బలైపోతున్నారు. రేపటి పౌరుల జీవితాలు వికసించకుండానే మొగ్గదశలోనే రాలిపోతున్నాయి. పని వద్దు – బడి ముద్దు అనే స్లోగన్ కి ప్రభుత్వం తిలోదకాలిచ్చింది. బాలల బతుకులు వికసించలేని భారతం వికసిత భారత్ ఎలా అవుతుంది? జాతీయ క్రైమ్ రికార్డ్ బ్యూరో గణాంకాల ప్రకారం 2023 సంవత్సరానికి గాను ఈ దేశంలో 1,71,418 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు అని చెప్తోంది. అంటే గంటకు ఒక రైతు చొప్పున అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. 2025 లో మహారాష్ట్రలో సుమారు 1000 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. దేశానికి వెన్నుముక అయిన రైతుకు రుణమాఫీల నుండి ప్రభుత్వం విముక్తి కల్పించదు. కాని బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉన్న ఈ 11 ఏళ్ళ కాలంలో 16.61 లక్షల కోట్ల రూపాయలు కార్పొరేట్ సంస్థల బ్యాంకు రుణాలు మాఫీ చేసింది. ఇందులో అంబానీలు, ఆదానీల లాంటి ఎందరో మహానుభావులున్నారు.

నిరుద్యోగం ఈ దేశ వారసత్వ సంపదగా మారింది. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలిస్తామని ప్రధానమంత్రి ఎన్నికల హామీ. ఈ 11 ఏళ్ళ పాలనలో 22 కోట్ల మందికి ఈ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందా? ఉద్యోగాలివ్వకపోగా ఉన్న ఉద్యోగులను తగ్గిస్తోంది. ప్రభుత్వ రంగంలో కూడా రిక్రూట్మెంట్ లేకుండా చేస్తోంది. దేశం మొత్తం ఉద్యోగాల్లో గవర్నమెంట్ ఉద్యోగులు కేవలం 3.8 శాతం అని ఐ.ఎల్.ఓ చెప్తోంది. అతి చిన్న దేశమైన క్యూబాలో గవర్నమెంట్ ఉద్యోగులు 77 శాతం ఉన్నారు. రష్యాలో 40.6శాతం, చైనాలో 28 శాతం ప్రభుత్వోద్యోగులు ఉన్నారు. నిరంతరం కమ్యూనిజంపై నిప్పులు కురిపించే బిజెపి నిరుద్యోగాన్ని ఎందుకు తగ్గించలేకపోతోంది? బిజెపి ప్రభుత్వం గోశాలలకు ఇస్తున్న ప్రాముఖ్యం నిరుద్యోగ యువకులకు ఇవ్వడం లేదనేది సత్యం. ఫోర్బ్స్ ఇండియా నివేదిక ప్రకారం 5.6 శాతం నిరుద్యోగులు ఉన్నారని తెలుస్తోంది. ఈ పదేళ్ళలో 220 మిలియన్ల నిరుద్యోగులున్నారని తెలుస్తోంది. బిజెపి అధికారంలో ఉన్న హర్యానాలో 37.6 శాతం నిరుద్యోగులుగా ఉన్నారు. 45 దేశాలలో పర్యటించినందుకు ప్రధానమంత్రి విదేశీ పర్యటన ఖర్చు 490 కోట్లకు ఎలా పెరిగిందో నిరుద్యోగులు కూడా పెరుగుతూనే ఉన్నారు. నిజంగా దేశం వికసిస్తూ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నా నిరుద్యోగం ఇలా పెరిగి ఉండేది కాదు.

సత్యసాయి శతజయంతి ఉత్సవాలలో ప్రతి వ్యక్తి కరుణ, శాంతి, కర్మ విధానాలతో ముందుకెళ్ళాలని ప్రధానమంత్రి గరిక పాటి వారిలా ప్రవచనం చెప్పారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను ఊచకోత కోయడం కరుణ అవుతుందా? వారిని నిర్మూలిస్తే దేశం అభివృద్ధి చెందుతుందా? పొరుగు దేశం వారు మన పౌరులనే చంపుతున్నారు, మనం కూడా మనవారినే చంపుకుంటున్నాం. చంపటమే అభివృద్ధి మంత్రమా? అదే శాంతి సందేశమా? లోక్ సభలో నిద్రపోతున్న ప్రధానమంత్రిని చూశాం, మహారాష్ట్ర అసెంబ్లీలో ఆన్ లైన్లో పేకాట ఆడుతున్న వ్యవసాయ శాఖామంత్రిని చూశాం, మాజీ ప్రధాని మనుమడు తన ఇంట్లో పనిమనిషిని రేప్ చెయ్యటం పత్రికల్లో చదివాం. ఇవన్నీ చూస్తుంటే మనిషిలో మానవత్వం నశించి నైతిక విలువలు పతనమయిపోతున్నాయి అనిపిస్తోంది. ఈ ప్రపంచం నైతిక విలువల పతనం వల్ల నాశనమవుతోందే తప్ప, అణుబాంబు వల్ల కాదు అని ఆల్బర్ట్ ఐన్ స్టీన్ అన్నారు. అంటే మనం పతనం అంచులో ఉన్నామా? లేక అభివృద్ధిపథంలో ఉన్నామా అనేది బేరీజు వేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. నవీ ముంబైలో ప్రధాన మంత్రి మాట్లాడుతూ 2014 లో తాను ప్రధానమంత్రి అయినప్పుడు 74 విమానాశ్రయాలు మాత్రమే ఉన్నాయని, ఇప్పుడు 160కి పైగా పెరిగాయని గొప్పలు చెప్పుకున్నారు. అంటే ఈ దేశంలో ధనవంతులు బాగా పెరిగారని, అట్టడుగు వర్గం అలాగే ఉందని ఆయన చెప్పకనే చెప్పినట్లైంది. విమానాలు, విమానాశ్రయాలు పెరిగాయని చెప్తున్నారే తప్ప, రవాణా సౌకర్యం లేని కుగ్రామాల గురించి మాట్లాడరు. విద్యుత్ సౌకర్యం లేని తండాల గురించి మాట్లాడరు. భూమి కోసం బలయ్యే గిరిజనుల గురించి మాట్లాడరు. నిరుద్యోగం పెంచామని, రైతుల ఆత్మహత్యలు పెరిగాయని, బాల కార్మిక వ్యవస్థ బాగా విస్తరిస్తోందని, కార్మిక చట్టాలను మార్చి, పనిగంటలు పెంచి, శ్రమశక్తిని దోచి, కార్పొరేట్ శక్తుల బాగు చేస్తున్నామని ఆయన చెప్పరు.

2024 లోక్ సభకు ఎన్నికైన 542మంది ఎంపిలలో 251 మంది మరియు రాజ్యసభలో 36 శాతం మంది నేరచరిత్ర ఉన్నవారే. ఇటువంటి నేరస్తులు చట్టసభల్లో ఉంటే వికసిత భారత్ ఎలా సాధ్యమవుతుంది? రాజకీయ నాయకులకు గతంలో నేరస్తులు, రౌడీలు, గుండాలతో సంబంధాలుండేవి. కాని నేడు నేరస్తులే రాజకీయ నాయకులుగా అధికారం చెలాయిస్తున్నారు. వారే చట్టసభల్లో ఉంటున్నారు. వారే చట్టాలు చేస్తున్నారు. దేశంలో నేర రాజకీయాలు జీవనదిలా ప్రవహిస్తున్నాయని, చట్టాలను ఉల్లంఘించే ఏ నాయకులను వదిలే ప్రసక్తి లేదని ప్రధానమంత్రి అన్నారు. లోక్ సభ, రాజ్యసభలో నేరచరిత్ర కలవారిని ఎంతమందిని శిక్షించారు? ఇలాంటి వారితో వారి వ్యాపారాభివృద్ధి తప్ప దేశాభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? సీనియర్ జర్నలిస్టులు పై విషయాలపై ఎంత వ్రాసినా, ఎనలిస్టులు టీవీ డిబేట్లలో ఎంత విశ్లేషించినా, మేధావులు ఎన్ని మార్గదర్శక సూత్రాలు చెప్పినా అది అరణ్య రోదనే. అయినా ప్రభుత్వం పాజిటివ్ దృక్పథంతో ఆలోచించాలని ఆశిద్దాం.

# లేబర్ కోడ్‌లు ఎవరికి ఉపయోగం?

లేఖ

కేంద్ర ప్రభుత్వం వేతన కోడ్ (2019), పారిశ్రామిక సంబంధాల కోడ్ (2020), సామాజిక భద్రత కోడ్ (2020) మరియు వృత్తి భద్రత, ఆరోగ్యం మరియు పని పరిస్థితుల కోడ్ (2020) అనే నాలుగు కార్మిక కోడ్‌లను కార్మిక సంఘాలు వ్యతిరేకించినను నోటిఫై చేయడం వలన అవి 21 నవంబర్ 2025 నుండి అమల్లోకి వచ్చాయి. ఈ కోడ్‌ల వలన ఫిక్సెడ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ ప్రోత్సాహం పొందుతుంది. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే వారికి కూడా ప్రయోజనాలు లభిస్తాయని ఇది పేర్కొంటున్నప్పటికీ, కార్మికులకు ఉద్యోగ భద్రత లేదనే సత్యాన్ని ఇది దాచిపెడుతుంది. 1946 స్టాండింగ్ ఆర్డర్స్ చట్టం 100 కంటే ఎక్కువ మంది కార్మికులను నియమించే ఏదైనా సంస్థ పని గంటలు, సెలవులు, జీత దినం, వేతన రేట్లు, ఉపాధిని రద్దు చేయడం, ఫిర్యాదుల పరిష్కారం గురించి కార్మికులకు తెలియజేయడంలో పాటించాల్సిన నియమాలను నిర్దేశిస్తుంది. ఈ నాలుగు కార్మిక చట్టాలు కార్మికుల హక్కులను హరించడమే కాకుండా, కార్మికులు సమ్మె చేయడం చాలా కష్టతరం చేయడం ద్వారా వారి హక్కులకోసం పోరాడే మార్గాలను హరించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. పారిశ్రామిక సంబంధాల నియమావళి ప్రకారం కార్మికులు సమ్మె కోసం 14 రోజుల నోటీసు ఇవ్వాలి. ఈ కాలంలో సమ్మె లు నిషేధించబడ్డాయి. రాజీచర్యలు విఫలమైన తర్వాత యాజమాన్యం ట్రిబ్యునల్‌కు దరఖాస్తు చేసుకుంటే, సమ్మెను మరింత వాయిదా వేయాలి. 60 రోజుల తర్వాత మొదటి సమ్మె నోటీసు చెల్లదు మరియు కొత్త నోటీసు ఇవ్వవలసి ఉంటుంది. ఈ నియమాలు ఇప్పటివరకు 'అవసరమైన సేవలు' విషయంలో మాత్రమే వర్తిస్తాయి. పారిశ్రామిక సంబంధాల కోడ్ కార్మికుల పరిమితిని 100 నుండి 300కి పెంచింది, ఫలితంగా చాలామంది కార్మికులు ఈ స్టాండింగ్ ఆర్డర్ల కవరేజ్ నుండి మినహాయించబడ్డారు. కోట్లాది మంది కార్మికులను కార్మికులుగా గుర్తించకపోవడం, వారి వేతనాన్ని వేతనాలుగా పరిగణించకపోవడం వల్ల వారికి కనీస వేతనాలు అందడం లేదు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను స్వచ్ఛంద సేవకులుగా పిలుస్తారు. వారికి 'గౌరవ వేతనం' చెల్లిస్తారు. గిగ్ కార్మికులను వ్యాపార భాగస్వాములు అని పిలుస్తారు, వారు చాలా తక్కువ మరియు అనిశ్చిత ఆదాయాలను పొందుతారు. గృహ కార్మికులు, అనేక మంది ఇతరులకు వ్రాతపూర్వక ఉద్యోగ ఒప్పందం లేదు. కావున వారు చట్టబద్ధంగా కనీస వేతనాలను పొందలేకపోతున్నా రు. వేతనాల కోడ్ ఈ మినహాయింపులను పరిష్కరించదు. పారిశ్రామిక సంబంధాల నియమావళి కనీస కటాఫ్‌ను 100 నుండి 300 మంది ఉద్యోగులకు పెంచుతుంది, ఒక సంస్థను మూసివేయడానికి లేదా కార్మికులను వారి ఉద్యోగాల నుండి తొలగించడానికి ప్రభుత్వ అనుమతి అవసరం. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటిఫికేషన్ ద్వారా ఎప్పుడైనా ఈ కటాఫ్‌ను పెంచడానికి కూడా అనుమతిస్తుంది. వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యంపై నియమావళి వ్యవసాయ కార్మికులు, చిన్న నిర్మాణాలలో పని చేసే కార్మికులు, ఇంటి ఆధారిత కార్మికులు, చేపల కార్మికులు, గృహ కార్మికులను కవర్ చేయదు, వీరంతా కలిసి శ్రామిక వర్గంలో చాలా ఎక్కువ భాగాన్ని కలిగి ఉన్నారు.

ఎ.వేణు మాధవ్

## యువత కోసం అధునాతన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ నగరంలోని బోయపల్లి గేట్, మోతి మసీదు సమీపంలో అధునాతన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేయించి, యువతకు నైపుణ్య శిక్షణ అందించి, వారికి ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేస్తామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మోతి మజీద్ దగ్గర ఎమ్మెల్యే స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ కోసం స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మాణానికి మైనారిటీ ఫండ్ 50 లక్షల రూపాయలనుమంజూరు చేయ లడుకున్నామని ఆయన వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా నైపుణ్య ఉన్న సిబ్బంది కొరత ఉన్న నేపథ్యంలో మహబూబ్‌నగర్ యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వృత్తి నైపుణ్యాలు అందించే దిశగా మరిన్ని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాబోయే 10 సంవత్సరాల్లో కనీసం 20 వేల మందికి నైపుణ్య శిక్షణ అందించడంలో తమ లక్ష్యమని ఆయన తెలిపారు. బోయపల్లి గేట్, పరిసర ప్రాంతాల యువతకు ఉపాధి రూపొందించనున్నామని అన్నారు.

## ఎన్నికల సరళి పరిశీలన

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** ఎంసిసి నోడల్ ఆఫీసర్ అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్ గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికలు జరుగు ఐదు మండలాల్లో మహ్మదాబాద్ మండలం నంచర్ల గ్రామం, వెనికి తండా మహ్మదాబాద్ మండలం కేంద్రం గ్రామపంచాయతీలో జరుగు ఎన్నికల కేంద్రాలని పరిశీలించడం జరిగింది. గండీడ్ మండలం వెన్నచెడ్ గ్రామం గన్నేరు మండలం కేంద్రం ఎన్నికల కేంద్రం కేంద్రాల ను పరిశీలించడం జరిగింది. కాకర్లపాడు గ్రామం నవాబ్ పేట మండలం పోలింగ్ కేంద్రంలో జరుగు ఎన్నికల ని పరిశీలించడం జరిగింది. తాగిల్లర్లు , ఎంపీడీ వోలు పాల్గొన్నారు. అలాగే రిసెప్షన్ సెంటర్ ను పరిశీ లన చేయడం జరిగింది.



## పోలింగ్, పోలింగ్ ముందురోజు కూడా పాఠశాలలకు సెలవు

**ప్రజాపక్షం/నారాయణపేట:** గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో విడతల వారీగా ఎన్నికలు జరిగే ఆయా మండలాల్లో పోలింగ్ రోజున, పోలింగ్ ముందు రోజున విద్యాసంస్థలకు స్థానిక సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లాలో రెండో విడతలో ఎన్నికలు జరిగే నారాయణపేట, దామరగిద్ద, ధన్వాడ, మరికల్ మండలాల్లో పోలింగ్ జరిగే ఈనెల 14న ఆదివారం, ముందు రోజు 13న రెండవ శనివారం సాధారణ సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. మూడవ విడతలో ఎన్నికలు జరిగే మక్తల్, మాగనూరు, కృష్ణా, నర్వ, ఉట్కూరు, మండలాల్లో పోలింగ్ రోజు ఈ నెల 17వ తేదీన, ముందు రోజు 16వ తేదీన అన్ని విద్యాసంస్థలకు సెలవులు ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. సెలవులను వినియోగించుకుని ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

## ఐదు మండలాల్లో..

## తొలి విడత పోలింగ్ 83.04 శాతం

**మొత్తం 1,55,544 ఓట్లు..పోలైన ఓట్లు 1,29,165**

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మొదటి విడత ఎన్నికల పోలింగ్ 83.04 శాతం నమోదు అయింది. గండీడ్, నవాబ్ పేట, మహమ్మదాబాద్, రాజా పూర్, మహబూబ్ నగర్ మండలాల్లో గురువారం పోలింగ్ నిర్వహించారు. ఐదు మండలాల్లో కలిపి మొత్తం 1,55,544 ఓట్లు ఉండగా 129165 పోల్ అయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 83.04 శాతం పోలింగ్ నమోదు అయింది.

**మండలాల వారిగా ఓట్లు. నమోదు అయిన పోలింగ్ శాతం**

మహబూబ్ నగర్ రూరల్ మండలంలో మొత్తం ఓటర్లు 33918 మంది ఉండగా 29407 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 86.70 శాతం నమోదు అయింది. నవాబ్ పేట మండలంలో మొత్తం ఓటర్లు 38535 మంది ఉండగా 33, 544 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 87.05 శాతం నమోదు అయింది. రాజాపూర్ మండలంలో మొత్తం ఓటర్లు 20925 మంది ఉండగా 18,824 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 89.96శాతం నమోదు అయింది. మహమ్మదాబాద్ మండలంలో మొత్తం ఓటర్లు 30871 మంది ఉండగా, 23173 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 75.06 శాతం నమోదు అయింది.

## ఓటరు ప్రసన్నం కోసం ప్రచారం



**ప్రజాపక్షం/అడ్డాకుల:** అడ్డాకుల మండల పరిధిలోని బలీదుపల్లి గ్రామ అభివృద్ధి కృషి చేస్తామని గ్రామ ప్రజలు మహిళలు యువకులు, పెద్దలు అందరూ ఆదరించిభారీ మెజార్టీతో గెలిపించాలని బలీదుపల్లి గ్రామ సర్పంచు అభ్యర్థి కరుణాకర్ రెడ్డి అభ్యర్థించారు. గురువారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వనపర్తి ఎమ్మెల్యే మేగారెడ్డి ఆదేశాల మేరకు గ్రామ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీకి సాధ్యమవుతుందన్నారు. అన్ని రంగాలలో అభివృద్ధి కాంగ్రెస్ పార్టీకి సాధ్యమవుతుందన్నారు. అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేస్తానని ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ సమస్యలు పరిష్కరించి అభివృద్ధి వైపు బలీదుపల్లి గ్రామము తీసుకెళ్తానని అన్నారు. కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ డి. జానకి సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ధర్మాపూర్, రాజాపూర్ మండలంలోని రాజాపూర్, తిరుమలాపూర్, నవాబ్ పేట మండలంలోని లింగంపల్లి, గురుకుంట, నవాబ్ పేట, కారుకొండ, మహమ్మదాబాద్ మండలంలోని మహమ్మదాబాద్, కొండారెడ్డిపల్లి, గండీడ్ మండలంలోని గండీడ్, వెన్నచేడ్ గ్రామాలలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో భద్రతా పరిస్థితులను ఎస్పీ పరిశీలించారు. అనంతరం కౌంటింగ్ జరుగుతున్న మహమ్మదాబాద్ మండల గ్రామాలైన జూపల్లి, నన్చర్ల , గాధిర్యాల గ్రామాల్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు.కట్టుదిట్టమైన భద్రతను కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

## మండలంలో ప్రశాంతంగా ఎన్నికలు

**ప్రజాపక్షం/ కొత్తపల్లి:** మొదటి విడత సర్పంచ్ ఎన్నికలో కొత్తపల్లి మండలంలో గురువారం రోజు సాగిన ఎన్నికల్లో 12 గ్రామ పంచాయతిల్లో మొత్తం ఓటర్లు 12753 మంది ఉండగా ,10466 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.మండలంలో86.7 శాతం పోలింగ్ నమొదయ్యింది. అత్యధికంగా మండలంలో భూనీడ్ అభ్యర్థి పవారి పుష్పమ్మ 337 ఓట్లతో గేలుపోందారు. అత్యల్పంగా గోర్లోని బాయి గ్రామ పంచాయతి ఎన్నికల్లో 14 ఓట్లతో గెలుపోందారు. గ్రామ పంచాయతిల వారిగా గెలుపోందిన సర్పంచ్ అభ్యర్థులు అల్లిపూర్ భారతమ్మ,ఎక్కామేడ్ మౌనిక,తిమ్మారెడ్డిపల్లి జ్ఞానేశ్వర్ రెడ్డి,దుప్పటిగట్టు వెంకటయ్య,మన్నాపూర్ శ్రీనివాస్ రెడ్డి,పెద్దాపూర్ మల్లు రవి,కొత్తపల్లి తాండ విస్లావాత్ జుక్యానాయక్,కిషన్ నగర్ ఆంజనేయులు, కొత్తపల్లి చెన్నప్ప,గోకుల్ నగర్ షెక్ మిరాన్ సర్పంచ్‌లుగా గెలుపోందారు. కాగా మండలంలో మొదటి విడత ఎకగ్రివ సర్పంచ్‌లుగా నామినేషన్‌ల ఉపసంహరణకు ముందే నిడ్జింత రజిత, లింగల్ చేడ్ విజయలక్ష్మి ,నందిగామ శారద బాయి, వాల్యానాయక్ తాండ రమేష్ నాయక్ లను ఎకగ్రివంగా ఎన్నుకున్నారు. మండలంలో కాంగ్రేస్ పార్టిబలపరిచిన అభ్యర్థులు 14మంది గెలుపోందారు. ఒకరు బిజేపి,ఒకరు టిఆర్ఎస్ ఒకరు గెలుపోందినట్లు కాంగ్రేస్ మండల అధ్యక్షుడు మహెందర్ రెడ్డి తెలిపారు.

**ప్రజాపక్షం/ మద్దూర్ :** మద్దూర్ మండలంలో గురువారం సాగిన ఎన్నికల్లో 18గ్రామపంచాయతిల్లోమొత్తంఓటర్లు21597మందిఉండగా 18 323 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలో 84.84 శాతంపోలింగ్‌నమొదయింది.. సర్పంచ్ అభ్యర్థులు ఖాజీపూర్ ఎం పాయప్ప, చెన్నారెడ్డిపల్లి ఎన్ కన్నప్ప, అచ్చంపల్లి ఇందిరమ్మ,చెన్నారం తిరుపతి రెడ్డి,పల్లెగడ్డతాండ సీతా బాయి,పోర్లకుంట తాండ దశరత్ నాయక్, హన్మ్యనాయక్ తాండరాజు నాయక్, జాదవరావు పల్లి జి సాయులు, జాదవరావుపల్లి తాండ రవినాయక్ సర్పంచ్‌లుగా గెలుపొందారు.

# ప్రశాంతంగా ముగిసిన మొదటివిడత పోలింగ్

**జిల్లాలో మొదటిఫేజ్ పోలింగ్ శాతం**

**86.32**

**కలెక్టర్ బదావత్‌సంతోష్**



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలో మొదటివిడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఉదయం 7గంటలకే పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం ఒంటిగంటవరకు పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగిందని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో కల్వకుర్తి, ఊర్కొండ, వెల్దండ, వంగూరు, తాడూరు, తెలకపల్లి ఆరు మండలాల్లో గురువారం పోలింగ్ నిర్వహించారు. 82.73 జిల్లాలో మొదటిఫేజ్ పోలింగ్ శాతం 86.32, ఆరు మండలాల్లో మొత్తం 1,81,543, ఓట్లలో పోలైన ఓట్లు 1,56,710, గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటిఫేజ్ ఎన్నికల పోలింగ్ 82.73 శాతం నమోదైంది.]కల్వకుర్తి, ఊర్కొండ, వెల్దండ, వంగూరు, తాడూరు, తెలకపల్లి ఆరు మండలాల్లో కలిపి మొత్తం 1,81, 543 ఓట్లలో 1,56,710 పోలయ్యాయి. మధ్యాహ్నం ఒంటిగంటవరకు 82.73 శాతం పోలింగ్ నమోదైంది.

**మండలాల వారీగా ఓటర్లు నమోదైన పోలింగ్ శాతం**

కల్వకుర్తి మండలంలో మొత్తం ఓటర్లు 29, 857 మంది ఉండగా 26,280మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 88.02శాతం నమోదైంది. ఊర్కొండ మండలంలో మొత్తం ఓటర్లు 16,440మంది ఉండగా 14,751 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 89.73శాతం నమోదైంది. వెల్దండ మండలంలో మొత్తం ఓటర్లు 32,702మంది ఉండగా 23, 919మందిఓటు హక్కు వినియోగించుకున్నారు. 88.43 శాతం నమోదైంది. వంగూరు మండలంలో మొత్తం ఓటర్లు 31,284 మంది ఉండగా 26,857మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 85.85శాతం నమోదైంది. తాడూరు మండలంలో మొత్తం ఓటర్లు 29,639మంది ఉండగా 25,947మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 87.54 శాతం నమోదైంది. తెలకపల్లి మండలంలో మొత్తం ఓటర్లు 41,621మంది ఉండగా 33,956మంది ఓటుహక్కువినియోగించుకున్నారు. 81.58శాతం నమోదైంది.జిల్లాలోకొన్నిపోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సమయం ముగిసిన కొన్నిచోట్ల ఓటర్లు లైన్లో ఉండగా గేట్లు వేసి మధ్యాహ్నం ఒంటిగంటలోపు క్యూలైన్‌లో ఉన్నవారికిఓటువేసేఅవకాశంకల్పించడంజరిగిందని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేలా జిల్లాయంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు, ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు.

## 'నవాబుపేట, మహబూబ్‌నగర్'ల్లో పోలింగ్ సరళి పరిశీలన

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా గురువారం జిలా కలెక్టర్ విజయేందిర బోయి నవాబ్‌పేట మండలం, మహబూబ్‌నగర్ మండలం లోని గ్రామాల్లో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఓటర్లు ఓటు వేసేందుకు చేసిన ఏర్పాట్లు , పోలింగ్ కేంద్రాల పరిధిలో పరిస్థితులను తదితర అంశాలను ఆమె పరిశీలించారు. ముందుగా జిల్లా కలెక్టర్ ఉదయం 7 గంటల నుండి నవాబ్ పేట మండలంలో కారుకొండ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రుద్రారం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, నవాబ్ పేట్ మండలం, గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. తర్వాత మహబూబ్ నగర్ రూరల్ మండలంలో ధర్మాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జమిస్తా పూర్ లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అప్పయ్య పల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం 7 గంటలకే మొదటి విడత ఎన్నికలుజరిగేఅన్ని పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రారంభమై, ఓటర్లు తమ ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో వెడ్ కాస్టింగ్, మైక్రో అబ్జర్వర్ ల ద్వారా పోలింగ్ కేంద్రాల్లో పర్యవేక్షణ నిర్వహించారు. పోలింగ్‌పూర్తయినతర్వాతమధ్యాహ్నం 2 గంటలనుండిఓట్లలెక్కింపుప్రారంభమైంది.

## రెండవ విడత ఎన్నికలకు సమాయత్తం

**కలెక్టర్ విజయేందిర బోయి**

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** జిల్లాలో రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలరని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో శిక్షణలో పాల్గొన్న ప్రిసైడింగ్ అధికారులు శిక్షణలో కార్యక్రమంలో ఆమె పి.ఓ లకు దిశా నిర్దేశం చేశారు. రెండవ విడతలో హన్వాడ, దేవరకద్ర, కోయిలకొండ, సిసి కుంట, కౌకుంట్ల, మిడ్జిల్, మండలాల్లోని గ్రామపంచాయతీ లకు, వార్డ్ సభ్యులకు ఈనెల 14 న ఉదయం 7.00 నుండి 1.00 వరకు పోలింగ్ జరుగుతుందని అన్నారు. పి.ఓ.లు పోలింగ్ ముందు రోజు సమాయానికి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను చేరుకొని ఎన్నికల సామాగ్రినీ స్వీకరించాలన్నారు. ఎన్నికల సామాగ్రిని ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలని అన్నారు. బ్యాలెట్ బాక్సులు సరిగ్గా పని చేస్తున్నాయా చూసుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్లు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రానివేనా, అవి సరిగ్గా ఉన్నాయా, సరిచూసుకోవాలన్నారు. పి.ఓ లు ఎన్నికల ముందు రోజే వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలను చేరుకొని ఎన్నికల నియమావళికి అనుగుణంగా పోలింగ్ బూత్ ఏర్పాట్లను చూసుకోవాలన్నారు. పి.ఓ లు ఎన్నికలను, ప్రశాంతంగా, పారదర్శకంగా, బాధ్యతగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల సమయంలో వారికి ఏమైనా అనుమానాలు, సమస్యలు వస్తే, పీ.ఓ. రూల్ బుక్ ని అనుసరించాలని, లేదా వెంటనే వారి పై అధికారులను, సంప్రదించాలని, సూచించారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే బ్యాలెట్ బాక్స్ సీలింగ్, పి.ఓ. డైరీ, బ్యాలెట్ పేపర్ అకౌంట్, అటువంటి తప్పుల్లేకుండా నిర్వహించాలని సూచించారు. మధ్యాహ్నం 2.00 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించాలని, సాయంత్రం లోపు, ఎన్నికల ఫలితాలను ప్రకటించి, అదే రోజు ఉపసర్పంచుల ఎన్నిక కూడా పూర్తి చేయాలన్నారు.

## సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ నియోజకవర్గం, హన్వాడ మండలంలోని ఇబ్రహీంబాద్ గ్రామంలో జరుగుతున్న గ్రామపంచాయితీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచు అభ్యర్థి అంజిలయ్యకు మద్దతుగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విస్తృతప్రచారం చేపట్టారు.ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంబాద్ గ్రామం సమగ్ర అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ బలపరిచిన సర్పంచు అభ్యర్థి అంజిలయ్య ను,వార్డు సభ్యులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు, రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఆర్టీసీ బస్‌లలో ఉచిత బస్ ప్రయాణం, రైతులకు రుణమాఫీ అందిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో గ్రామానికి మరింత అభివృద్ధి తీసుకురావాలంటే అంజిలయ్య గెలుపునకు ప్రజలు ఒకటిగా నిలబడి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. మహిళల శక్తి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. మహిళా సంఘాలకు గత ప్రభుత్వం రద్దు చేసిన వడ్డీలేని రుణాలను, ప్రస్తుత ప్రజా ప్రభుత్వం మళ్లీ ప్రారంభించిందని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులను చేసే దిశగా పథకాలు అందిస్తున్నామన్నారు.టిపిసిసి ప్రధానకార్యదర్శి మిథున్‌రెడ్డి,డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, బెక్కెరి మధుసూదన్‌రెడ్డి, మారేపల్లి సురేందర్‌రెడ్డి, మైత్రి యాదయ్య, గంగిరెడ్డి, సంజీవరెడ్డి, కృష్ణారెడ్డి,పల్లెమోని యాదయ్య, మహమ్మద్, రియాజ్, చందు, తదితరులు పాల్గొన్నారు.

## 'నారాయణపేట'లో ప్రశాంతంగా పోలింగ్

**జిల్లాలో తొలి విడత పోలింగ్ శాతం**

**84.58**

**మొత్తం ఓట్లు 66,68, పోలైన ఓట్లు**

**56,403**



**ప్రజాపక్షం/నారాయణపేట:** గ్రామ పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో నారాయణపేట జిల్లాలో తొలి విడత ఎన్నికల పోలింగ్ 84.58 శాతం నమోదు అయింది. గుండుమల్, కోస్గి, కొత్తపల్లి, మద్దూరు, మండలాల్లో గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. నాలుగు మండలాల్లో కలిపి మొత్తం 66,689 ఓట్లు ఉండగా, 56,403 ఓట్లు పోల్ అయ్యాయి. మధ్యాహ్నం 1.00 గంటల వరకు 84.58 శాతం పోలింగ్ నమోదు అయింది. అయితే నాలుగు మండలాల్లో మొత్తం 34,146 మంది మహిళా ఓటర్లకు గాను 27, 837 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా, మొత్తం 32,540 మంది పురుష ఓటర్లకు గాను 28,566 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా నాలుగు మండలాలలో అత్యధికంగా కోస్గి మండలంలో 86.7 శాతం పోలింగ్ నమోదు కాగా , అత్యల్పంగా గుండుమాల్ మండలంలో 83.06 పోలింగ్ నమోదు అయింది.

**మండలాల వారిగా ఓటర్లు నమోదు అయిన పోలింగ్ శాతం**

గుండుమల్ మండలంలో మొత్తం ఓటర్లు 15, 534 మంది ఓటర్లు ఉండగా, 12,903 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ మండలంలో మొత్తం 83.06 శాతం పోలింగ్ నమోదు అయింది. కొత్తపల్లి మండలంలో మొత్తం ఓటర్లు 12,753 మంది ఉండగా, 10,466 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ మండలంలో 83.17 శాతం పోలింగ్ నమోదు అయింది. ఇక మద్దూరు మండలంలో మొత్తం ఓటర్లు 21,597 మంది ఉండగా, 16,552 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం నాలుగు మండలాలు కలిపి 84.58 శాతం పోలింగ్ నమోదు అయింది.

## మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో

## విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** మండల పరిధిలోని తూముకుంట గ్రామపంచాయితీ ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించి సర్పంచిగా గెలిపిస్తే రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో విద్య, వైద్యం, తో పాటు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్తానని కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సర్పంచు అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రజా సేవకుడు, సౌమ్యుడు పలుస రామన్ గౌడ్ గ్రామ ప్రజలకు తన అభివృద్ధి ప్రణాళికలను తెలిపారు. గ్రామంలోనే నివాసముంటూ, ప్రజలతో కలిసి పెరిగిన తాను ప్రజలకు అందుబాటులో ఉండే సేవకుడినని వెల్లడించారు. ప్రస్తుత ప్రభుత్వ సహకారంతో తూముకుంట అభివృద్ధి పథంలో నడిపించేందుకు కట్టుబడి ఉన్నానని ఆయన హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతుండడంతో, మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో గ్రామానికి మరిన్ని అభివృద్ధి నిధులను తీసుకురాగలనని పలుస రామన్ గౌడ్ వివరించారు. గ్రామ భవిష్యత్తు కోసం ప్రజలు మార్పుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రతి ఇంటికి శుద్ధి చేసిన త్రాగునీరు అందేలా చర్యలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, గ్రామ వీధుల అభివృద్ధి పాఠశాలల ను ఆదర్శ పాఠశాలలుగా మార్చడం, యువతకు ఉపాధి శిక్షణలు, ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు మందుల లభ్యత ప్రతి ఖర్చు, ప్రతి పని ప్రజల ముందే, అవినీతి ప్రవేశించనీయకుండా నిర్వహణ, గ్రామ ప్రజలు సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ఇప్పటికే గ్రామంలో మంత్రి జూపల్లి సహకారంతో అంగన్వాడి భవనాల నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు.

## 'కోడ్' ముగిసేవరకూ.. ర్యాలీలు, బైక్ యాత్రలు నిషేధం

**జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**



**ప్రజాపక్షం/వనపర్తి:** ఎన్నికల ఫలితాలు వచ్చినా ర్యాలీలు, బైక్ శోభాయాత్రలు, పూర్తిగా నిషేధం. నిబంధనలు ఉల్లంఘిస్తే వెంటనే చట్టపరమైన చర్య లు తప్పవు ఎస్పీ ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రత పరిరక్షణకు మూడు దశల పంచాయితీ ఎన్నికల పూర్తిస్థాయి ప్రక్రియ ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ యంసిసి అమల్లోనే కొనసాగుతుందని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఐపిఎస్ స్పష్టంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల తొలి దశలో ఫలితాలు ప్రకటించినప్పటికీ, గెలిచిన అభ్యర్థులు లేదా వారి అనుచరులు ఇప్పుడే విజయోత్సవ ర్యాలీలు, భారీ సభలు, బైక్ ర్యాలీలు, శోభాయాత్రలు, ఊరేగింపులు, డీజేలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం పూర్తిగా నిషేధం. యంసిసి అమల్లో ఉన్నంత కాలం ఈ ఆంక్షలను తప్పనిసరిగా పాటించాలని నియమాలను అతిక్రమించే ఏ చర్యనైనా సహించం. ఉల్లంఘనలు జరిగితే వెంటనే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత. శాంతియుత వాతావరణం నెలకొనడానికి ప్రజలు, నాయకులు, అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని ఆమె అన్నారు.

## మానవత్వం చాటుకున్న మహబూబ్‌నగర్ పోలీసు



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం, ధర్పల్లి గ్రామ పంచాయతీలో జరుగు గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా హృదయాన్ని హత్తుకునే ఘటన చోటుచేసుకుంది. పోలింగ్ బూత్ వద్ద వీల్ చైర్ అందుబాటులో లేక, నడవలేని పరిస్థితిలో ఓటు వేయడానికి వచ్చిన వృద్ధురాలిని గుర్తించిన మహబూబ్ నగర్ జిల్లా పోలీస్ కానిస్టేబుల్ శ్రీను వెంటనే స్పందించారు. వృద్ధురాలి అసౌకర్యాన్ని గుర్తించిన ఆయన తన చేతుల మీదుగా ఎత్తుకొని పోలింగ్ బూత్ వరకు తీసుకెళ్లి ఆమె ఓటు హక్కు వినియోగించుకునేలా చేయడం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారు. ఎన్నికల విధుల్లో మాత్రమే కాకుండా, సేవాభావం, కర్తవ్యనిబద్ధతకు నిదర్శనంగా నిలిచిన కానిస్టేబుల్ శ్రీను. జిల్లా ఎస్పీ డి. జానకి, కానిస్టేబుల్ శ్రీను ప్రవర్తనను అభినందిస్తూ, '' పోలీస్ డిపార్ట్మెంట్ యొక్క అసలు లక్ష్యం ప్రజలకు సేవ చేయడం. శ్రీను చేసిన ఈ సేవ ప్రతి పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తుంది'' అని పేర్కొన్నారు. మానవత్వంతో కలిసిన కర్తవ్యనిర్వహణకు నిలువెత్తు ఉదాహరణగా నిలిచిపోయింది.

## పోలీసు బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాపక్షం/ కొత్తపల్లి/ మద్దూర్ :** నారాయణపేట జిల్లా పరిధిలో జరుగుతున్నా మొదటి విడత గ్రామ పంచాయతి ఎన్నికల సంధర్భంగా గురువారం రోజు కొత్తపల్లి, మద్దూర్ మండలాలో ఎన్నికల సరళిని, పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పి వినీత్ స్వయంగా పరిశిలించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అంతారాయం లేకుండా శాంతియుత వాతావరణంలో సర్పంచ్ ఎన్నికలు కొనసాగేలా చూడాలని ,పోలిసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామ పంచాయతి ఎన్నికలు సెన్సిటివ్,హైపర్ సెన్సిటివ్ పోలింగ్ స్టేషన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఓటు వేయడానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ,క్యూ లైన్‌లో ఉండేలా ఆయన తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు పోలిస్ విభాగం హై అలర్ట్‌లో కోనసాగాలని, శాంతిభద్రతలను కాపాడడంలో ప్రతి పోలిసు సిబ్బంది అత్యంత బాధ్యతగా ఉండాలని తెలిపారు.

## ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కృషి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** పేద ప్రజలను మభ్య పెట్టేందుకు డబుల్ బెడ్రూం ఇండ్లు పథకం చూపించి, ఎవరికి ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వలేదని, డబుల్ బెడ్రూం ఇండ్లు పథకం ఓ డమ్మీ పథకం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. మహబూబ్ నగర్ నియెజకవర్గం, హన్వాడ మండలంలోని ముని మోక్షం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి రామేశ్వర్ రెడ్డి గెలుపు కోసం ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశం కోసం 23 సంవత్సరాలు తన అమూల్యమైన సేవలను అందించిన మాజీ సైనికుడు రామేశ్వర్ రెడ్డి, ఇప్పుడ ముని మోక్షం గ్రామానికి రక్షణగా నిలుస్తారని అభిప్రాయపడ్డారు. గ్రామ అభివృద్ధికి నిబద్ధతతో పనిచేసే వ్యక్తిగా ఆయనను ప్రజలె అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజా క్షేమమే లక్ష్యంగా ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నామని తెలిపారు. మహిళలను కోటిశ్వరులుగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం వెనుక ఉన్న దృక్పథాన్ని వివరించారు. మహిళలు బస్సు టికెట్ కొనుకునే స్థితి నుంచి బస్సుల ఓనర్లుగా మారే స్థాయికి తీసుకెళ్లిన దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. అలాగే వడ్డీ లేని రుణాలు, మహిళా పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించే చర్యలు రాష్ట్రంలో వేగంగా అమలువుతున్నాయని అన్నారు. గత పది సంవత్సరాల పాటు ఒక్క రేషన్ కార్డు కూడా బిఆర్ఎస్ పార్టీ పేద ప్రజలకు ఇవ్వలేదని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇచ్చామని, రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని ఆయన గుర్తు చేశారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరుతో వారి ఆత్మగౌరవాన్ని పెంచామని గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు కేటాయింపు జరుగుతుందని, రాబోయే ఏప్రిల్ లో మరో 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కానున్నాయని వెల్లడించారు. ఉచితంగా 200 యూనిట్ల వరకు విద్యుత్ ను అందిస్తున్నామని తెలిపారు.

## ప్రశాంతంగా ఎన్నికలు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** మొదటి విడత పంచాయితీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. అడివెంల, రామన్నగూడెం ఎంపిపిఎస్‌లలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించి సందర్శకుల ఫారంలో సంతకం పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిలాల్లో మొదటి విడత కింద జరిగే పంచాయితీ ఎన్నికలు ఉదయం ఏడు గంటల నుండి పోలింగ్ ప్రారంభమైందని తెలిపారు. కలెక్టర్ వెంట తహశీల్దార్లు కృష్ణయ్య, శ్రీకాంత్, ఆర్ఓలు లింగయ్య, శ్రీనివాస్, వెంకటనారాయణ, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.




## ఓటు విలువైనది : ఎమ్మెల్యే బీర్ల

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య గురువారం తమ సొంత గ్రామమైన సైదాపూర్లో కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, యాదగిరిగుట్ట మండలం, సైదాపూర్ గ్రామంలో జరుగుతున్న గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా ఆయన తన సతీమణి మరియు కుటుంబ సభ్యులతో కలిసి పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశారు. ఓటు వేసిన అనంతరం ఎమ్మెల్యే అయిలయ్య మాట్లాడుతూ 'ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనది. ఇది మన భవిష్యత్తును నిర్ణయించే హక్కు ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ ఓటు హక్కును సకాలంలో తప్పకుండా వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.





## నీతిమంతమైన పాలన కాంగ్రెస్‌కే సాధ్యం

### ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/బీబీనగర్ :** నీతివంతమైన పాలన అందించడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మగ్గంపల్లి, బీబీనగర్, చిన్న రావులపల్లి, రాఘవపురం గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం పట్టణంలో బ్రాహ్మణపల్లి చౌరస్తా నుండి జైనపల్లి చౌరస్తా మాధవరెడ్డి విగ్రహం వరకు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు, రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యం, ఉచిత విద్యుత్తు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కింది అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోలి పింగళి రెడ్డి, పంజాల రామాంజనేయులు గౌడ్, నరేందర్ రెడ్డి, లక్ష్మ య్య, గోలి నర్సింహారెడ్డి, పంజాల వెంకటేష్ పాల్గొన్నారు.

## మెరుగైన సేవలందించాలి

### డిఎంఅండ్‌హెచ్ఒ పుట్ల శ్రీనివాస్



**ప్రజాపక్షం/నందికొండ:** మున్సిపాలిటీ నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలోని బస్తీ దవాఖానకు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం నాగార్జునసాగర్, పైలాన్ కాలనీలో ఉన్న బస్తీ దవాఖానను ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారిపుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం నాగార్జునసాగర్, పైలాన్ కాలనీలో ఉన్న బస్తీ దవఖానను ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి రవి,జిల్లా టిబి నివారణ అధికారి కళ్యాణ్ చక్రవర్తిలతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులను, మెడిసిన్ స్టాక్ రికార్డును, రోగులకు ఇస్తున్న మందులను పరిశీలించారు. ఎన్‌సిడి,ఏ ఎన్ సిల నమోదు ప్రక్రియ, వ్యాక్సినేషన్ తదితర వివరాలు ఆసుపత్రి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బస్తీ దవఖాన పరిధిలో జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలతో పాటు వారు పొందుతున్న వైద్య సేవలు గురించి తెలుసుకున్నారు. బస్తీ దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి డాక్టర్ హరికృష్ణను ఆదేశించారు. ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది ఝాన్సీ, వెంకన్న ఉన్నారు.

## అవాంఛనీయ సంఘటనలకు చోటు లేదు



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** మండలంలోని కొత్తగూడెం గ్రామంలో ఉన్న అత్యంత కీలక పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్‌పి కె నరసింహ స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, పోలీసులు నిర్వహిస్తున్న విధులు, శాంతిభద్రతలపై తీసుకుంటున్న చర్యలను వివరంగా తెలుసుకున్నారు. పోలింగ్ సందర్భంగా ఎటువంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామంలో పరిస్థితులను పరిశీలిస్తూ ప్రజలు స్వేచ్ఛగా, భయభ్రాంతులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులతో మాట్లాడి అవసరమైన సూచనలు చేసిన పర్యటనతో పోలింగ్ కేంద్రాల వద్ద చురుకుదనం నెలకొంది. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి సిఐ సిబ్బంది పాల్గొన్నారు.

## వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియ



**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లావ్యాప్తంగా గురువారం పలు గ్రామాల్లో నిర్వహించి న గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఎన్నికల సరళి ని, కౌంటింగ్ ప్రక్రియను జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించారు.ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు పక్రియలో గొడవలు, అల్లర్లు సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు. గ్రామాల్లో గొడవలు,అల్లర్లు సృష్టించే వారిపై ప్రత్యేక బృందాల ద్వారా నిఘా ఏర్పాటు శేషమన్నారు.గెలుపొందిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులకి అనుమతి లేదని వెల్లడించారు.

## ఎన్నికల సరళి పరిశీలన



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** పట్టణంలో మొదటి దశ ఎన్నికలలో భాగంగా గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకు రాలు ఐఏఎస్ అధికారి కొర్ర లక్ష్మి అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ తో కలిసి జిల్లా పరిషత్ హై స్కూల్ ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ పై సంతృప్తి ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో ఆర్ డి ఓ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు,ఎంపీడీఓ ఉమేష్, ఆర్ ఐ తరుణ్ కుమార్, ఈ ఓ సుభాన్ తదితరులు ఉన్నారు.

# సూర్యాపేట జిల్లాలో 89.69 శాతం పోలింగ్

### ముగిసిన తొలివిడత పంచాయతీ ఎన్నికలు





**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో తొలి విడుత ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం జిల్లాలో 23 మండలాలు ఉండగా తొలి విడత 8 మండలాల్లో అధికారులు ఎన్నికలు నిర్వహించారు. వీటిలో తుంగతుర్తి, జాజిరెడ్డిగూడెం, నాగారం, తిరుమలగిరి, నూతనకల్, మద్దిరాల, ఆత్మకూర్(ఎస్), సూర్యాపేట రూరల్ మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 159 గ్రామ పంచాయితీలకు సర్పంచ్, 1442 వార్డులకు ఎన్నికలు జరుగాల్సి ఉండగా 7 గ్రామ పంచాయితీలకు సర్పంచ్‌లు, 198 వార్డులకు వార్డుసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా మిగతా 152 గ్రామ సర్పంచ్, 1244 వార్డులకు ఎన్నికలు జరిగాయి. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా మధ్యాహ్నం 1 గంట వరకు ఓటు హక్కును వినియోగించుకునేందుకు క్యూలో ఉన్న వారందరికి టోకెన్ సిస్టమ్ ద్వారా ఓటును వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. మాజీ మంత్రి దామోదర్ రెడ్డి తనయుడు, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తుంగతుర్తిలో తన ఓటు హక్కును వినియోగించుకోగా, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, అతని సతీమణి లావణ్యలు సూర్యాపేట మండలంలోని తన స్వగ్రామమైన బాలెంలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఎన్నికల అధికారులు ఆయా గ్రామ పంచాయితీల్లో ఓట్ల లెక్కింపును మొదలుపెట్టారు. ముందు వార్డుల వారీగా ఓట్లను లెక్కించి గెలుపొందిన అభ్యర్థులను అధికారులు ప్రకటించగా అనంతరం సర్పంచ్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు కొనసాగించారు. చిన్న గ్రామ పంచాయితీలలో ఫలితాలు మధ్యాహ్నం 3 గంటల వరకు వెలువడగా మేజర్ గ్రామ పంచాయితీల్లో ఓట్ల లెక్కింపు రాత్రి పొద్దుపోయేంత వరకు కొనసాగింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె నరసింహలు ఎన్నికలు జరిగిన ఆయా గ్రామ పంచాయితీలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎక్కడ ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్‌లు భారీ బందోబస్తును నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టి నిఘా కెమెరాల మధ్య ఎప్పటికప్పుడు పరిస్థితులను మానిటరింగ్ సెల్ ద్వారా పర్యవేక్షించారు.



**సూర్యాపేట జిల్లాలో 89.69 శాతం పోలింగ్**

తొలి విడత జరిగిన 8 మండలాల పరిధిలో 89.69 శాతం పోలింగ్ నమోదైనట్లు జిల్లా పంచాయితీ అధికారి అధికారికంగా వెల్లడించారు. మొత్తం 2,29,227 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 1,13,812, మహిళలు 1,15,410, ఇతరులు ఐదుగురు ఉండగా ఇందులో 1,02,631 మంది పురుషులు, 1,02,948 మంది మహిళలు, నలుగురు ఇతరులు, మొత్తం 2,05,583 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలాల వారీగా పరిశీలిస్తే ఆత్మకూర్(ఎస్)లో 89.11శాతం, సూర్యాపేట రూరల్ 90.30 శాతం, జాజిరెడ్డిగూడెం (అర్వపల్లి) 90.72 శాతం, మద్దిరాల 89.75 శాతం, నాగారం 89.17 శాతం, నూతనకల్ 90.87 శాతం, తిరుమలగిరి 91.05 శాతం, తుంగతుర్తి 86.91 శాతం పోలింగ్ నమోదైంది.

## ఉచితంగా పెరటికోళ్లు పంపిణీ

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** కెవికె గడ్డిపల్లి ఐసిఎఆర్ అటారీ, హైద్రాబాద్ వారి ఆర్థిక సహకారంతో షెడ్యూల్ కులాల రైతులకు పెరటికోళ్లను ఉచితంగా పంపిణీ చేసినట్లు కెవికె గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎన్.సుగంధి, ఇన్‌చార్జి ప్రొగ్రాం కోఆర్డినేటర్ డి.నరేష్‌లు తెలిపారు. గురువారం గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షెడ్యూల్ ఉప ప్రణాళికలో భాగంగా ఎంపిక చేసిన రైతులకు ఈ పెరటికోళ్లను అందిస్తున్నామని, నిరుపేద రైతులకు పెరటికోళ్ల పెంపకం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని తెలిపారు. రోజువారి ఆహారంలో మాంసకృత్తులు లభించడమే పోషకహార లోపాన్ని తగ్గించుకోవచ్చని, గుడ్ల ఉత్పత్తి, మాంసపు ఉత్పత్తిని సాధించడంతో పాటు పోషకాహారాన్ని పొందవచ్చని, వాటిని అమ్మడం ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.




# 'ఇక్కత్' డుప్లికేషన్‌తో చేనేత సంక్షోభం


### డుప్లికేషన్‌పై పోరాటానికి కేంద్రం రూ.100 కోట్ల నిధి ఏర్పాటు చేయాలి
### కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో డిమాండ్ చేసిన ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్




**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న హ్యాండ్లూమ్ రంగం, ముఖ్యంగా పోచంపల్లి ఇకత్ వస్త్రాల తయారీ క్లస్టర్, నకిలీ ఉత్పత్తుల (డుప్లికేషన్) కారణంగా తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర టెక్స్టైల్స్ మంత్రిత్వ శాఖ కన్సల్టేటివ్ కమిటీ సమావేశం ఢిల్లీలో గురువారం హ్యాండ్లూమ్ సెక్టార్ అంశంపై జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర టెక్స్టైల్స్ మంత్రి గిరిరాజ్ సింగ్, రాష్ట్ర మంత్రి పబిత్రమార్గరెటా, టెక్స్టైల్స్ కార్యదర్శి నీలిమ శర్మ రావు, హ్యాండ్లూమ్స్ డీసీ డాక్టర్ ఎం.బీనా పాల్గొన్నారు. ఈ సమావేశానికి హాజరైన పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కమిటీ దృష్టికి పోచంపల్లి ఇక్కత్ డూప్లికేషన్ సమస్యను తీసుకువెళ్లారు. రాష్ట్రంలోని 30 వేల హ్యాండ్లూమ్స్లో సుమారు 15 వేలు ఇక్కత్ వస్త్రాలనే తయారు చేస్తుండగా, ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 వేల కుటుంబాలు ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. పోచంపల్లి పరిసర ప్రాంతంలోని 40 గ్రామాల్లో ఏటా సుమారు రూ.1000 కోట్ల విలువైన పట్టు, పత్తి చీరలు తయారవుతున్నాయి. వీటిలో కొంత భాగం ఎగుమతులకు కూడా వెళుతోంది. అయితే, గత 20 ఏళ్లుగా పవర్లూమ్స్‌పై తయారవుతున్న ఇక్కత్ డుప్లికేట్ చీరలు గత పదేళ్లలో మార్కెట్ను పూర్తిగా ఆక్రమించాయి. అసలు హ్యాండ్లూమ్ పట్టు చీర రూ.10 వేల విలువ చేస్తే, నకిలీ చీరను కేవలం రూ.600 ఖర్చుతో తయారు చేసి మార్కెట్లోకి విడుదల చేస్తున్నారు. నేతన్నలు కొత్తగా రూపొందించిన డిజైన్లను పవర్లూమ్ యజమానులు కొన్ని వారాల్లోనే కాపీ చేసి చౌక ధరలకు విక్రయిస్తుండటంతో, అసలు హ్యాండ్లూమ్ వస్త్రాలకు డిమాండ్ భారీగా తగ్గిపోవడం వల్ల చేనేత సంక్షోభంలోకి నెట్టబడుతున్నదని' కమిటీ దృష్టికి చామల తీసుకువెళ్లారు. 2004లోనే ఇక్కత్‌కు జి.ఐ (Geographical Indication) గుర్తింపు లభించినప్పటికీ, ప్రస్తుతం ఈ రక్షణ వ్యవస్థ అమలు లోపం వల్ల ప్రభావవంతంగా పనిచేయని ఫలితంగా, వేలాది నేతన్నల జీవితాలు అనిశ్చితిలో పడి, సంప్రదాయ నైపుణ్యాలు కోల్పోయి, వలసలు పెరుగుతున్నాయని వివరించారు. ఇక్కత్ వస్త్రాల ప్రామాణికతను నిలబెట్టడానికి తక్షణమే రూ.100 కోట్ల ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలని వారికి విజ్ఞప్తి చేశారు. పోచంపల్లి హ్యాండ్లూమ్ చీరలకు ప్రత్యేక ధృవీకరణ ట్యాగ్ జతచేయాలన్నారు. డుప్లికేట్ తయారీదారులపై కఠిన చర్యలు తీసుకునేందుకు బలమైన న్యాయ వ్యవస్థను తీసుకురావాలన్నారు. ఆధునిక సాంకేతికత, యంత్రాలు ప్రవేశించడం వల్ల లక్షలాది మంది కార్మికులు, ముఖ్యంగా మహిళలు, అవసరమైన పెట్టుబడిని, ఉత్పత్తి వ్యయాలను భరించలేకపోవడం వల్ల వారి ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దెబ్బతిందని వివరించారు. ప్రభుత్వం నుంచి సమయానుకూల సహాయం అందకపోతే, సంప్రదాయ నైపుణ్యాలు వచ్చే దశాబ్దంలో క్షీణించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత నేతన్నల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు.

## తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదు

### ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/వలిగొండ :** నాపై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించే ప్రసక్తే లేదని స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలిగొండ జనరల్ టికెట్ నా సోదరునికే ఇచ్చారని బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆయన తిప్పికొట్టారు. గత 40 సంవత్సరాలుగా వలిగొండ గ్రామ అభివృద్ధికి పేద ప్రజల అభ్యున్నతికి కుంభం రమణారెడ్డి ఎన్నో సేవలు చేశారని ఎస్సీ కాలనీ, పోలీస్ స్టేషన్ సింగిల్ విండో బస్ స్టేషన్లకు ప్రభుత్వ పాఠశాలకు ఎకరాల భూములు దానం చేసిన గొప్ప కుటుంబం రమణారెడ్డిదని ఆయన కుమారుడిగా కుంభం వెంకట పాపిరెడ్డికి టికెట్టు ఇవ్వడం సమంజసమని గ్రామ పెద్దల అందరి అభిప్రాయంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండల పరిధిలో సోమవారం గ్రామంలో జనరల్ స్థానంలో అక్కడ పోటీ చేసేందుకు ఎంతోమంది ఉన్న అక్కడ ఒక దళిత కుటుంబానికి టికెట్ ఇచ్చి పోటీకి నిలబెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీది అయితే వారిపై రెడ్డి సామాజిక వర్గానికి టికెట్ కేటాయించి దళితులని అణగదొక్కే ప్రయత్నం బిఆర్ఎస్ పైళ్ల శేఖర్ రెడ్డి చేశారని విమర్శించారు.

**బిఆర్ఎస్‌లో నుండి కాంగ్రెస్‌లోకి చేరికలు...** వలిగొండ మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి కార్యకర్తలపై అనుసరిస్తున్న విధానాలు నచ్చక టిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిలో ఆత్మ మాజీ చైర్మన్ గంగాధరి రాములు, టిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మామిళ్ళ రత్నయ్య గుట్ట మాజీ డైరెక్టర్ పోలెపాక బిక్షపతి, మరికొందరు టిఆర్ఎస్‌కు చెందిన కార్యకర్తలకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# 14 మండలాల్లో 90.53శాతం పోలింగ్




### రాత్రి వరకూ కొనసాగిన సర్పంచ్ ఓట్ల కౌంటింగ్

**ప్రజాపక్షం/నల్లగొండ:** గ్రామ పంచాయతీ మొదటి విడత పోలింగ్ గురువారం ప్రశాంతంగా సాగింది. జిల్లాలోని నల్లగొండ, చందూరు డివిజన్ లోని 14 మండలలో ఎన్నికలు జరిగినవి. రెండు డివిజన్‌లో 90.53శాతం పోలింగ్ జరిగింది ఎన్నికల సరళిని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు.ఉదయం 7.00 గంటలకు పోలింగ్ ప్రారంభమై మధ్యాహ్నం 1.00 గంట వరకు ముగుసింది. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి చేపట్టిన ఓట్ల లెక్కింపు రాత్రి వరకు సాగింది.చందూరులో 91.67శాతం, చిట్యాల91.93, గట్టుప్పల్71.78, కనగల్90.33కట్టంగూరు 91.04కేతేపల్లి89.19మర్రిగూడ90.60మునుగోడు91.23న కిరేకల్89.97 నల్లగొండ 90.37,, నాంపల్లి91.16, నార్కెట్ పల్లి 89.12,శాలిగౌరారం 89.73తిప్పర్తి మండలాలలో90.46శాతం పోలింగ్ నమోదు కావడం జరిగింది.



## ప్రశాంతంగా గ్రామపంచాయతీ పోలింగ్



**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని 28 గ్రామ పంచాయతీలకు గురువారం నిర్వహించిన ఎన్నికల పోలింగ్‌లో మండల వ్యాప్తంగా 28 గ్రామపంచాయతీలకు గాను 38038 వేల ఓట్లకు మొత్తం మండల వ్యాప్తంగా 34702 ఓట్లు పోలయ్యాయి.. మండల వ్యాప్తంగా 91.23 శాతం పోలింగ్ నమోదయింది.ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం సొంత గ్రామం ఎల్లగల గూడెంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో గ్రామాల వారిగా విజయం సాధించిన అభ్యర్థులు. మండలంలోని బీరెల్లి గూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ బలపరిచిన దోటి గోవర్ధన్, చలిమెడ గ్రామ సర్పంచ్ గా సిపిఐ అభ్యర్థి బండమీది యాదయ్య, దుబ్బ కాల్వ కాంగ్రెస్ అభ్యర్థి కొండ శ్రీను, గంగోరిగూడెం కాంగ్రెస్ అభ్యర్థి గోపగోని పాపయ్య, గుండ్లూరి గూడెం టిఆర్ఎస్ అభ్యర్థి జంగిలి సునీత సాంబయ్య,ఇప్పర్తి గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ అభ్యర్థి చీమల రాజు, జక్కల వారి గూడెం గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ అభ్యర్థి జక్కల రేవతి మహేష్, జమస్తాన్ పెల్లి గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ అభ్యర్థి అందుగుల నర్సమ్మ, కచలాపురం గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏర్పుల మోహన్ బాబు, కాశవారి గూడెం సర్పంచ్ కాంగ్రెస్ అభ్యర్థి బొల్లం రమేష్, పలివెల గ్రామ సర్పంచ్ టిఆర్ఎస్ అభ్యర్థి గజ్జల ధనలక్ష్మి బాలరాజు, పులిపలుపుల గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఖమ్మంపాటి జ్యోతి వెంకన్న, రాత్తిపల్లి గ్రామ సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థి జిట్టాగోని సైదులు, రావి గూడెం సర్పంచ్ కాంగ్రెస్ అభ్యర్థి వరికుప్పల భువనేశ్వరి విజయ్, సింగారం గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుంభం అండాల్ రవీందర్ రెడ్డి, సోలిపురం గ్రామ సర్పంచ్ టిఆర్ఎస్ అభ్యర్థి నగరికంటి మురళి,ఊకోండి గ్రామ సర్పంచ్ అభ్యర్థి టిఆర్ఎస్ పోలగోని విజయలక్ష్మి సైదులు, ఎలగలగూడెం గ్రామ సర్పంచ్ అభ్యర్థి కాంగ్రెస్ పార్టీ తీర్పారి నాగమణి ఆంజనేయులు, కోతులారం గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ అభ్యర్థి జాల జగన్, ఇప్పటి గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ చీమల రాజు, గూడపూర్ గ్రామ సర్పంచ్ బి ఆర్ ఎస్ అభ్యర్థి నన్నూరి భూపతిరెడ్డి,లు కలకుంట్ల గ్రామ సర్పంచ్ సిపిఐ అభ్యర్థి సింగపంగా లక్ష్మమ్మ, లు రాత్రి 9 గంటల వరకు అభ్యర్థులు గెలుపొందినట్లు అధికారులు తెలిపారు. మిగతా మునుగోడు, చీకటి మామిడి, కొంపెల్లి,చోళ్ళేడు, కొరటికల్, కిష్టపురం, కలువలపల్లి, గ్రామాల కౌంటింగ్ అర్ధరాత్రి వరకు కొనసాగింది.



# క్రీడ

## భారత మ్యాచ్ టికెట్‌తో సూర్య!

వచ్చే ఏడాది జరుగబోయే పురుషుల టీ20 ప్రపంచకప్ టికెట్లు వచ్చేశాయి. నవంబర్ 25న పూర్తి షెడ్యూల్ ప్రకటించిన ఐసిసి.. డిసెంబర్ 11న సాయంత్రం నుంచి టికెట్లు అమ్మకాలను ప్రారంభించింది. అయితే.. కోహోస్ట్ అయిన భారత గడ్డపై వరల్డ్ కప్ తొలి టికెట్లను అనుకున్న సమయం కంటే ముందుగానే విడుదల చేశారు. భారత్, దక్షిణాఫ్రికా రెండో టీ20 మ్యాచ్ టాస్ పూర్తయ్యాక మైదానంలోనే ప్రపంచకప్ టికెట్లతో ఇరుజట్ల కెప్టెన్లు ఫొటోలు దిగారు. పొట్టి ప్రపంచకప్ ఆరంభం రోజే భారత్, యుఎస్ఎతో తలపడనుంది. సో.. ఈ మ్యాచ్ టికెట్‌ను కామెంటేటర్ రవి శాస్త్రి, టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కలిసి విడుదల చేశారు. దక్షిణాఫ్రికా, కెనడా మ్యాచ్ టికెట్‌తో




వీరిద్దరూ కెమెరాకు పోజిచ్చారు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్య మిస్తున్న పొట్టి ప్రపంచకప్ ఫిబ్రవరి 7 టోర్నీ ప్రారంభం కానుంది. ఇరు దేశాల్లోని ఎనిమిది నగారాల్లో ఈ మెగా టోర్నీ మ్యాచ్‌లు జరుగనున్నా యి. టీ20 వరల్డ్‌కప్ టికెట్ల కోసం https://tickets.cricketworld cup.com సైట్‌లోకి వెళ్లాలి. ఈ సైట్ అడ్రస్‌పై క్లిక్ చేస్తే నేరుగా 'బుక్‌మై షో' (Book My Show) ఓపెన్ అవుతుంది. అందులో ఈ బిగ్ ఈవెం ట్ టికెట్లను కొనుక్కోవ చ్చు. రూ.100 నుంచి మ్యాచ్ టికెట్ ధర షురూ కానున్నందున భారీగా అమ్ముడుపోతాయని ఐసిసి భావిస్తోంది. అర్హత సాధించిన 20 జట్లను గ్రూప్‌లుగా విభించింది ఐసిసి. ఒక్కదాంట్లో ఐదు చొప్పున నాలుగు గ్రూప్‌లను చేసింది. ఆతిథ్య దేశమైన టీమిండియా గ్రూప్‌లో పాకిస్థాన్ మాత్రమే పెద్ద జట్టు. కానీ, శ్రీలంక గ్రూప్‌లో ఆస్ట్రేలి యా ఉండడంతో ఆ జట్టుకు కఠిన సవాల్ ఎదురవ్వనుంది. ఇక గ్రూప్ 3లో ఇంగ్లాండ వెస్టిండీస్.. గ్రూప్ 4లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండః వంటి టెస్టు క్రికెట్ ఆడే జట్లు ఉన్నాయి.

## పొట్టి సిరీస్‌లో భారత జట్టు జోరుకు బ్రేక్

### రెండో టీ20లో దక్షిణాఫ్రికాదే విజయం




టీ20 సిరీస్‌ను భారీ విజయంతో ఆరంభించిన భారత జట్టుకు భారీ షాక్. ముల్లన్‌పూర్‌లో క్వింటన్ డికాక్(90) మెరుపులతో భారీ స్కోర్ చేసిన దక్షిణాఫ్రికా బౌలర్ల విజృంభణతో సిరీస్ సమం చేసింది. 214 పరుగుల ఛేదనలో టాపార్డర్ విఫలమవ్వగా తిలక్ వర్మ(62), జితేశ్ శర్మ(27)లు మాత్రమే పోరాడారు. కానీ, లుంగి ఎంగిడి(2–26), బార్ట్‌మన్ (4–24)ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసి టీమిండియాను దెబ్బకొట్టారు. దాంతో.. 51 పరుగుల తేడాతో ప్రొటీస్ జట్టు సిరీస్ సమం చేసింది. పొట్టి సిరీస్‌లో భారత జట్టు జోరుకు బ్రేక్ పడింది. కటక్‌లో ఏకపక్ష పోరులో కంగుతిన్న దక్షిణాఫ్రికా రెండో మ్యాచ్‌లోగొప్పగా పుంజుకొని ఆతిథ్య జట్టుకు షాకిచ్చింది. 214 ఛేదనలో ఓపెనర్ శుభ్‌మన్ గిల్(0) మరోసారి విఫలమవ్వగా.. దంచేస్తున్న అభిషేక్ శర్మ(17)ను యాన్సెన్ పెవిలియన్ పంపి బ్రేకిచ్చాడు. సఫారీ బౌలర్లు వికెట్ల వేటతో ఒత్తిడి పెంచారు. 67కే నాలుగు వికెట్లు పడిన వేళ తిలక్ వర్మ (62), హార్దిక్ పాండ్యా(20)లు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, సిపమ్లా ఓవర్లో పాండ్యా ఔట్ కావడంతో మ్యాచ్‌పై ఆశలు సన్నగిల్లాయి. ఆఖర్లో జితేశ్ శర్మ(27) ధనాధన్ ఆడినా.. ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసిన బార్ట్‌మన్ (4–24) సఫారీలకు భారీ విజయాన్ని అందించాడు.

### డికాక్ అర్ధ శతకంతో

తొలి టీ20లో 74 పరుగులకే కుప్పకూలిన దక్షిణాఫ్రికా రెండో మ్యాచ్‌లో భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ క్వింటన్ డికాక్(90) విధ్వసంక ఆటతో రెండొందలు కొట్టింది. ముల్లనూర్ స్టేడియంలో భారత బౌలర్లను ఉతికేసిన డికాక్ మెరుపు అర్ధ శతకంతో చెలరేగాడు. సిక్సర్ల మోత మోగించిన అతడిని జితేశ్ శర్మ స్టంపౌట్ చేసి బ్రేకిచ్చాడు. కానీ, ఆఖర్లో డొనోవాన్ ఫెరీరా(30 నాటౌట్), డేవిడ్ మిల్లర్(20 నాటౌట్)లు ధనాధన్ ఆడారు. చివరి మూడు ఓవర్లలో ఈ ద్వయం 49 రన్స్ పిండుకోగా నిర్ణీత ఓవర్లలో ప్రొటిస్ టీమ్ 4 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది.

## మహిళా క్రికెటర్ల మ్యాచ్ ఫీజులు పెంచనున్న బిసిసిఐ!

ఇటీవల కాలంలో మహిళల క్రికెట్ అభివృద్ధికి పలు చర్యలు తీసుకుంటున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) మరో కీలక నిర్ణయం తీసుకోనుంది. వన్డే ప్రపంచకప్ ఛాంపియన్‌గా అవతరించిన టీమిండియా క్రికెటర్లకు ప్రోత్సాహకంగా మ్యాచ్ ఫీజులను పెంచనుంది. డిసెంబర్ 22న జరుగనున్న సమావేశంలో మ్యాచ్ ఫీజుల సవరణ అంశం ప్రధానంగా చర్చకు రానుంది. ఈమధ్యే స్వదేశంలో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టు తొలిసారి విశ్వవిజేతగా నిలిచింది. మహిళా క్రికెట్ చరిత్రలో తొలి ఐసిసి ట్రోఫీతో దేశం గర్వపడేలా చేసింది హర్మన్‌కౌర్ బృందం. దాంతో.. దేశవాళీలో మహిళా క్రికెటర్లకు వేతనాలు పెంచాలనే నిర్ణయానికొచ్చింది బిసిసిఐ. ప్రస్తుతం డొమెస్టిక్ మ్యాచ్‌లకు చెల్లిస్తున్న మ్యాచ్ ఫీజుల సవరణపై డిసెంబర్ 22న వర్చువల్‌గా జరిగే సమావేశంలో బిసిసిఐ ప్రతినిధులు చర్చించనున్నారు. ఇదే మీటింగ్‌లో భారత పురుషుల జట్టు ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్ట్ అంశం కూడా తెరపైకి రానుంది. టెస్టులు, టీ20లకు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ గ్రేడ్ మారే అవకాశముంది. ప్రస్తుతం ఏ ప్లస్ విభాగంలో ఉన్న వీరిని ఏకు మారుస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. అంపైర్లు, మ్యాచ్ రిఫరీల జీతాల పెంపుపై కూడా బిసిసిఐ పెద్దలు నిర్ణయం తీసుకోనున్నారు. అయితే.. పురుషులతో పోల్చితే మహిళా క్రికెటర్లకు దేశవాళీ ఫీజులు తక్కువే ఉండే అవకాశముంది.




## అడుగడుగునా అవమానం..



ప్రతి చోటా... ప్రతిసారీ దివ్యాంగులకు అవమానాలు ఎదురుకావడం ఆనవాయితీగా మారింది. మహారాష్ట్రలో చోటు చేసుకున్న పరిణామాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. దేశంలో వికలాంగుల హక్కులపై ప్రభుత్వాలు ఎంత చిన్న చూపు చూస్తున్నాయో, పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారుతున్నదో వివరిస్తున్నాయి. మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం, వికలాంగ ఉద్యోగుల పట్ల పరిపాలన పేరుతో వేధింపులు ఎలా జరుగుతున్నాయో వెల్లడిస్తోంది. మహారాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఏర్పాటైన దివ్యాంగుల సంక్షేమ శాఖ ద్వారా జారీ చేసిన ఉత్తర్వు ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చకు దారి తీంది. ఆ ఉత్తర్వు ప్రకారం, ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న దివ్యాంగ ఉద్యోగులు, అధ్యాపకులు, వైద్యులు, క్లాస్ వన్ అధికారులు, పరిపాలనా సిబ్బంది తప్పనిసరిగా చట్టబద్ధమైన వికలాంగ ధ్రువీకరణ పత్రం (యుడిఐడి) జారీ చేయాలి. ఇప్పటికే యుడిఐడి కార్డు ఉన్నప్పటికీ, మరోసారి వైద్య పరీక్షలు, ధ్రువీకరణలకు హాజరుకావాలి. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, ఇడబ్ల్యుఎస్ వంటి ఇతర రిజర్వేషన్ వర్గాల్లో ఎవరికీ మళ్లీ మళ్లీ తమ గుర్తింపును రుజువు చేయమని అడనప్పుడు వికలాంగులకే ఎందుకు? అనే ప్రశ్న తలెత్తుతున్నది. ఈ ఉత్తర్వుతో ప్రభుత్వ శాఖలు, సంస్థలు, విద్యాలయాలు, కళాశాలల్లో పని చేస్తున్న దివ్యాంగులంతా ఒక మెడికల్ బోర్డు నుంచి మరొక బోర్డుకు.. ఒక పరీక్ష నుంచి ఇంకో పరీక్షకు తిరగాల్సిన పరిస్థితి. వికలాంగుల అభ్యున్నతికి చేయాల్సింది ఎంతో ఉన్నప్పటికీ, చేసిన పనులే మళ్లీమళ్లీ చేయడంలో అర్థం బిజెపి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వానికే అర్థం కావాలి. ఇప్పటికే మహారాష్ట్రలో లక్షలాది యుడిఐడి దరకాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అత్యధిక దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్న రాష్ట్రాల్లో మహారాష్ట్రది రెండో స్థానం. 14 జిల్లాల్లోని ఆసుపత్రులు ఇప్పటివరకు ఒక్క యుడిఐడి కార్డును కూడా జారీ చేయలేదు. పెండింగ్ కేసులు పక్కకుపెట్టి, చెల్లుబాటు అయ్యే సర్టిఫికెట్లు ఉన్న ఉద్యోగులను మళ్లీమళ్లీ పరీక్షించడం ఎంత వరకు సబబు? ఇది పరిపాలనా వైఫల్యాన్ని దాచే ప్రయత్నమేనా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. కేవలం కెఇఎం ఆసుపత్రిలోనే గత మూడు నెలల్లో 848 యుడిఐడి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. బ్యాక్‌లాగ్స్‌ను పరీక్షించకుండా, అదే ఆసుపత్రిలోని వైద్యులు తమ సహచర వికలాంగ ఉద్యోగులను పరీక్షించడంలో సమయం వెచ్చించాల్సి వస్తున్నది. ఇలాంటి విచిత్రమైన పరిస్థితి ఎవరికి ఎదురై ఉండదు. ఇది కేవలం మహారాష్ట్రలో, అక్కడి ప్రభుత్వంలోని వికలాంగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పరిస్థితి మాత్రమేకాదు.. యావత్ దేశంలో నెలకొన్న వారి దుస్థితి దర్పణం.

*వికలాంగులను పరీక్షించే మెడికల్ బోర్డుల్లో, వికలాంగ డాక్టర్ ఉండాల్సిందేనని ఓం రాథోడ్ వర్సెస్ డిజిహెచ్ఎస్ కేసులో సుప్రీం కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. అయితే మహారాష్ట్రలోని ఈ రీ-వెరిఫికేషన్ బోర్డుల్లో ఒక్క వికలాంగ డాక్టర్ కూడా లేరు. ఇది నేరుగా సుప్రీం కోర్టు ఆదేశాలను నిర్లక్ష్యం చేయడం కాదా? అని విద్యాంగులు ప్రశ్నిస్తున్నారు. దేశ వ్యాప్తంగా ఇంకా ఎన్ని రాష్ట్రాల్లో ఇలాంటి పరిస్థితి ఉందనేది కోర్టులు జోక్యం చేసుకునే వరకూ గోప్యంగానే ఉంటుందేమో!*

### చట్టం ఉన్నా శిక్షణ లేదు..

*ఆర్‌పిడబ్ల్యుడి చట్టం 2016 ప్రకారం, వైద్యులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, అధికారులు తప్పనిసరిగా వికలాంగ హక్కులపై శిక్షణ పొందాలి. కానీ, మహారాష్ట్రతోసహా చాలా రాష్ట్రాల్లో ఈ చట్టం అమలవుతున్న దాఖలాలు లేవు. ఈ పరిస్థితుల్లో వికలాంగ సంక్షేమ బోర్డులపై నమ్మకం ఎలా ఉంటుంది?. మరో విషయం ఏమిటంటే, దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ వికలాంగుల హక్కుల రక్షణకు 'స్టేట్ కమిషనర్ ఫర్ పర్సన్స్ విత్ డిజెబిలిటీస్' ఉంటాడు. చాలా రాష్ట్రాల్లో ఈ పోస్టు ఖాళీగా ఉంటుంది. ఒకవేళ ఉన్నా, నామమాత్రపు పోస్టుగానే మిగిలి పోతున్నది.*

మహారాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జూన్ మాసంలోనే అన్ని ప్రభుత్వ శాఖల నుంచి యుడిఐడి వివరాలు తీసుకుంది. అధికారులు పూర్తిగా సహకరించారు. ఆ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు. కానీ, ఇప్పుడు మళ్లీ అవే పరీక్షలు... అవే ఫారాలు.. అవే వైకల్యం లెక్కించే శాతాల అంకెలు.. ప్రభుత్వానికి దాసోహం అనే రీతిలో దివ్యాంగులపై ఒత్తిడి తేవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయా? అనే సందేహం తలెత్తుతోంది. కొత్త దరఖాస్తు ఫారాల్లో, గతంలో వికలాంగ శాతం ఎంత? ఇప్పుడు ఎంత ఉంది? అనే వివరాలు అడుగుతున్నారు. వాస్తవం ఏమిటంటే, వేర్వేరు వైద్యులు ఇచ్చిన శాతాలన్నీ ఖచ్చితంగా గీతగీసినట్టు ఒకే రీతిలో ఉండవు. ఎంతోకొంత మార్పు ఉంటుంది. అలా తేడాలు వస్తే, వైద్యులపై చర్యలు ఉంటాయా? లేక వికలాంగ ఉద్యోగులనే లక్ష్యంగా చేసుకుంటారా? అనే అనుమానం కూడా తలెత్తుతున్నది.

## వృత్తి ధర్మానికి 'రైట్'.. రైట్



నిబద్ధత ఉండాలేగానీ, వృత్తి ధర్మానికి వయసుతో సంబంధం లేదని నిరూపించిన మహనీయుడు ఫ్రాంక్ లాయిడ్ రైట్. అమెరికాకు చెందిన ఈ విద్యావేత్త, ఆర్కిటెక్ట్, జీవితకాలంలో ఎన్నో అద్భుత నిర్మాణాల్లో కీలక భూమిక పోషించాడు. 80 సంవత్సరాల వయసు దాటిన తర్వాత కూడా తన వృత్తిపై ఆయనకు ఉన్న ఆసక్తి ఏమాత్రం తగ్గలేదు. ఆ లేటు వయసులోనే ఆయన 'గుగెన్హేమ్ మ్యూజియం' అనే ప్రపంచ ప్రఖ్యాత కళా నిర్మాణాన్ని రూపొందించాడు. ఆయన 91 ఏళ్ల వయస్సులో, చివరి శ్వాస విడిచే వరకూ కూడా డిజైన్‌లు స్కెచ్ చేస్తూనే ఉండేవాడు. 'నేను నా జీవితమంతా నేర్చుకుంటూనే ఉన్నాను. కానీ, ఇంకా నేర్చుకోవాల్సింది ఉంది' అనే దృక్పథం ఆయనను నిరంతర సృష్టికర్తగా నిలబెట్టింది. వయస్సు అతనికి గోడ కాదు, విండో అని రైట్ తన చేష్టలతో రుజువు చేశాడు.

# గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ విజయదుందుభి


ప్రజాపక్షం : గ్రామ పంచాయితీ ఎన్నికల్లో తొలి విడత జరిగిన ఎన్నికల్లో పలుచోట్ల సిపిఐ అభ్యర్థులు సర్పంచ్‌లుగా, ఉపసర్పంచ్‌లుగా, వార్డు మెంబర్లుగా విజయం సాధించారు.

### ఖమ్మం జిల్లాలో...

ఖమ్మం జిల్లా చింతకాని మండలం నేరడ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ పక్షాన పోటీ చేసిన దూసరి నేతాజీ రికార్డు మెజార్టీతో విజయం సాధించారు. 425 ఓట్ల మెజార్టీతో నేరడ సర్పంచ్‌గా గెలుపొందారు. నాగిలిగొండ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థి ఏపూరి పద్మ విజయం సాధించారు. చింతకాని మండలం బస్వాపురం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆవుల నర్సింహా రావు భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఖమ్మం జిల్లాలో వి.వెంకటాయపాలెం పంచాయతీలో సిపిఐ విజయం దిశగా సాగుతుంది. కొణిజర్ల మండలం పెద్దమునగాలలో సైతం సిపిఐ ఒంటరిగా బరిలో నిలిచి మెజార్టీ వార్డులను గెలుచుకోగా సర్పంచ్ ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..

మణుగూరు మండల పరిధిలోని 14 పంచాయితీలలో సాబాయిగూడెం పంచాయతీలో సిపిఐ ఘన విజయం సాధించింది. సర్పంచ్‌గా చిడెం ఉషా రాణి సమీప బిఆర్ఎస్ అభ్యర్థిపై 140 ఓట్ల మెజారిటిటీతో ఘన విజయం సాధించింది. పంచాయితీలోని ఎనిమిది వార్డుల లో ఆరు వార్డులను గెలవగా, ఐదవ వార్డులు ఇద్దరకు సమానంగా 52 ఓట్లు రాగా డ్రాతీయగా బిఆర్ఎస్ అభ్యర్థికి లక్కి తగలటంతో ఒక వార్డును బిఆర్ఎస్ గెలుచుకుంది. సాంబాయిగూడెం పంచాయతీలో సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్‌తో కలిసి 7 వార్డులు సిపిఐ, ఒక వార్డు సిపిఐఎంఎల్ పోటీ చేయగా సిపిఐ ఐదు వార్డులు, సిపిఐ ఎంఎల్ ఒక వార్డును గెలుసుకుంది. ఉప సర్పంచ్ అవకాశం కూడ సిపిఐకి దక్కటంతో పులిగెల రమేష్ యాదవ్ ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్నారు. అలాగే దుమ్ముగూడెం గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ విజయ ఖేతం ఎగురవేసింది. మండలంలో మొత్తం నాలుగు గ్రామ పంచాయతీల్లో సిపిఐ పోటీలో నిలిచి కైవసం చేసుకుంది. అదే విధంగా నర్సాపురం ఉపసర్పంచ్‌గా రావులపల్లి రవికుమార్, కొత్త దంతెనం ఉపసర్పంచ్‌గా బొమ్మెడి అనితా దేవి, పెద్ద ఆర్లగూడెం ఉప సర్పంచ్‌గా తాటి నాగేశ్వర రావు, బి కొత్తగూడెం ఉప సర్పంచ్ కాటిబోయిన లక్ష్మ య్య ఎన్నికయ్యారు. పెద్ద ఆర్లగూడెంలో 10 వార్డులు ఉండగా సిపిఐకి మూడు ఏకగ్రీవం కాగా మరో మూడు స్థానాల్లో గెలుపొందింది. నర్సాపురంలో పది వార్డులకు గానూ ఆరు సిపిఐ ఖాతాలో చేరాయి. బి.కొత్తగూడెంలో 8 వార్డులకు గానూ ఐదు వార్డుల్లో తూరుబాకలో పది వార్డులకు గానూ సిపిఐ మూడు వార్డులు కైవసం చేసుకుంది. విజయం సాధించిన అభ్యర్థులను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, భద్రాచలం డివిజన్ కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ అభినందించారు.



నల్లగొండ జిల్లాలో..

### హనుమకొండ జిల్లాలో..

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని గోపాల్‌పురం మేజర్ గ్రామ పంచాయతీకి జరిగిన ఎన్నికలలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి సతీమణి కర్రె లక్ష్మి సర్పంచ్‌గా ఘన విజయం సాధించారు. మొత్తం పోలైన ఓట్లలో కర్రె బిక్షపతి లక్ష్మి కి 1023 ఓట్లు రాగా సమీప ప్రత్యర్థికి 752 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో కర్రె లక్ష్మి బిక్షపతి 271 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఈసందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా సహాయ కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె బిక్షపతిలని అభినందించారు. ఈసందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో గోపాల్ పూర్ గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని గోపాల్‌పూర్ సర్పంచ్ కర్రె లక్ష్మి

### నాగర్ కర్నూల్ జిల్లాలో...

నాగర్ కర్నూల్ జిల్లా తాడూరు మండలం గుంతకోడూరు గ్రామ సర్పంచ్‌గా బిఆర్ఎస్ పార్టీ బలపర్చిన టి.రాజుపై 30 ఓట్ల ఆదిక్యంతో సిపిఐ బలపరిచిన అభ్యర్థి వార్ల వెంకటయ్య విజయం సాధించారు. సర్పంచ్‌తో పాటు ఐదుగురు వార్డు సభ్యులు గెలుపొందారు

### మంచిర్యాల జిల్లా

లక్షెట్టిపేట మండలం దౌడపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థులు ప్రభంజనం సృష్టించి ఘన విజయం సాధించారు. దౌడపల్లిలో మొత్తం 10 వార్డులు ఉండగా 7 వార్డుల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థులు పోటీ చేసి ఏడుగురికి ఏడుగురు విజయం సాధించారు. 1వ వార్డు సభ్యులుగా సంతపూరీ మధుకర్, 2వ వార్డులో మూగల దేవేంద్ర కిరణ్, 3వ వార్డులో కంది సత్తన్న, 4వ వార్డులో అయిత శాంతయ్య (రాజుదాసు), 5వ వార్డులో దుర్గం దేవదాసు, 6వ వార్డులో ఏమురి శ్రీదేవి, 9వ వార్డులో సంతపూరి విజయలక్ష్మి ఏలీయా గెలుపొందారు. విజయం సాధించిన వారిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మేకల దాసు అభినందించారు.



మంచిర్యాల జిల్లాలో వార్డు సభ్యులుగా విజయం సాధించిన అభ్యర్థులు

### యాదాద్రి భువనగిరి జిల్లా

యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డి గూడెం, మర్రి గూడెం సర్పంచులుగా కొల్లూరు రాజయ్య, బోదాస్ స్వప్నజగన్ గెలుపొందారు. మెజారిటీతో విజయం సాధించారు.

### నల్లగొండ జిల్లాలో

జరిగిన తొలి విడుత గ్రామ పంచాయతీ ఎన్నికలో సిపిఐ మూడు గ్రామ సర్పంచ్‌లను కైవసం చేసుకుంది. మునుగోడు నియోజకవర్గంలో చండూరు మండలంలో కస్తాల పంచాయతీలో లేదన్న సత్యనారాయణ, మునుగోడు మండలం చల్మెడలో కాంగ్రెస్ అభ్యర్థి కొంక శంకర్‌పై సిపిఐ అభ్యర్థి బండమీది యాదయ్య 84 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. నార్కట్ పల్లి మండలం పల్లెపహాడ్‌లో సంగిశెట్టి రాణమ్మశ్రీనివాస్ 185 ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థిపై గెలుపొందారు. ఏడుగురు వార్డు సభ్యులు కూడా విజయం సాధించారు. అదేవిదంగా ఆయా గ్రామాలలో పలువురు వార్డు సభ్యులుగా గెలుపొందారు. నార్కట్ పల్లి మండలం పల్లెపహాడ్‌లో గ్రామ సర్పంచ్‌గా సిపిఐ అభ్యర్థి విజయంతో గ్రామంలో పార్టీశ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్, మండల కార్యదర్శి పెండ్యాల శంకరయ్య, మండల సహాయ కార్యదర్శి వనం వాసు, గ్రామ శాఖ కార్యదర్శి ఆలకుంట నర్సింహా పాల్గొన్నారు. అలాగే చండూరు మండలం కస్తాల గ్రామ సర్పంచ్‌గా సిపిఐ బలపర్చిన అభ్యర్థి లేదన్న సత్యనారాయణ 72 ఓట్ల అధిక్యంతో విజయం సాధించారు. గ్రామ పంచాయితీలో మొత్తం 10 వార్డులు ఉండగా అందులో 1 వార్డు సిపిఐ గెలిచింది. కస్తాల గ్రామంలో లేదన్న సత్యనారాయణ గెలుపొందడంతో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య, సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ అభినందనలు తెలిపారు.

### ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో విజయం సాధించిన అభ్యర్థులు వీరే...



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## అభివృద్ధి పరిచేందుకు అవకాశమివ్వండి
### స్వతంత్ర అభ్యర్థి మంగలి స్రవంతి శివరాజ్

**ప్రజాపక్షం/బంట్వారం :** గ్రామాన్ని అభివృద్ధి పరిచేందుకు అవకాశం ఇవ్వాలంటూ బస్వాపూర్ గ్రామ స్వతంత్ర అభ్యర్థి మంగలి స్రవంతి శివరాజ్ ఇంటింటి ప్రచారంలో భాగంగా వేగం పెంచారు. మీకు సేవ చేయడానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, గ్రామ పాలకుడిగా కాదు మీకు సేవకుడిగా పని చేస్తాను ఒక్క అవకాశం ఇవ్వండి అన్నారు. గ్రామాభివృద్ధి పాటుకై ముందుకు నడుస్తానని, గ్రామంలో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయడం జరుగుతుందన్నారు. బ్యాట్ గుర్తుకు మీ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వేడుకున్నారు.





## 70 వేల ఓట్లు ఉన్న నాగారంను రెండు డివిజన్లుగా చేయాలి

**ప్రజాపక్షం/నాగారం:** నూతనంగా జిహెచ్ఎంసి వార్డుల విభజనలో నాగారం మున్సిపాలిటీని విలీనంచేసి ఒకే డివిజన్‌గా ఏర్పాటు చేయడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నాగారం మున్సిపాలిటీలో గత కొన్ని నెలల క్రితం చుట్టు పక్కల గ్రామాలను విలీనం చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన జిహెచ్ఎంసి డివిజన్‌లో నాగారంను ఒకే డివిజన్‌కు 70 వేల ఓట్లతో కేటాయించడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నాగారం మున్సిపాలిటీలో 45 వేల ఓట్లు ఉండగా, విలీనం చేసిన గ్రామాలలో 20 ఓట్లను కలిపి మొత్తం 70వేల ఓట్లతో డివిజన్‌ను ఏర్పాటు చేశారు. నాగారం మున్సిపాలిటీలో జిహెచ్ఎంసి వార్డుల పునర్విభజనపై బిజెపి ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ డివిజన్‌కు 70 ఓట్లతో ఒక కార్పొరేటర్ ఏర్పాటు చేస్తే రెవెన్యూపరంగా విస్తీర్ణంలో పెద్దదిగా ఉంటే ఒకే వ్యక్తి పర్యటించేందుకు సాధ్యంకాదని రెండు డివిజన్లుగా విభజించాలని సూచించారు. పాతబస్తీలో ఒక డివిజన్‌కు 20 వేలు, శివారు మున్సిపాలిటీల్లో 50వేల నుండి 75 వేల ఓట్లతో డివిజన్‌గా ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసమని అన్నారు.

**నాగారం జిహెచ్ఎంసి కార్యాలయంలో వినతి....**

నాగారం డివిజన్‌ను రెండుగా చేయాలని శివారు గ్రామ పంచాయతీ నాయకులు నాగారం జిహెచ్ఎంసి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. జిహెచ్ఎంసిలో విలీనం చేస్తూ ఏర్పాటు చేసిన 5వ వార్డును రాంపల్లిని కేంద్రంగా చేస్తూ మరో డివిజన్‌ను చేయాలని మాజీ ఎంపిటిసి, బిజెపి రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు కోరుతున్నారు.

## సర్పంచ్‌గా మీ ముందుకు వస్తున్నా.. ఆశీర్వదించండి..
### అక్నాపూర్ సర్పంచ్ అభ్యర్థి కౌకుంట్ల అరుణ బంధయ్య గౌడ్



**ప్రజాపక్షం/నవాబుపేట్:** నవాబుపేట్ మండల మాజీ వైస్ ఎంపిపి కౌకుంట్ల బంధయ్య గౌడ్ సతీమణి కౌకుంట్ల అరుణ బంధయ్య గౌడ్ గ్రామ సర్పంచ్‌గా పోటీ చేస్తున్నారు. గురువారం సుమారు రెండువందల మంది ఓటరు మహాశయులు, గ్రామ పెద్దలతో కలిసి ర్యాలీగా బయలు దేరి గడప గడపకు తిరుగుతూ బ్యాట్ గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నవాబుపేట్ మాజీ వైస్ ఎంపిపి కౌకుంట్ల బంధయ్య గౌడ్ 26 సంవత్సరాల వయస్సులోనే రాజకీయ రంగప్రవేశం చేయించి యువ నాయకుడిగా అప్పుడే రాజకీయ పరిచయంచేసి నా ఊరికి ఏదైనా చేయగలిగిన



సమర్థుడుగా గ్రామానికి ఎన్నో అభివృద్ధి పనులు చేస్తూ తన కుటుంబం కంటే ఎక్కు వగా గ్రామ ప్రజలకోసం ఆలోచించి పనిచేస్తానని అన్నారు. నారేగూడ, పూలపల్లి, సిద్దులూర్ రోడ్లకోసం కష్ట పడిన వ్యక్తి అని గుర్తు చేశారు. పూలపల్లి గ్రామానికి నడక దారి కూడ సరిగ్గా లేనికాలంలో సొంత డబ్బులతో పైపులు వేయించి కొంతవరకు ఊరికి, రైతులకు లింక్ రోడ్డు ఉపయోగపడే విధంగా చేశామని అన్నారు. సర్పంచ్‌గా గెలిపించిన వెంటనే ప్రభుత్వం సహకారంతో బిటి రోడ్డు చేయిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ అభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేస్తానని మాటిచ్చారు. ఎన్నికల హామీలు ఇవ్వడం కాకుండా, గ్రామస్థాయిలో నిజమైన మార్పును తీసుకురావడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికోసం నిరంతరం కృషి చేస్తానని, ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టకుండా పారదర్శకంగా పనులను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి సంబంధించి ప్రతి నిర్ణయంలోనూ గ్రామ ప్రజల భాగస్వామ్యాన్ని తీసుకుంటానని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు తమ ఓటు హక్కు వినియోగించుకుని, తమకు కేటాయించిన బ్యాట్ గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

# హైదరాబాద్‌లో భారీ దోపిడీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ మరోసారి దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. మలక్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీలో ఓ ఇంట్లో భారీ చోరీ కలకలం రేపుతోంది. అర్ధరాత్రి జరిగిన ఈ చోరీలో రూ.50లక్షల నగదు, 30 తులాల బంగారంతో పాటు 40 తులాల వెండిని కూడా దొంగలు అపహరించారు. అయితే, చోరీకి పాల్పడింది నేపాలీ ముఠానే అని పోలీసులకు ఇంటి యజమాని ఫిర్యాదు చేశారు.

ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దోపిడీ దొంగల కోసం బృందాలుగా విడిపోయి తీవ్రంగా గాలిస్తున్నారు. 20 సంవత్సరాలు గా అక్కడే నివసిస్తున్న వెంకట రమణ విదేశాలకు వెళ్లి నిన్న సాయంత్రం ఇంటికి రాగానే షాక్‌కు గురయ్యారు. ఇంటి వెనుక గోడ చేప గుమ్మం పగలగొట్టడంతో పాటు అల్మిరా బ్రేక్ చేసి రూ.45 లక్షల నగదు, 15 తులాల బంగారం, బంగారు నాణేలు, గాజులు, అలాగే 4 కిలోల వెండి దోపిడీకి గురైనట్టు ఆయన ఫిర్యాదులో తెలిపారు. మొత్తం దోచుకున్న ఆస్తి విలువ రూ.50 లక్షలు. సంఘటనకు సంబంధించి, అకస్మాత్తుగా ఉద్యోగం వదిలి వెళ్లిపోయిన అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ అర్జున్‌పై అనుమానం వ్యక్తం చేశారు. మలక్‌పేట్ పోలీస్‌లు కేసు నమోదు చేసి, సిసిటివి ఫుటేజీలు పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## పారాత్రోబాల్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు రజిత పతకం
### భారతదేశం జట్టు తరపున కెప్టెన్‌గా మేడ్చల్ జిల్లా గిరిజన బిడ్డ దీరావత్ మహేష్




**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శ్రీలంకలో నిర్వహించిన పారాత్రోబాల్ చాంపియన్ షిప్ పోటీల్లో భారతదేశానికి రజిత పథకం వరించింది. మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మున్సిపాలిటి, లింగాపూర్‌తండాకు చెందిన గిరిజన బిడ్డ దీరావత్ మహేష్ భారతదేశానికి కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహించగా పారాత్రోబాల్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుని రజిత పథకం సాధించారు. ఈ నెల 6 నుంచి 9 వరకు శ్రీలంకలో జరిగిన పారాత్రోబాల్ మొదటి సౌత్ ఎషియా చాంపియన్ షిప్ పోటీలకు భారతదేశం, బంగ్లాదేశ్, నేపాల్, ఇండోనేషియా, పాకిస్తాన్ దేశాల జట్లు తలపడ్డాయి. మొదటి స్థానంలో శ్రీలంక, ద్వితీయ స్థానంలో భాతరదేశం, మూడవ స్థానంలో బంగ్లాదేశ్ నిలిచాయి. ఈ పోటీలను రత్నపూర్ గవర్నర్ ప్రారంబించగా వరల్డ్ త్రోబాల్ ఫెడరేషన్ ప్రసిడెంట్ నీలిమరావత్ విజేతలకు పథకాలను అందించారు. ఈ సందర్భంగా భారతదేశానికి కెప్టెన్‌గా వ్యవహరించిన దీరావత్ మహేష్ మాట్లాడుతూ భారతదేశం జట్టు తరపున కెప్టెన్‌గా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ పోటీలకు వెళ్లడానికి మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ రాదికగుప్త, స్పోర్ట్స్ ఆఫీసర్‌లు సహాకారం అందించారని వారికి ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు.

## రెండవ, మూడవ విడత ఎన్నికలకు ర్యాండమైజేషన్
### కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్:** రెండవ, మూడవ విడుత ఎన్నికలకు జిల్లా కలెక్టర్, అబ్జర్వర్ ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ సిబ్బందిని జిల్లా ఎన్నికల నిర్వహణ అధికారి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, జనరల్ అబ్జర్వర్ షేక్ యాస్మిన్ బాష సమక్షంలో నిర్వహించారు. ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. రెండవ విడుత 7మండలాలకు సంబంధించి 175గ్రామ పంచాయతీలలో 16గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కాగా మిగతా 159 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించబడతాయిని, వార్డులు 1520లకు గాను 122 వార్డులు ఏకగ్రీవం అయ్యాయని తెలిపారు. 1398 వార్డులకు ఎన్నికలు నిర్వహించబడుతాయని తెలిపారు.

ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల, వార్డుల స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడ్ అధికారులు 1701, ఎపిఒ 2127, టూ మెంబర్ టీం 1072, త్రి మెంబర్ టీం 298, ఫోర్ మెంబర్ టీం 28లను మొత్తం 1398 సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు.



## డివిజన్‌ల పునర్విభజనలో మార్పుకు డిప్యూటీ కమిషనర్‌కు సిపిఐ ఆధ్వర్యంలో వినతి

**కుత్బుల్లాపూర్/ప్రజాపక్షం :** డివిజన్‌ల పునర్విభజనలో మార్పులు చేయాలని గురువారం సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ ఆధ్వర్యంలో గాజులరామారం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమా మహేష్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి డివిజన్ విభజన గందరగోళంగా ఉందని, ఒకే బస్తీలోని కొన్ని గల్లీలు ఒక డివిజన్‌కి మరికొన్ని గల్లీలు ఇతర డివిజన్లకు కేటాయించారన్నారు. ఒకే ఇంటి నెంబర్‌కు వచ్చే క్రమ సంఖ్యలు కూడా ఒక్కొక్క డివిజన్‌కి కేటాయించారని, చిరునామాలోని పిన్ కోడ్ ఒక్కటే ఉన్నప్పటికి ఇతర పిన్‌కోడ్‌లు ఉన్న డివిజన్‌లకు కేటాయించారని తెలిపారు. దీనివల్ల ప్రజలకు గందగోళ పరిస్థితి ఏర్పడుతుందని, పునర్విభజన సందర్భంగా జరిగే లోటుపాట్లను సరిదిద్ది ఒకే బస్తీలో ఉన్నటువంటి అన్ని గల్లీలను ఒకే డివిజన్‌లో కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ అంశంపైన జిహెచ్ఎంసి ప్రధాన కమిషనర్‌ని కూడా కలిసి అభిప్రాయాలను చెప్పి గతంలో జగద్గిరిగుట్టలో ఉన్నటువంటి మఖ్దుమ్‌నగర్‌లోని అన్ని బస్తీలను కలిసి ఉండేలా చూసి డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతామని అన్నారు. గాజులరామారం డివిజన్‌కి దూరంగా ఉన్న మిథిలా నగర్‌ను తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, జగద్గిరిగుట్ట శాఖ కార్యదర్శి ఎం.సహదేవరెడ్డి, సీనియర్ నాయకులు సుంకిరెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## నిందితులకు జీవిత ఖైదు, 30 వేల జరిమానా
### ఎస్ఐ జి.పుండ్లిక్

**ప్రజాపక్షం/నవాబుపేట్:** 2014లో జరిగిన ఎస్సి ఎస్టీ, హత్య కేసుకు సంబంధించి ఇద్దరు వ్యక్తులకు జీవిత ఖైదు శిక్ష 30వేల జరిమానా విధించారని నవాబుపేట్ ఎస్సై జి. పుండ్లిక్ తెలిపారు. ఎస్సై పుండ్లిక్ తెలిపిన వివరాల ప్రకారం... నవాబ్ పేట్ మండలం నారేగూడ గ్రామానికి చెందిన గంగ్యాడ ప్రభాకర్ అనే వ్యక్తిని పాతకక్షలు మనసులో పెట్టుకొని అదే గ్రామానికి చెందిన కొత్తపల్లి లక్ష్మి, కొత్తపల్లి సత్యనారాయణ అనే ఇద్దరు వ్యక్తులు బండ రాళ్లతో కొట్టడంతో ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘట నపై పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేశారు. ఎస్సి, ఎస్టీ, హత్య నేరం రుజువు కావడంతో ఈ ఇద్దరు నిందితులైన కొత్తపల్లి లక్ష్మి, కొత్తపల్లి సత్యనారాయణలకు జీవిత ఖైదు, 30వేల జరిమాన విధిస్తూ రంగారెడ్డి ప్రిన్సిపల్ సెషన్స్ న్యాయాధికారి భవాని గురువారం తీర్పు చెప్పారు. వీరిని చంచల్‌గూడ, చర్లపల్లి జైలుకు తరలించారు. నారేగూడ హత్య కేసులో పోలీసులు దర్యాప్తులోనూ, సాక్ష్యాలు సేకరించడంలోనూ, సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నింధితులపై శిక్షపడేలా కృషిచేసిన పోలీసు అధికారులను వికారాబాద్ ఎస్‌పి అభినందించారు.

## రోడ్డెక్కిన మహాత్మా జ్యోతిరావు ఫూలే గురుకుల విద్యార్థులు

* వసతులు సరిగా లేవంటూ ఆందోళన
* పురుగుల అన్నం, కలుషిత నీళ్లు, మెనూలేని భోజనం పెడుతున్నారని నిరసన
* గురుకుల పాఠశాలను సందర్శించిన బిసి సంక్షేమాధికారి ఝాన్సీరాణి, జిల్లా పౌరశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి





**ప్రజాపక్షం/శామీర్‌పేట:** గురుకుల పాఠశాలలో వసతులు సరిగా లేవంటు విద్యార్థులు రోడ్డెక్కి శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలేకు చెందిన హైద్రాబాద్, కుత్బుల్లాపూర్, శామీర్‌పేట గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు తమకు ప్రభుత్వం పంపిణి చేస్తున్న మెనూ ప్రకారం భోజనం ఇవ్వడం లేదని, కలుషిత నీటిని తాగుతు రోగాల బారిన పడుతున్నామని, కాస్మోటిక్స్ చార్జీలు కూడ ఇవ్వడం లేదంటు విద్యార్థులు ఆందళోన వ్యక్తం చేస్తు సుమారుగా 100మంది విద్యార్థులు శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు సుమారు రెండు కిలోమీటర్లు నడుచుకుంటు వెళ్లి ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసుల ద్వార సమాచారం అందుకున్న బిసి సంక్షేమాధికారి ఝాన్సీరాణి, జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహాశీల్దార్ ఆర్ఐ రాఘవ, ఎస్ఐ సోమిరెడ్డిలు గురుకుల పాఠశాలను సందర్శించారు. గురుకుల పాఠశాలలోని వంట గదిని, మూత్రశాలలను, నీటి సంపులను, డైనింగ్ హాల్‌ను, పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశా ల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో అధికారులు తీవ్ర అసహనానికి గురయ్యారు. పాఠశాల ప్రిన్సిపల్‌లో మాట్లాడి ఇలాగేనా పాఠశాలను నడిపేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలను సందర్శించిన అధికారులకు విద్యార్థులు తమ గోడును వెల్లబోసుకున్నారు. మెను ప్రకారం భోజనం ఇవ్వడం లేదని ఉపాధ్యాయులు తమపై చేయి చేసుకుంటున్నారని ఆరోపించారు. జ్వరాల బారిన పడిన వారికి సరైన చికిత్స అందించడం లేదని వాపోయా రు. కప్పలు, బల్లులు పడిన కలుషిత నీటిని తాగుతున్నామని చెప్పారు. పాఠశాలను సందర్శించిన సంబంధిత అధికారులు నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు పాఠశాల ఆవరణలో బైఠాయించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ఎన్నికలు విజయవంతం చేయాలి
### నర్సింగరావు

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మేడ్చల్ జిల్లా మున్నూరుకాపుల ఎన్నికలను విజయవంతం చేయాలని శామీర్‌పేట మండల మున్నూరు కాపుల సంఘం అధ్యక్షుడు చాట్లపల్లి నర్సింగరావు(మలక్‌పేట) కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ నేడు (శుక్రవారం) శామీర్‌పేట మండలం అలియాబాద్ ప్రధాన చౌరస్తాలోని శుభం గార్డెన్‌లో జిల్లా మున్నూరుకాపు ఎన్నికలు ఉదయం 9 గంటలకు నిర్వహిస్తారని చెప్పారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు మామిండ్ల శ్రీనివాస్‌పటేల్ ఆధ్వర్యంలో జిల్లా మున్నూరుకాపుల నూతన కమిటి అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించబడుతాయని చెప్పారు. మండలంలోని కుల బంధువులు సకాలంలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మధ్యాహ్నం భోజన సదుపాయం ఉంటుందని చెప్పారు.

# భూ బకాసురుల చెరలో 'భూదేవీ హిల్స్'

* నోటరీ పత్రాలతో ప్లాట్ల క్రయ విక్రయాలు
* అనుమతుల్లేకుండా బహుళ అంతస్థుల భవంతులు
* అటువైపు కన్నెత్తి చూడని జిహెచ్ఎంసి విభాగం

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ప్రైవేటు స్థలంగా చూపుతూనే నోటరీ పత్రాలతో ఏకంగా ప్రభుత్వ స్థలాన్ని మింగేస్తున్న ఓ భూ దేవీ హిల్స్ భూ బకాసురుని బడా కహానీ మరెక్కడో కాదు మహానగరంలోని జగద్గిరిగుట్ట ప్రాంతంలో చోటుచేసుకుంది. అక్రమాలకు పుట్టగా భూదేవీ హిల్స్ గుట్ట పేరు గాంచింది. పేరుకు మాత్రమే ప్రైవేటు స్థలం, అన్నీ నోటరీ పత్రాల ప్లాట్లే. అన్ని విధాలుగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ యథేశ్చగా నోటరీలపై ప్లాట్లను క్రయ విక్రయాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాడు ఓ ప్రబుద్ధుడు. ఈ తతంగం మరెక్కడో మారుమూల గ్రామంలో అనుకుంటే పప్పులో కాలు వేసినట్లే. ఈ తతంగం నగర శివారు ప్రాంతంలోని మేడ్చల్ జిల్లా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట డివిజన్, భూదేవీ హిల్స్‌లో చోటుచేసుకుంది. భూదేవీ హిల్స్ బస్తీ పూర్తిగా అక్రమంగా వెలసింది. పేరుకు మాత్రమే ప్రైవేటు స్థలమంటూ చెప్పుకుని నోటరీలపై ఎనభై, వంద, రెండు వందల గజాల చొప్పున ఓ ప్రబుద్ధుడు అమాయకులకు విక్రయిస్తూ ఏకంగా కోట్ల రూపాయలను కొల్లగొడుతున్నారు. గతంలో బాలానగర్ మండల పరిధిలోకి వచ్చే ఈ భూదేవీ హిల్స్ ప్రస్తుతం కూకట్‌పల్లి మండలానికి వస్తుంది. భూ దేవీ హిల్స్ బస్తీ జగద్గిరిగుట్ట డివిజన్‌కి ఆనుకుని ఉంటుంది. మండలం మాత్రం గతంలో బాలానగర్ మండలానికి వస్తుందంటూ బుకాయిస్తూ ఏకంగా పరికి చెరువు ఎఫ్‌టిఎల్ స్థలంలో సైతం డంపింగ్ చేసి ప్లాట్లుగా మరల్చి మింగేస్తున్నాడు భూ బకాసురు డు. ఇటీవల హైడ్రా అధికారులు పరికి చెరువు ఎఫ్‌టిఎల్‌లో నిర్మించిన కట్టడాలను జెసిబితో కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులు సైతం తరుచూ కూల్చివేతలను చేస్తూనే ఉండడం విశేషం. గాజులరామారం సర్కిల్ అధికారులు మాత్రం బస్తీ అభివృద్ధికి అన్ని రకాలుగా సహకారం అందిస్తూ ప్రభుత్వ నిధులను వెచ్చిస్తూ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేయడం గమనార్హం. రెవెన్యూ, హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపడితే మున్సిపల్ సర్కిల్ అధికారులు మాత్రం అభివృద్ధి పనులను చేపట్టడం పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు ఏ మండలానికి భూ దేవీ హిల్స్ బస్తీ వస్తుందో తెలియదు. కానీ గాజులరామారం సర్కిల్ అధికారులు మాత్రం అభివృద్ధి పనులను చేపట్టడం శోచనీయంగా ఉంది. అసలు భూ దేవీ హిల్స్ బస్తీ నుండి ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయం లేకున్నా అధికారులు అభివృద్ధి పనుల ను చేపడుతుండడం వెనుక ఆంతర్యమేమిటని పలువురు నిలదీస్తున్నారు. అభివృద్ధికి నోచుకోని బస్తీలు, కాలనీలు ఎన్నో ఉన్నా సర్కిల్ అధికారులు మాత్రం భూదేవీ హిల్స్ పై ఇంతగా మక్కువ చూపడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నా యి. ఇదిలా ఉండగా భూదేవీ హిల్స్ బస్తీలో కొద్దిరోజుల నుండి ఇంటి పన్నులను విధిస్తున్నట్లు సమాచారం. ఎన్నో ఏళ్లుగా ఉన్న బస్తీల్లో అసలు ఇంటి పన్నులని విధించాలంటే సర్కిల్ రెవెన్యూ అధికారులు అంతా ఆన్‌లైన్ అయ్యిందని, రిజిస్ట్రేషన్ పత్రాలు ఉంటేనే ఇంటి పన్నులను జారీ చేస్తామని బహిరంగంగా చెబుతుంటారు. కానీ ఎలాంటి రిజిస్ట్రేషన్ లేని, అక్రమ బస్తీలో ఏ విధంగా ఇంటి పన్నులని విధిస్తున్నారని పలువురు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అసలు భూ దేవీ హిల్స్ బస్తీ ప్రైవేటు స్థలమా లేక ప్రభుత్వ స్థలమా తేల్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



**కూల్చివేతలు కొనసాగుతున్నా ఆగని నిర్మాణాలు**

కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని జగద్గిరిగుట్ట, గాజులరామారం డివిజన్‌లకు ఆనుకుని వెలసిన అక్రమ భూ దేవీ హిల్స్ బస్తీలో రెవెన్యూ, హైడ్రా అధికారులు కూల్చివేతలను చేస్తున్నా నిర్మాణాలు మాత్రం జోరుగా సాగుతున్నాయి. రెవెన్యూ అధికారు లు కూల్చడం, భూ బకాసురుడు కట్టించడం సర్వసాధారణంగా మారింది. ఓవర్ ల్యాపింగ్ పేరిట ప్రభుత్వ స్థలాన్ని కొల్లగొడుతున్న భూ బకాసురుని ఆటలు ప్రభుత్వం కట్టించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

జగద్గిరిగుట్ట డివిజన్‌కి ఆనుకుని ఉన్న భూ దేవీ హిల్స్ బస్తీలో జరుగుతున్న అక్రమాల పై హైడ్రా, జిల్లా కలెక్టర్‌లకు ఫిర్యాదులు కొనసాగుతూనే ఉన్నాయి. భూ దేవీ హిల్స్‌లో జరుగుతున్న క్రయ విక్రయాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల పై ఉన్నతాధికారులు విచారణ జరపాలని కొందరు వ్యక్తులు ఫిర్యాదులు చేశారు. ఇప్పటికే ఇంటిలెజెన్స్ విభాగం అధికారులు ఈ బస్తీ పై ఆరా తీస్తున్నట్లు సమాచారం. భూ దేవీ హిల్స్ బస్తీలో జరుగుతున్న అక్రమాల పై రాష్ట్ర ప్రభుత్వం సైతం పూర్తి విచారణ జరిపి అసలు నిజానిజాలను వెల్లడించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**భూదేవీ హిల్స్ బస్తీ అక్రమమా..? సక్రమమా..?**

గాజులరామారం సర్కిల్ పరిధిలోని జగద్గిరిగుట్ట డివిజన్, గాజులరామారం డివిజన్‌లకు ఆనుకుని వెలసిన భూదేవీ హిల్స్ బస్తీ అసలు సక్రమమా, అక్రమమా అన్న అనుమానాలు ప్రజలందరిలో నెలకొంటున్నాయి. ప్రైవేటు స్థలమని చెప్పుకునే భూ బకాసురుడు ప్రభుత్వ అనుమతులతో లే అవుట్ వేయకుండా, రిజిస్ట్రేషన్ చేయకుండా ఎందుకు నోటరీ పత్రాల పై ప్లాట్లను విక్రయిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేటు స్థలమైతే ఎందుకు ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లు కావడం లేదని పలువురు వాపోతున్నారు. ఓ వేళ భూ దేవి హిల్స్ బస్తీ ప్రభుత్వ స్థలమైతే నోటరీలపై కొనుగోలు చేసిన ప్లాట్ల యజమానుల పరిస్థితి ఏంటని అనుమానాలు రేకెత్తుతున్నాయి. అసలు గతంలో బాలానగర్ మండలంగా ఉన్న సమయంలో ముస్కిపేట గ్రామానికి చెందిన సర్వేనంబర్లను ఇక్కడ చూపి స్తూ ఓవర్ ల్యాపింగ్ స్థలంగా చూపిస్తూ ఎకరాల కొద్దీ ప్రభుత్వ స్థలాన్ని భూ బకాసురుడు కొల్లగొడుతున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు. ఓ వేళ ప్రైవేటు స్థలమని అధికారులు తేల్చితే ఎందుకు అనుమతులతో వెంచర్ వేయలేరని ప్రజల్లో నెలకొన్న ప్రశ్నలు. ఉన్నతాధికారులు స్పందించి రెండు మండలాల పరిధిలోకి వచ్చే ఈ భూదేవి హిల్స్ బస్తీ ఏ మండలానికి వస్తుందో తేల్చి ప్రైవేటు స్థలమా, ప్రభుత్వ స్థలమా అన్న అనుమానాలకు ఫులిస్టాప్ వేయాలని ప్రజలు కోరుతున్నారు.

**కూల్చివేతలు చేపడితే ఆరోపణలు.. ఆర్ఐ కలీమ్**

జగద్గిరిగుట్ట, భూదేవీ హిల్స్‌లో తరుచూ కూల్చివేతలు చేపడుతుంటే తన పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ కలీమ్ అన్నారు. భూ దేవీ హిల్స్ బస్తీలో జరుగుతున్న కూల్చివేతలు, అక్రమ నిర్మాణాల పై వివరణ కొరకు వెళ్లగా తాను భూ దేవీ హిల్స్‌లో ప్రభుత్వ స్థలంలో వెలుస్తున్న నిర్మాణాలను కూల్చివేస్తున్నామని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. నిరంతరం కూల్చివేతలు చేపడుతున్నందుకే తన పై లక్షలాది డబ్బులను తీసుకుంటానని ఆరోపణలు చేస్తున్నారని, మరోసారి ఇలాంటి ఆరోపణలు చేసిన వారిపై క్రిమినల్ చర్యలకు సైతం వెనుకాడమని హెచ్చరించారు. లేనిపోని ఆరోపణలు తన పై చేస్తే సహించేది లేదని కలీమ్ స్పష్టం చేశారు.



**పరికి చెరువు కబ్జాలను పరిశీలించిన కవిత...**

భూదేవీ హిల్స్ పరిధిలోకి వచ్చే పరికి చెరువు కబ్జాలను జాగృతి అధ్యక్షురాలు కవిత పరిశీలించారు. భూ కబ్జాలను, చెరువు ఆక్రమణల పై మండిపడ్డారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ పరికి చెరువు కబ్జాలతో పాటు ప్రభుత్వ సర్వేనంబర్లలోని ప్రభుత్వ స్థలాలను అప్పనంగా మింగేస్తున్న భూ బకాసురుల పై హైడ్రా కమిషనర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చెరువు గతంలో 62 ఎకరాల ఉండగా ప్రస్తుతం 16 ఎకరాలకు కుదించుకుపోవడం పై మండిపడ్డారు. తక్షణమే జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్‌లు స్పందించి భూ కబ్జాలను, చెరువుని పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## దశలవారీగా కాలనీల అభివృద్ధే లక్ష్యం
### బిఎన్‌రెడ్డి నగర్ డివిజన కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** దశలవారీగా కాలనీలు అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం డివిజన్‌లోని రంగారెడ్డి కాలనీలో సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విష్ణువర్ధన్‌రావు, చిన్న యదవ్, బిమ్మిడి రంగారెడ్డి, భువనేశ్వరి, తిరుమలరావు, రాజేష్‌రెడ్డి, రమేష్ రెడ్డి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



## బిఎన్‌రెడ్డి ఆడిటోరియంలో కల్యాణమండపం నిర్మాణానికి విరాళం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** బిఎన్‌రెడ్డి నగర్ కాలనీలో అలివేలు మంగ ఆడిటోరియం ప్రాంగణంలో నూతనం కల్యాణ మండపం కోసం రూ. 25 లక్షలు విరాళంగా అందజేస్తున్నామని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి కుటుంబ సభ్యులు ప్రకటించారు. గురువారం కాలనీ వాసులు కాలనీలోని ఆడిటోరియంలో అరవింద్‌రెడ్డి కుటుంబ సభ్యలను సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, ధనరాజ్, రాములు, నవీన్‌కుమార్‌యాదవ్, రవికిరణ్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, కాశిరెడ్డి, అజయ్, సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, బిక్షపతి పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్‌లో చేరికలు



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో బిఆర్‌ఎస్ పార్టీలోకి ఇతర పార్టీల నుండి నాయకులు, కార్యకర్తలు పలువురు చేరారని గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా తెలిపారు. గురువారం కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో కొండాపూర్ డివిజన్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, మాజీమంత్రి కెటిఆర్ నివాసంలో పార్టీలో చేరారు.

## షాద్‌నగర్‌లో 88.99శాతం పోలింగ్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు 88.99శాతం పోలింగ్ అయినట్లు షాద్‌నగర్ ఆర్‌డిఒ సరిత తెలిపారు. గురువారం షాద్‌నగర్ డివిజన్‌లోని వివిధ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ సరిత మాట్లాడుతూ డివిజన్‌లోని ఆరు మండలాల్లో మొత్తం 1,78,778ఓట్లు ఉండగా 1,51,903 ఓట్లు పోల్ అయ్యాయని, 88.99శాతం పోలింగ్ అయినట్లు తెలిపారు. ప్రశాంతంగా గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరిగిందని, ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు సైతం సజావుగా జరుగుతుందని, ఫలితాలను ఎప్పటికప్పుడు ప్రకటిస్తున్నామని వివరించారు. ఆర్‌డిఒ వెంట ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ నాగయ్య ఉన్నారు.

## ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా



**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్టు:** అబ్దుల్లాపూర్ మెట్టు మండలం బాటసింగారం గ్రామపంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థి బండిగారి విష్ణుగౌడ్ అన్నారు. గురువారం గ్రామంలో ప్రచారం నిర్వహించి మాట్లాడుతూ ఈనెల 17న జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో క్రమ సంఖ్య 4 ఫుట్ బాల్ గుర్తుపై ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను ఆయన అభ్యర్థించారు.


## కొత్తూరు మండల సర్పంచులు వీరే..

**ప్రజాపక్షం/కొత్తూరు:** గురువారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మక్తగూడ సర్పంచ్‌గా శ్రీరాములు,గూడూరు సర్పంచ్‌గా దయానంద్ గుప్తా, మల్లాపూర్ సర్పంచ్‌గా నర్సింహ్మారెడ్డి, మల్లాపూర్ తండా సర్పంచ్‌గా మీనాక్షి ధశరత్, తీగాపూర్ సర్పంచ్‌గా జయప్రద, ఇన్ముల్‌నర్వ సర్పంచ్‌గా లలిత, వైఎం తండా సర్పంచ్‌గా గోవింద్, కోడిచర్ల సర్పంచ్‌గా నర్సమ్మ, పెంజర్ల సర్పంచ్‌గా జగన్, ఎస్‌బిపల్లి సర్పంచగా సుమిత్ర, సిద్దాపూర్ సర్పంచ్‌గా బాసునాయక్, కోడిచర్లతండా సర్పంచ్ కొర్ర శాంతి ఎన్నికైనట్లు మండల ఎన్నికల అధికారిణి అరుంధతి తెలిపారు.

## ఓటేసిన ప్రజాప్రతినిధులు..



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామసంచాయతీ ఎన్నికల్లో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన స్వగ్రామం నందిగామ మండలం వీర్లపల్లి గ్రామంలో కుటుంబ సమేతంగా పోలింగ్ కేంద్రానికి చేరుకొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీద్ మామిడిపల్లి గ్రామంలో ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి కుటుంబ సమేతంగా పోలింగ్ కేంద్రానికి చేరుకొని ఓటు వేశారు. ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామంలో మాజీ ఎమ్మెల్యేలు బక్కని నర్సింలు, భీష్వ కిష్టయ్య, మండల పరిధిలోని దూసకల్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి కుటుంబ సమేతంగా, కేశంపేట మండల పరిధిలోని ఏక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ఎల్గనయోని అంజయ్య యాదవ్ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.



## ప్రకృతి పరిరక్షణలో..

# కార్పొరేట్ సామాజిక భాగస్వామ్యం అవసరం

### హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రకృతి పరిరక్షణ, నగర అభివృద్ధిలో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్) సహకారం అత్యంత ఆవశ్యకమని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ అన్నారు. ముఖ్యంగా చెరువుల అభివృద్ధిపై హైడ్రా ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సదస్సులో ఆయన మాట్లాడారు. నగరంలో చెరువుల అభివృద్ధిని పెద్దఎత్తున చేపడుతున్నామని, ఇప్పటికే 6 చెరువుల అభివృద్ధిని పూర్తి చేశామని, త్వరలో మరో 14 చెరువులను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు.

**వరదల కట్టడికి చెరువుల సంరక్షణే మార్గం...**

చెరువుల అభివృద్ధి ద్వారా నగరంలో వరదలను సమర్థవంతంగా కట్టడి చేయవచ్చని కమిషనర్ చెప్పారు. దీనికి ఉదాహరణగా అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను చూపించారు. గతంలో ప్రతి ఏటా ఆ పరిసరాలు నీట మునిగేవని, అయితే ఈ ఏడాది వర్షపు నీరు నేరుగా కుంటలోకి చేరడం వల్ల ఆ ప్రాంతాలకు వరద ముప్పు తప్పిందన్నారు. నగరంలోని చెరువులు, వాటిని అనుసంధానం చేసే కాలువలను పరిరక్షించుకుంటే 'వరద ముప్పు లేని నగరం' సాధ్యమవుతుందన్నారు. సికింద్రాబాద్‌లోని ప్యాట్నీ నాలా విస్తరణ గురించి వివరిస్తూ, గతంలో 20 మీటర్ల వెడల్పు ఉన్న నాలా ప్యాట్నీ వద్దకు వచ్చేసరికి 5 మీటర్లకు కుంచించుకుపోవడంతో 27 కాలనీలు ఏటా వరద ముప్పును ఎదుర్కొనేవన్నారు. ఈఏడాది ఆక్రమణలు తొలగించి వెడల్పు పెంచడం వల్ల ఆ ప్రాంతాలు సురక్షితంగా ఉన్నాయని తెలిపారు. అమీర్‌పేటలోని మైత్రివనం వద్ద నెలకొన్న సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అక్కడ భూగర్భ డ్రెయిన్‌లు బ్లాక్ అవ్వడంతో వరద సాఫీగా సాగేది కాదని, ఒకే చోట 150 ట్రక్కుల పూడికను తొలగించడంతో సమస్య పరిష్కారం అయిందని చెప్పారు.



**హైడ్రా లక్ష్యం – వరదలు లేని నగర నిర్మాణం**

పార్కులను కాపాడి ప్రాణవాయువును అందిస్తున్నామని, చెరువులను కాపాడి వరదలను నియంత్రిస్తున్నామని, రహదారుల ఆక్రమణలు తొలగించి రాకపోకలను సులభతరం చేస్తున్నామని రంగనాథ్ తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు, ఆస్తి, ప్రాణ నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని, వరదలు లేని నగరమే లక్ష్యంగా హైడ్రా పనిచేస్తోందన్నారు. ఈ కృషికి సిఎస్‌ఆర్ నిధులు కూడా తోడైతే మంచి ఫలితాలను రాబట్టవచ్చని కమిషనర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్షాకాలంలో తలెత్తే సమస్యలు, వాటిని పరిష్కరించడంలో హైడ్రా చేసిన కృషిని వివరించారు. హైడ్రా కార్యకలాపాలపై కబ్జాదారులు, ఆక్రమణదారులు దుష్ప్రచారం చేస్తున్నప్పటికీ, వాటికి వెరవకుండా భవిష్యత్ తరాలకు మెరుగైన విధానం అందించాలనే లక్ష్యంతోనే హైడ్రా పనిచేస్తుందని స్పష్టంచేశారు. 1975 నుంచి 2024 వరకు 61 శాతం చెరువులు కనుమరుగయ్యాయని, చెరువుల పరిరక్షణపై దృష్టి పెట్టకపోతే వచ్చే 15 ఏళ్లలో మొత్తం చెరువులు మాయం అవుతాయని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్‌ఆర్‌ఎస్‌సి) హెచ్చరించినట్లు కమిషనర్ తెలిపారు. ఈవిధంగా అందరూ కలిసి పనిచేసినప్పుడే మెరుగైన నగరం, జీవన విధానం సాధ్యమవుతుందని కమిషనర్ రంగనాథ్ అన్నారు.

**'సమాజ హితం యువత అభిమతం కావాలి'**

బాధ్యతాయుతమైన పౌరుల ద్వారానే మెరుగైన సమాజం ఏర్పడుతుందని, యువత సమాజ హితం కోసం ఆలోచించాలని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సూచించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డిఎంఎ) ప్రారంభించిన 'యువ ఆపద మిత్ర' పథకం వాలంటీర్లకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో తమను తాము రక్షించుకోవడంతో పాటు తోటివారిని, చుట్టుపక్కల వారిని కాపాడేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. కమ్యూనిటీ ఆధారిత మొదటి ప్రతిస్పందనదారుల నెట్‌వర్క్‌ను రూపొందించడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. యువ వాలంటీర్లు యూనిఫాం లేని ఫైర్‌మెన్, పోలీస్, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌గా పనిచేస్తారన్నారు. సమస్యను అర్థం చేసుకుని, వేగంగా స్పందిస్తే ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా హైడ్రా కార్యకలాపాలపై విద్యార్థులు అడిగిన సందేహాలను కమిషనర్ నివృత్తి చేశారు.

**40 ఏళ్ల సమస్యకు హైడ్రా పరిష్కారం**
**గల్లీవాసుల కృతజ్ఞతలు**

ముషీరాబాద్ నియోజకవర్గం, రాంనగర్ ప్రాంతంలోని మణెమ్మ గల్లీ నివాసితులు తమ 40 ఏళ్ల సమస్యను పరిష్కరించినందుకు హైడ్రా కమిషనర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 50ఏళ్ల క్రితం డ్రైనేజీ పైప్‌లైన్లు తమ స్థలం నుంచి వెళ్తున్నాయని అడ్డుకోవడంతో వివాదం మొదలైంది. పైప్‌లైన్లు దెబ్బతినడం, మురుగు, వరద నీరు నిలిచిపోవడం, దారి మూసుకుపోవడం వంటి ఇబ్బందులతో నరకం చూశామని వారు వాపోయారు. గత ఏడాది ఆగస్టు 28న కమిషనర్ నేరుగా పరిశీలించి, ఆగస్టు 30న ఆక్రమణలను తొలగించారు. కోర్టు వివాదాల కారణంగా ఆలస్యమైనప్పటికీ, ఇటీవలే కోర్టు తీర్పుతో రహదారి, భూగర్భ డ్రైనేజీ నిర్మాణం పను లు పూర్తయ్యాయని, తమ ఇబ్బందులు తొలగిపోయాయని ఆనందం వ్యక్తం చేస్తూ రంగనాథ్‌కు ధన్యవాదాలు తెలిపారు.





## 'మామ్స్ మ్యాజిక్ ఘీ రోస్టెడ్ నట్స్ కుకీల'ను విడుదల చేసిన సన్‌ఫీస్ట్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఐటిసి లిమిటెడ్ ఫుడ్స్ డివిజన్, బిస్కెట్లు, కన్ఫెక్షన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కవితా చతుర్వేది, సన్‌ఫీస్ట్ వారి సరికొత్త ఆఫరింగ్‌గా 'మామ్స్ మ్యాజిక్ ఘీ రోస్టెడ నట్స్ కుకీల'ను విడుదల చేశారు. నెయ్యిలో వేయించిన నట్స్ (జీడిపప్పులు, బాదం) కుకీల అద్వితీయమైన రుచిని వినియోగదారులు తిరిగి కనుగొనాలని ఆమె ఆహ్వానించారు. నెయ్యిలో గింజలను వేయించడం భారతీయ వంటకాలలో అత్యంత విలువైన ఆచారం అని, ఇది ఆత్మీయమైన సువాసనను విడుదల చేస్తుందని తెలిపారు. ఈ కుకీ నోటిలో కరిగిపోయే అనుభవాన్ని, ఆనందాన్ని ఇస్తుందని, అమ్మలు చేసిన విధంగా నెయ్యిలో వేయించిన గింజలను ఉపయోగించి ఆ 'సిగ్నేచర్ నోస్టాల్జియా'ను తిరిగి సృష్టించామని ఆమె పేర్కొన్నారు. ఈ విడుదలకు ఓగిల్వీ రూపొందించిన కొత్త టివిసి మద్దతు ఇస్తుందని తెలిపారు.

## రిజర్వేషన్లు ఇవ్వకపోవడంపై బిసిల ఆగ్రహం

### ఎఐసిసి కార్యాలయం ముట్టడికి యత్నం

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** తెలంగాణలో బిసిలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందంటూ బిసి నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు గురువారం బిసి నేతలు నూఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి డా.ర్యాగ రుషి అరుణ్‌కుమార్ , ఉపాధ్యక్షులు, బిసి జెఎసి కో–ఆర్డినేటర్ గుజ్జ సత్యం ఆధ్వర్యంలో ఎఐసిసి కార్యాలయం వద్ద జరిగిన ఈ ముట్టడి కార్యక్రమానికి బిసి నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని, నినదించారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో బిసిలకు స్థానికంలో 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని రెండేళ్లుగా నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. ఇకనైనా సిఎం పదవిని బిసి నేతకు ఇచ్చి. కాంగ్రెస్ తన నిజాయితీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఇది ఆరంభం మాత్రమేనని, జనవరిలో టెన్ జన్‌పథ్‌ను ముట్టడిస్తామన్నారు. బిసిలు డిమాండ్లు నెరవేరేవరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. గుజ్జ సత్యం మాట్లాడుతూ రోల్ మాడల్ అంటే బిసిలను మోసం చేయడమేనా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అన్ని ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ముట్టడిలో బిసి నేతలు నీలం వెంకటేష్, సంజయ్ కుమార్, అనంతయ్య, ఆది మల్లేశం, మనోజ్‌గౌడ్, శ్రీమన్, జక్కన్, సంజయ్, శ్రీనివాస్, శివకుమార్, వేణు యాదవ్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.




## వార్డుల పెంపుపై బిజెపి అభ్యంతరం

### జిహెచ్‌ఎంసి కమిషనర్‌ను కలిసిన బిజెపి బృందం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి నేతృత్వంలో బిజెపి ప్రతినిధుల బృందం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను కలిశారు. జిహెచ్‌ఎంసి వార్డుల పునర్విభజన గెజిట్ నోటిఫికేషన్‌పై పారదర్శకత కోరుతూ, సంబంధిత సమస్యలపై చర్చించారు. 650 కిలోమీటర్ల పరిధి ఉన్న గ్రేటర్ హైదరాబాద్‌ను 2,000 కిలోమీటర్లకు పెంచడంపై, ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా హడావుడిగా విలీనం, డివిజన్‌ల పెంపు నిర్ణయం తీసుకోవడంపై బిజెపి తీవ్ర అభ్యంతరం తెలిపింది. పారదర్శకత డిమాండ్ వార్డుల విభజనలో పారదర్శకత లేదని, ఒక వర్గానికి న్యాయం చేసేందుకే ఇది చేశారని మర్రి శశిధర్ రెడ్డి ఆరోపించారు. వార్డులకు సంబంధించిన ప్లాన్‌లు, 150 వార్డుల జనాభా, ఓటర్ల వివరాలు కొత్త వాటి వివరాలను వెంటనే ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. కేంద్ర ప్రభుత్వానికి వార్డు సెన్సెస్ ఇవ్వాలి కాబట్టి ఇప్పుడు చేశామని కమిషనర్ చెప్పారని నేతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, కృష్ణ యాదవ్ మాట్లాడుతూ మాట్లాడుతూ మజ్లిస్ గెలుపు కోసమే ప్రభుత్వం కుమ్మకై మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, డివిజన్లను విలీనం చేసి, కొత్త వార్డులు తీసుకొచ్చిందని ఆరోపించారు. నిరంకుశంగా ఈ విలీన నిర్ణయం తీసుకున్నారని, మహానగరాన్ని మంచినగరంగా మార్చాలని బిజెపి చూస్తోందన్నారు.



## ఘనంగా పసుమర్తి కృష్ణమూర్తి శత జయంతోత్సవం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** తెలుగు నాట ప్రజలకు కూచిపూడి సాంప్రదాయ నృత్యాన్ని సుపరిచితం చేసినటువంటి పసుమర్తి కృష్ణమూర్తి శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్‌లో జరిగిన ఈ ఉత్సవాలకు పసుమర్తి కృష్ణమూర్తి నృత్య దర్శకత్వం వహించగా, సుమారు 40పైగా చిలుకు పాటలను 80 మంది కళాకారులతో 14 మంది గురువుల ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. పసుమర్తి కృష్ణమూర్తి నాట్యశైలిని పరిచయం చేస్తూ ఆయన కుమారుడు పసుమర్తి ఉదయభాస్కర్ గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో సలహాదారులుగా పసుమర్తి రామలింగ శాస్త్రి వ్యవహరించారు.

# ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణ

### కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. గురువారం మొదటి విడుతలో రంగారెడ్డి జిల్లాలో 7 మండలాలో ఎన్నికలు నిర్వహిస్తున్న పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పరిశీలించారు.ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్య సరి చూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు.పోలింగ్ నిర్వహణను,ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీ చేయు సర్పంచి,వార్డు సభ్యుల జాబితాను పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలనీ స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. మధ్యాహ్నం ఒంటి గంట లోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు.ఒంటి గంట తర్వాత ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రం గేటు లోపలికి అనుమతించకూడదనీ కలెక్టర్ పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఎన్నికల అధికారులను ఆదేశించారు.





**స్వేచ్ఛగా ఓటు వేయండి**

**షాద్‌నగర్:** ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంతో పాటు ప్రజలు స్వేచ్ఛగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం షాద్‌నగర్ డివిజన్‌లోని లింగారెడ్డిగూడ, మొగిలిగిద్ద గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ అధికారులకు, పోలీసులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ప్రజలందరికి ఓటు హక్కు కల్పించడం జరిగిందని, ప్రతి ఒక్కరు నిర్భయంగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. రంగారెడ్డి జిల్లాలోని రెండు నియోజకవర్గాలను కలిపి 168గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నామని, ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైందని వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశామని తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలవుతుందని, విజేతలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రకటించడం జరుగుతుందని వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను ఎవరైన అభ్యర్థులు ప్రలోబాలకు గురిచేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఓటర్లు పోలింగ్ కేంద్రాలను వచ్చి ఓటు హక్కును వినియోగిస్తేనే ప్రజాస్వామ్యాన్ని కాపాడినవారు అమవుతామని పేర్కొన్నారు.

**మామిడిపల్లిలో లాఠీచార్జీ విషయం తెలియదు**

నందిగామ మండలం మామిడిపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రం వద్ద చోటు చేసుకున్న లాఠీచార్జీ విషయం తనకు తెలియదని, తన దృష్టికి రాలేదని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద చోటు చేసుకున్న లాఠీ చార్జీ గురించి వివరాలు సేకరించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. కలెక్టర్ వెంట షాద్‌నగర్ ఆర్‌డిఓ సరిత, ఫరూఖ్‌నగర్ తహసీల్దార్ సిహెచ్ నాగయ్యలు ఉన్నారు.

# రీల్



## 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' నుంచి మెలోడీ పాట విడుదల

రవితేజ హీరోగా కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్న అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఎస్ ఎల్ వి సినిమాస్ బ్యానర్పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జీ స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఇందులో రవితేజ సరసన ఆషికా రంగనాథ్ , డింపుల్ హయతి కథానాయికలుగా నటిస్తున్నారు. ఫస్ట్ సింగిల్ బెల్లాబెల్లా చార్ట్ బస్టర్గా నిలిచింది. ప్రోమోతో టీజ్ చేసిన తర్వాత తాజాగా అద్దం ముందు అనే మెలోడీ పాటను రిలీజ్ చేశారు. భీమ్స్ సిసిరోలియో ఓ మధురమైన మెలోడియస్ ట్రాక్ను అందించారు. మనసును హత్తుకునే బీట్లు, శ్రేయా ఘోషాల్ ఆకట్టుకునే వాయిస్ కలగలిసి పాటను మరింత మ్యాజికల్ మార్చాయి. కపిల్ కపిలన్ వాయిస్ మాధుర్యాన్ని పెంపొందించింది. ప్రేమలో ఉన్న జంటల మనసుల మాటలను చంద్రబోస్ అద్భుతంగా రాశారు. ఒకరి కోసం ఒకరు మాత్రమే ఉన్నట్టుగా వారి ప్రేమలో ప్రతి క్షణాన్ని ఆప్యాయంగా, ఆత్మీయంగా చిత్రించే పాట ఇది. అద్దం ముందు సాంగ్ హస్బెండ్వైఫ్ తమ ప్రేమను వ్యక్తం చేసుకునే అద్భుతమైన మెలోడీ సాంగ్ గా అలరిస్తోంది.ఈ సాంగ్ విజువల్ ఫీస్ట్ లా వున్నాయి. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో, యూరప్ అందమైన లొకేషన్ల మధ్య తెరకెక్కిన ఈ పాటలో రవితేజడింపుల్ హయాతి కెమిస్ట్రీ అదిరిపోయింది. వారి రొమాంటిక్ మొమెంట్స్, క్యూట్ ఎక్స్ప్రెషన్స్, స్టైల్ ఇంటరాక్షన్స్ ఇవన్నీ కలిసి పాట కన్నుకుండగలా వుంది. సినిమాటోగ్రఫీ ప్రసాద్ మురెళ్ల, జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్, ప్రొడక్షన్ డిజైనర్ ఏఎస్ ప్రకాష్. భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమా 2026 సంక్రాంతికి విడుదల కానుంది.

## 'అన్నగారు వస్తారు' ఇది రిస్కీ ప్రయత్నం
హీరో కార్తి



హీరో కార్తి నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'అన్నగారు వస్తారు'. స్టూడియో గ్రీన్ బ్యానర్లో కె.ఇ.జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. యాక్షన్ కామెడీ కథతో దర్శకుడు నలన్ కుమారస్వామి రూపొందిస్తున్నారు. కృతి శెట్టి హీరోయిన్గా నటిస్తోంది. ఈ సందర్భంగా కార్తి మీడియాతో చిట్చాట్ నిర్వహించారు. నేను ఈ సినిమాలో నటించేందుకు కారణం డైరెక్టర్ నలన్ కుమారస్వామి. ఆయన సూదు కవ్వమ్ సినిమాకు ఎంతోమంది ఫ్యాన్స్ ఉన్నారు. అలాంటి డైరెక్టర్ ఇవిళ్ల తర్వాత చేస్తున్న చిత్రమిది. సినిమాలు చేయకుండే వాళ్లను మర్చిపోతాం. కానీ నలన్ సినిమా కోసం వెయిట్ చేస్తున్నారు. సూపర్ హీరో తిరిగి వస్తే ఎలా ఉంటుందనే ఆలోచనతో 80వ దశకంలో మాస్ కమర్షియల్ సినిమా మేనియాను మరోసారి గుర్తుచేసేలా ఈ సినిమా ఉంటుంది. ఈ మూవీ స్టోరీ ఒక కాల్పనిక ప్రపంచంలో జరుగుతుంటుంది. నా వరకు చెప్పాలంటే ఇది రిస్కీ ప్రయత్నం. నేను ఊపిరి లాంటి మూవీస్ ఈజీగా చేయగలను కానీ అన్నగారు వస్తారు ఒక ఛాలెంజింగ్ ఫిల్మ్. అయితే రైటర్స్కు స్వేచ్ఛ ఇచ్చినప్పుడే కొత్త తరహా సినిమాలు వస్తాయి. లేకుంటే ఎప్పుడూ ఒకే తరహా మూవీస్ చేయాల్సి వస్తుంది. 80,90 దశకాల్లోనే వచ్చాయి. సీరియస్గా కథ జరుగుతున్నప్పుడు మన సినిమాల్లో ఒక పాట పెడతాం, ఆడియెన్స్ను రిలాక్స్ చేసి మళ్లీ కథలోకి తీసుకెళ్తాం. అది మన సినిమాకే సాధ్యం. అలాంటి స్ట్రక్చర్ కథతో కొత్త మోడరన్ ప్రెజెంటేషన్తో ఈ సినిమా ఉంటుంది. ఇది పీరియాడిక్ మూవీ కాదు. నిన్నటితరం లెజెండరీ హీరోల సినిమాలు నేను థియేటర్స్లో చూడలేదు. కానీ మా పేరెంట్స్ చెప్పేవారు. ఆ దిగ్గజ నటుల ఫొటోస్ ఇప్పటికీ చాలామంది ప్రేక్షకుల ఇళ్లలో ఉంటాయి. వాళ్లను దేవుళ్లలా చూస్తారు. కథల పరంగా కొత్తగా సెలెక్ట్ చేసుకోవాలనే ప్రయత్నం నిత్యం చేస్తుంటాను. నటుడిగా నాకు ప్రత్యేకత తీసుకొచ్చేది నా స్క్రిప్ట్ సెలెక్షనే. ఎన్టీఆర్, ఎంజీఆర్ ఇద్దరి కెరీర్స్ లో అక్కడి సినిమాలు ఇక్కడ ఇక్కడి సినిమాలు అక్కడ రీమేక్స్ జరిగాయి. ఈ క్రాసోవర్ వల్ల ఈ ఇద్దరు మహా నటుల కెరీర్లో ఎన్నో పోలికలు కనిపిస్తాయి. అవి మా సినిమాలోనూ చూస్తారు. మ్యూజిక్ కూడా కొత్తగా చేయిస్తాడు. సంతోష్ నారాయణన్ను ఇంట్రడ్యూస్ చేసింది నలన్ కుమారస్వామి. అయితే ఈ సినిమాకు నలన్ వేరే మ్యూజిక్ డైరెక్టర్ను అనుకున్నాడు. కానీ సంతోష్ వచ్చి నేనే వర్క్ చేస్తా అని అడిగి మరీ మూవీకి జాయిన్ అయ్యాడు. హీరోయిన్ కృతిశెట్టి ఆకట్టుకునేలా నటించింది. స్పిరిట్ రీడర్ లా ఆమె కనిపిస్తుంది. ఈ పాత్ర కోసం రీసెర్చ్ చేసి, ప్రిపరేషన్తో పర్ ఫార్మ్ చేసింది. ఫస్ట్ సీన్ చూసి నేను ఎంత బాగా నటిస్తుంది అనుకున్నా. నేను టీమ్ వర్క్ను బిలీవ్ చేస్తాను. దర్శకుడితో కలిసి స్క్రిప్ట్ గురించి డిస్కషన్స్ చేసుకుంటాం. నేను క్యారెక్టర్ లో ఉండిపోతాను కాబట్టి ఆ పాత్ర ఎలా మాట్లాడితే బాగుంటుంది అనేది ఒక ఐడియా ఉంటుంది. సత్యం సుందరం లాంటి సినిమాను ఒకవేళ ప్రేక్షకులు ఆదరించకుంటే మరోసారి అలాంటి సినిమా చేసే ప్రయత్నమే ఎవరు చేయరు కదా. కె విశ్వనాథ్ సినిమా లంటే నాకు చాలా ఇష్టం. ఆయన సినిమాల్లోని భావోద్వేగాలు, పాత్రల చిత్రణ అద్భుతంగా ఉంటాయి. విశ్వనాథ్ సినిమాలు ఎప్పుడు చూసినా మనల్ని ఎంగేజ్ చేస్తుంటాయి.

## 19న రానున్న 'సకుటుంబానాం'




హెచ్ ఎన్ జి సినిమాస్ ఎల్ ఎల్ పి బ్యానర్ పై ఉదయ్ శర్మ రచన దర్శకత్వంలో మహాదేవ్ గౌడ్, నాగరత్న నిర్మాతలుగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సఃకుటుంబానాం. రామ్ కిరణ్, మేఘ ఆకాష్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో నటకిరీటి రాజేంద్రప్రసాద్, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, శుభలేఖ సుధాకర్, సత్య, రాజశ్రీ నాయర్, రచ్చ రవి, గిరిధర్, తాగుబోతు రమేష్, భద్రం తదితరులు కీలకపాత్రలో పోషిస్తున్నారు. మణిశర్మ ఈ సినిమాకు సంగీతాన్ని అందించగా మధు దాసరి డిఓపిగా పనిచేశారు. ఎడిటర్ గా శశాంక్ మలి చేశారు. డిసెంబర్ 12వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం బోయపాటి శ్రీను దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ తాండవం చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తున్న కారణంగా బాలయ్య పై ఉన్న గౌరవంతో అఖండ 2 సినిమాకు మా సినిమా వల్ల ఎటువంటి చిన్నపాటి అంతరాయం కలవకూడదనే ఉద్దేశంతో మా సఃకుటుంబానాం చిత్రాన్ని డిసెంబర్ 19వ తేదీన విడుదల చేయడం జరుగుతుందని నిర్మాతల్లో ఒకరైన నాగరత్న తెలిపారు.

## 'మోగ్లీ' 13కి వాయిదా

సుమారు పదికిపైగా చిన్న సినిమాలు డిసెంబర్ 12వ తేదీన విడుదల చెయ్యాలని నిర్ణయించారు. కానీ అనుకోని పరిస్థితిలో అఖండ 2 విడుదల వాయిదా పడటం, తిరిగి అఖండ 2 సినిమా 12న విడుదల అవుతున్న నేపథ్యంలో చిన్న సినిమాల విడుదల తేదీలను కూడా మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది ఈ నేపథ్యంలో ప్రముఖ యాంకర్ సుమ కనకాల, నటుడు రాజీవ్ కనకాల కుమారుడు రోషన్ కనకాల నటించిన మోగ్లీ 2025 సినిమా కూడా విడుదల తేదీ మారింది. ఈ సినిమాను ముందు గా 12వ తేదీన విడుదల చేయాలనుకున్నారు కానీ ఇప్పుడు ఒకరోజు తేడాతో 13వ తేదీ న ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. యంగ్ హీరో రోషన్ కనకాల రెండవ చిత్రం మోగ్లీ 2025 రిలీజ్కు రెడీ అవుతోంది. జాతీయ అవార్డు గ్రహీత సందీప్ రాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రం డిసెంబర్ 12న విడుదల కావాల్సి ఉండగా, డిసెంబర్ 13కి వా యిదా వేశారు, అయితే ప్రీమియర్లు 12న ప్రారంభమవుతాయి.



రోషన్ కనకాల ఈ చిత్రం కోసం పూర్తిగా మేకోవర్ అయ్యారు. మనసు హత్తుకునే ప్రేమకథతో నిండిన ఇంటెన్స్ డ్రామాగా ఉంటుందని, అద్భుతమైన యాక్షన్ స్టంట్స్ ఉండబోతున్నాయి. హర్ష చెముడు కీలక పాత్రను పోషిస్తున్నాడు.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని రామ మారుతి ఎం, సంగీతం కాల భైరవ. ఎడిటింగ్ కోదాటి పవన్ కళ్యాణ్, ప్రొడక్షన్ డిజైన్ కిరణ్ మామిడి, యాక్షన్ కొరియోగ్రఫీ నటరాజ్ మాదిగొండ.

## 13న త్రీ రోజెస్ విడుదల

ఈషా రెబ్బా, సత్య, హర్ష చెముడు, సూర్య శ్రీనివాస్ , సత్యం రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన ఆహా ఒరిజినల్స్ వెబ్ సిరీస్ 'త్రీ రోజెస్'. ఆహా ఓటీటీలో సూపర్ హిట్టయిన ఈ సిరీస్ సీజన్ 2 డిసెంబర్ 13వ తేదీ నుంచి స్ట్రీమింగ్కు రెడీ అవుతోంది. రాశీ సింగ్ మరో కీ రోల్ చేసింది. ఈ సిరీస్ ను మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్ కేఎన్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ మారుతి షో రన్నర్గా వ్యవహరిస్తున్నారు. రవి నంబూరి, సందీప్ బొల్ల రచన చేయగా..కిరణ్ కె కరవల్ల దర్శకత్వం వహించారు. ఈ వెబ్ సిరీస్ ప్రీ రిలీజ్ ఈవెంట్ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటి ఇనయ సుల్తానా మాట్లాడుతూ 'త్రీ రోజెస్' సీజన్ 2 ట్రైలర్లో మీరు చూసిన ఫన్ చాలా తక్కువ. సిరీస్ లో కంప్లీట్ ఎంటర్ టైన్ అవుతారు. తెలుగు అమ్మాయిలను ఎంకరేజ్ చేస్తున్న ఎస్ కేఎన్ కు థ్యాంక్స్. ఈ సిరీస్ చేస్తున్నప్పుడు యాక్టర్ సత్య చాలా సపోర్ట్ చేశారు. అన్నారు. హీరోయిన్ రాశీ సింగ్ మాట్లాడుతూ 'త్రీ రోజెస్' సీజన్ 1ను మించే ఫన్ ఈ సీజన్ 2లో చూస్తారు. ఈ వెబ్ సిరీస్ చాలా బాగా వచ్చింది. నేను 'త్రీ రోజెస్' సీజన్ 2 షూటింగ్ ను పిక్నిలా ఫీల్ అయ్యా. రైటర్ సందీప్ నేను తెలుగు డైలాగ్స్ అర్థం చేసుకునేందుకు చాలా హెల్ప్ చేశాడు. ఎస్ కేఎన్ గారు అంటే వైరల్ కంటెంట్ అని అర్థం. అలాగే మారుతికి కూడా థ్యాంక్స్ చెబుతున్నా. ఈ నెల 13న ఆహాలో 'త్రీ రోజెస్' సీజన్ 2 సీజన్ చూడండి. మీరు బాగా ఎంటర్ టైన్ అవుతారు. రోలర్ కోస్టర్ రైడ్ లా సిరీస్ అంతా ఉంటుంది. ముగ్గురు అమ్మాయిలు మూడు పిల్లర్స్ లా ఈ సిరీస్ కు ఉంటారు. మా డైరెక్టర్ కిరణ్ ఈ క్యారెక్టర్ చేసేందుకు కావాల్సినంత ఫ్రీడమ్ ఇచ్చారు. ఈ సిరీస్ చేస్తున్నప్పుడు ఈషా, కుషిత మంచి ఫ్రెండ్స్ అయ్యారు. అన్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ రూపా కొడవయూర్ , నటి ప్రగతి , హీరోయిన్ సంయుక్త , డైరెక్టర్ కిరణ్ కె కరవల్ల హీరోయిన్ కుషిత కల్లపు , హీరోయిన్ ఈషా రెబ్బా డైరెక్టర్ మారుతి, నిర్మాత ఎస్ కేఎన్ పాల్గొన్నారు.






## బిసిలకు 42% రిజర్వేషన్ ఇవ్వాల్సిందే

'బిసిల ఆత్మ గౌరవ దీక్ష'లో నాయకులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశ జనాభాలో 60 శాతంగా ఉన్న బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వడం లేదని, పార్లమెంట్ సమావేశాలలో బిసి రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి విద్య, ఉద్యోగ, రాజకీయలలో42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఒయు బిసి జెఎసి డిమాండ్ చేసింది. తెలంగాణ భవన్లోని అంబేద్కర్ విగ్రహం ముందు ఒయు బిసి జెఎసి ఆధ్వర్యంలో గురువారం బిసిల ఆత్మ గౌరవ దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒయు బిసి జెఎసి నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాలలో 42 శాతం బిసి రిజర్వేషన్ బిల్లును ప్రవేశ పెట్టి, రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్లో చేర్చాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బిసి రిజర్వేషన్ల బిల్లు అసెంబ్లీలో ప్రవేశ పెట్టి, అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో గవర్నర్కి పంపడం జరిగింది, కానీ గవర్నర్ ఆమోదం తెలుపకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీలు బిసిల గురించి తమ చిత్త శుద్ధిని నిరూపించుకోవాలంటే, కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి పెంచాలని కోరారు. 42 శాతం బిసి కులాల రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు కోసం జాతీయ స్థాయిలో అన్ని రాజకీయ పార్టీల మద్దతు కోరుతూ పార్లమెంట్ సమావేశాలలో బిల్లు పెట్టె విధంగా ఒయు బిసి జెఎసి ఢిల్లీలో కృషి చేస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్లో ఒయు బిసి జెఎసి ఆధ్వర్యంలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని, ఎట్టి పరిస్థితుల్లో బిసి రిజర్వేషన్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఒయు బిసి జెఎసి నాయకులు డా. నిజ్జన రమేష్ ముదిరాజ్, డా, దేశగాని సాంబశివ గౌడ్, డా. రాస వెంకట్ ముదిరాజ్, డా. బొమ్మ హన్మంత్ రావ్, జగన్ ముదిరాజ్, మేకపోతుల నరేందర్ గౌడ్, ఆళ్ళ రామ కృష్ణ, బొల్లం లింగ మూర్తి పటేల్, శ్రీరాం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఖైరతాబాద్ మెట్రో స్టేషన్కు ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా'అనే పేరు పెట్టాలి

టిపిసిసి అధ్యక్షులు మహేష్కుమార్గౌడ్కి ఐఇఐ వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ది ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా (ఐఈఐ), టిఎస్సి ఆహ్వానం మేరకు టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి.మహేష్కుమార్గౌడ్ గురువారం తెలంగాణ స్టేట్ సెంటర్ను సందర్శించారు. టిఎస్సి చైర్మన్ ప్రొఫెసర్ డా. రమణ నాయిక్ బానోతు, ఎఫ్ఐఇ, హాన్ సెక్రటరీ ఇంజి, మర్రి రమేశ్లు కలిసి మహేష్కుమార్గౌడ్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ మెట్రో స్టేషన్కు 'ఖైరతాబాద్ మెట్రో స్టేషన్కు ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా'అనే పేరు పెట్టే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని మహేష్గౌడ్ని కోరారు. గతంలో మూసీ వరదల తరువాత హైదరాబాద్ పునర్నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ఇంజనీర్ల సేవలకు గౌరవ సూచకంగా ఉంటుందని తెలిపారు. హిమాయత్ సాగర్తో పాటు ఉస్మాన్ సాగర్ రూపకల్పన ద్వారా నగరాన్ని వరద ముప్పు నుండి కాపాడిన ఇంజనీర్ల సేవలను గుర్తిస్తూ ఈ అభ్యర్థన చేశామన్నారు. అలాగే గచ్చిబౌలిలో ప్రతిపాదిత ఈఎస్సిఐ విశ్వవిద్యాలయం స్థాపనకు ప్రభుత్వ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశామని పేర్కొన్నారు. ఈ అంశాలపై బి. మహేష్ కుమార్ గౌడ్ సానుకూలంగా స్పందించి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. ఐఎస్ఎన్. రాజు, సిఎన్ రఘు ప్రసాద్, డా. జి. రమేశ్వర్ రావు, డా. ఎస్. మురళి, ఇంజి. ఎం.ఎ. కరీంతో పాటు తదితర కార్పొరేట్ సభ్యులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ప్రారంభమైన ఆర్చరీ పోటీలు





ప్రారంభించిన ప్రభుత్వ సలహాదారు జితేందర్రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 45వ సీనియర్ నేషనల్ ఆర్చరీ ఛాంపియన్షిప్ 2025 పోటీలు గురువారం బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో అట్టహాసంగా ప్రారంభమైనవి.. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు టి. రాజు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమానికి తె లంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రభుత్వ సలహాదారులు ఎపి జితేందర్ రెడ్డి హాజరయ్యారు. పోటీలను ప్రారంభించిన అ నంతరం జితేందర్ రెడ్డి మాట్లాడుతూ విలువిద్యకు మన పురాణ ఇతిహాసాల్లోని మహత్తర దృశ్యాలను గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. ఎం తో ప్రాచీనమైన ఈ క్రీడకు మనదేశంలో వైభ వం తీసుకు రావడానికి ప్రభుత్వాలు కృషి చే యాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా స్వయంగా క్రీడాకారుడని తెలిపారు. ఈ నెల 13న ప్రపంచ ప్ర ఖ్యాత ఫుట్ బాల్ స్టార్ లియోనెల్ మెస్సీతో కలి సి ముఖ్యమంత్రి గారు ఫుట్బాల్ మ్యాచ్లో పా ల్గొంటారని వెల్లడించారు. అలాగే, 45వ సీనియర్ ఆర్చరీ ముగింపు వేడుకలకు సిఎం రేవం త్ రెడ్డి స్వయంగా హాజరవుతారని చెప్పారు. టె లంగాణ ఆర్చరీ అసోసియేషన్కు అవసరమైన క్రీడా ప్రాంగణం, కోచ్లు, అలాగే అసోసియేషన్కు ప్రత్యేక అధికారిక కార్యాలయం నియామకం కోసం సహకారం అందిస్తానని హామీ ఇ చ్చారు. ఈ సందర్భంగా టి.రాజు మాట్లాడు తూ 1973లో హైదరాబాద్ నగరంలో తొలిసా రి నేషనల్ ఆర్చరీ ఛాంపియన్షిప్ నిర్వహించబడిందని, దాదాపు 48 సంవత్సరాల తర్వాత మళ్లీ ఈ ప్రతిష్టాత్మక జాతీయ పోటీ హైదరాబాద్లో జరగడం రాష్ట్రానికి గర్వకారణమని తెలిపారు. ఈ ఛాంపియన్షిప్లో రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుండి మొత్తం 403 యూనిట్లు, మొత్తం 971 మంది పురుష , మహిళా ఆర్చర్లు పాల్గొంటున్నారని వెల్లడించారు. 1978 లో హైదరాబాద్లో జరిగిన నేషనల్ ఛాంపియన్ షిప్లో బెహరాన్ మిస్త్రీ కెప్టెన్గా, కె.ఎం. అహ్మద్ ఆ సమయంలో తెలంగాణ ఆర్చరీ అధ్యక్షులుగా ఉన్న విషయాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర అధ్యక్షులు, కార్యదర్శులు, ఆల్ ఇండియా ఆర్చరీ అసోసియేషన్ ప్రతినిధులు, జ్యూరీ సభ్యులు, కోచ్లు, ఆర్చర్లు అందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అరవింద్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అశ్విన్ రావు, డెవలప్మెంట్ కమిటీ మెంబర్ పుట్ట శంకరయ్య ,హెచ్పిఎస్ ప్రిన్సిపల్ స్కంద బాలి,ఆల్ ఇండియా ఆర్చరీ అసోసియేషన్ ట్రెజరర్ జోరీస్,వైస్ ప్రెసిడెంట్ చెరుకూరి సత్యనారాయణ,తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ట్రెజరర్ సతీష్,స్పోర్ట్స్ ఆ థారిటీ, తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ లు రవీందర్,చంద్రారెడ్డి టెక్నికల్ డెలిగేట్స్, మేనేజర్లు, కోచ్లు, ఆర్చర్లు తదితరులు పాల్గొన్నారు.

## గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

పొడిగించింది. తుది ఓటర్ల జాబితా ప్రచురించే తేదీని మార్చింది. తమిళనాడు, గుజరాత్, మధ్యప్రదేశ్, చత్తీస్గఢ్, ఉత్తరప్రదేశ్, అండమాన్ నికోబర్ దీవుల్లో ఎస్ఐఆర్ షెడ్యూల్ మారగా పశ్చిమ బెంగాల్లో మాత్రం సమయాన్ని పొడిగించలేదు. ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల విజ్ఞప్తి మేరకు ఈ మేరకు షెడ్యూల్లో మార్పులు చేసినట్లు ఈసీ వెల్లడించింది. తాజా షెడ్యూల్ ప్రకారం తమిళనాడు, గుజరాత్లో ఎన్యుమరేషన్ కాలం ఈనెల 14 వరకు పొడిగించగా, ఓటర్ల జాబితా 19న ప్రచురిస్తారు. అలాగే, మధ్యప్రదేశ్, చత్తీస్గఢ్, అండమాన్ నికోబార్ దీవుల్లో ఎన్యుమరేషన్ కాలం ఈనెల 18 వరకు ఉంటుంది. ఓటర్ల జాబితా 23న ప్రచురిస్తారు. ఉత్తరప్రదేశ్లో ఈనెల 26 వరకు ఎన్యుమరేషన్ జరుగుతుంది. జాబితా 31న ప్రచురిస్తారు. పాత షెడ్యూల్ ప్రకారం గోవా, పుదుచ్చేరి, లక్షద్వీప్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్లో ఎన్యుమరేషన్ సమయం గురువారానికి ముగిసింది. ముసాయిదా జాబితాలు యథావిధిగా 16వ తేదీన ఈసీ విడుదల చేయబోతోంది. అటు కేరళ షెడ్యూల్ కూడా మారింది. ఎన్యుమరేషన్కు ఈనెల 18 వరకు సమయం ఉంది. ఓటర్ల ముసాయిదా జాబితా 23న ప్రచురిస్తారు. కాగా, అర్హులైన పౌరులంతా ప్రత్యేకించి కొత్త ఓటర్లు తమ డిక్లరేషన్లతో ఫారం 6ను సంబంధిత బూత్ స్థాయి అధికారులకు సమర్పించాలి లేదా ఈసీఐ నెట్ పోర్టల్ లేక యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల సంఘం సూచించింది. 2026, ఫిబ్రవరిలో ప్రచురించే తుది ఓటర్ల జాబితాల్లో తమ పేర్లు ఉండేలా పౌరులు చూసుకోవాలని పేర్కొంది.

## మోదీ ఫోన్ సంభాషణ

(మొదటి పేజీ తరువాయి)

బలోపేతం చేసే అంశంపై కేంద్రీకృతమైందని అధికారులు తెలిపారు. వాణిజ్యం, అత్యవసర సాంకేతికతలు, ఇంధనం, రక్షణ, భద్రత వంటి రంగాల్లో పరస్పర సహకారాన్ని విస్తరించే విషయంపై ఇద్దరు నాయకులు అభిప్రాయాలను పంచుకున్నారని సమాచారం. సామాన్య సవాళ్లను ఎదుర్కొనేందుకు, పరస్పర ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లేందుకు సన్నిహితంగా కలిసి పని చేయాలనే విషయంలో కూడా మోదీ, ట్రంప్ అంగీకరించినట్టు తెలుస్తోంది. అధికార వర్గాలను ఉటంకిస్తూ పిటిఐ ఇచ్చిన సమాచారం ప్రకారం, భారత్–అమెరికా సమగ్ర గ్లోబల్ స్ట్రాటజిక్ పార్ట్నర్షిప్లో సాధించిన పురోగతిని ఇద్దరూ సమీక్షించారు. ద్వైపాక్షిక సహకారం అన్ని రంగాల్లో స్థిరంగా బలపడుతున్నదని సంతృప్తి వ్యక్తం చేశారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించే దిశగా సాగుతున్న ఉమ్మడి ప్రయత్నాలను వేగవతం చేయడం ఎంతో ముఖ్యమని ఇద్దరూ గుర్తించారు. భారత్–అమెరికా మధ్య కుదిరిన 'కేటలైజింగ్ అపర్చునిటీస్ ఫర్ మిలిటరీ పార్ట్నర్షిప్, ఎక్సిలరేటెడ్ కామర్స్ అండ్ టెక్నాలజీ' (కంపాక్ట్) అమలులో కీలకమైన అత్యవసర సాంకేతికతలు, ఇంధనం, రక్షణ, భద్రత, ఇతర ప్రాధాన్య రంగాల్లో సహకారాన్ని విస్తరించే అంశంపైన కూడా నాయకులు చర్చించారు. అంతేకాక, ప్రాంతీయ, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలపై అభిప్రాయాలను పంచుకుని, ఉమ్మడి సవాళ్లను ఎదుర్కొనేందుకు సన్నిహితంగా కలిసి పనిచేయాలని నిర్ణయించారు.

## కలిసి పనిచేశాయి

(మొదటి పేజీ తరువాయి)

విభజించే అంశం కాకూడదని, వందేమాతరం పేరుతో ప్రజలను విభజించడానికి ప్రయత్నించకూడదని బిజెపి నాయకులకు సందోష్ కుమార్ హితవు పలికారు. వందేమాతరం గీతం వేలాది మంది స్వాతంత్ర్య సమరయోధులకు, భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, ఖుదీరామ్ బోస్ వంటి నాయకులకు స్ఫూర్తినిచ్చిందని, నేటికీ అది మనందరికీ స్ఫూర్తినిస్తుందని తెలిపారు. ఆ గీతం మన నేలలో, దేశ ఆత్మలో బలంగా పాతుకుపోయి ఉందన్నారు. గాడ్సే మన జీవితాల సామాజిక చట్రంలోకి చొచ్చుకు వస్తున్నాడని, కాబట్టి మహాత్మా గాంధీ, జవహర్లాల్ నెహ్రూ, అంబేద్కర్ చేసిన సేవలకు సంబంధించి ఒక ప్రత్యేక చర్చ జరగాలని విజ్ఞప్తి చేశారు.

**మహాత్మాగాంధీ చేతిలో తుపాకా?**

ఫేస్బుక్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ మాతృ సంస్థ అయిన మెటా ఏఐ ఇటీవల మహాత్మా గాంధీ చేతుల్లో తుపాకులతో ఉన్న ఒక చిత్రాన్ని ప్రచారం చేస్తోందని సందోష్కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది చూడటానికి చాలా కలవరపరిచే విషయమని, ఈ అంశాన్ని కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ, సంబంధిత మంత్రిత్వ శాఖలు గమనించి, దానిని నిషేధించాలని, ఇందుకు మెటా ఏఐని బాధ్యురాలిని చేయాలని డిమాండ్ చేశారు. చరిత్రను వక్రీకరించి ప్రచా రం చేయడానికి పార్లమెంటును దుర్వినియోగం చేయకూడదని, కానీ దురదృష్టవశాత్తు, ఈ అంశంపై చర్చలో మొదటి వక్తగా మాట్లాడిన ప్రధాన మంత్రే వివాదంగా మార్చారని అన్నారు.

## అగ్రభాగంలో నిలవాలి

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సు రెండు రోజులు జరిగే కార్యక్రమంగా మాత్రమే కాకుండా, ఒక చిచ్చరపిడుగులా కొత్త ఆలోచనలను రగిలించే వేదిక కావాలని నా ఆశ అన్నారు. వివిధ సంస్థల మధ్య సహకారం పెరగాలని, యువ పరిశోధకులు అంతర శాస్త్రీయ అధ్యయనాలపై దృష్టి సారించాలని సూచించారు. వారసత్వ ఆధారిత పరిశోధనకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నాయకత్వంలో మన రాష్ట్రాన్ని శాస్త్రీయ అధ్యయనం, సంస్కృతి సంరక్షణ, జ్ఞాన ఉత్పత్తిలో కేంద్రీకృత హబ్గా తీర్చిదిద్దడంలో రాష్ట్ర ప్రభుత్వం దృఢసంకల్పంతో ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. దక్షిణ భారతదేశానికి ప్రపంచంలోనే అత్యంత సమృద్ధిగా నాణేల పరంపర ఉంది అని డిప్యూటీ సీఎం తెలిపారు. శాతవాహనులు, ఇక్ష్వాకులు తమ వాణిజ్య నెట్వర్క్లను నాణేల ద్వారా విస్తరించగా, కాకతీయుల నుండి విజయనగర సామ్రాజ్యపు వైభవం వరకు మన ప్రాంతపు నాణేలు ఆవిష్కరణ, కళాత్మకత, నైపుణ్యమైన రాజ్యపాలనకు ప్రతీకగా నిలిచాయని అని డిప్యూటీ సీఎం వివరించారు. ఈ నాణేలు మనకు ఆ కాలపు పన్ను వ్యవస్థలు, ముద్రణ, సాంకేతికత, వాణిజ్య ప్రాధాన్యతలు, రాజకీయ దృక్పథం గురించి ఎన్నో విషయాలను వివరిస్తాయని అన్నారు. కోటి లింగలలో పురావస్తు శాస్త్రవేత్తలు కనుగొన్న శా తవాహన సీసపు నాణంలో రాజకీయాలు, ఆధ్యాత్మికత, లోహశాస్త్రం, కళ, ఆర్థిక వ్యవస్థ వంటి అన్ని అంశాలు ఒకేచోట కలిసిపోయాయి అని వివరించారు. ఈ నాణ్యం ద్వారా మొదటిగా తెలంగాణ పరధ్యాన ప్రాంతం కాదని,, డెక్కన్ వాణిజ్య వ్యవస్థలో కీలక కేంద్రం అనే విషయాన్ని స్పష్టం చేస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ హెరిటేజ్ డైరెక్టర్ అర్జున రావు, న్యూ మిస్ మ్యాటిక్ ఇండియా సొసైటీ చైర్మన్ డాక్టర్ డి. రాజారెడ్డి, జనరల్ సెక్రెటరీలు ప్రొఫెసర్ పి.ఎన్. సింగ్, ప్రొఫెసర్ బింద దత్తాత్రేయ, డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చందా ఎన్ ఎర్లీ హిస్టారిక్ సైట్ ఇన్ తెలంగాణ, ఆర్ట్, ఆర్కిటెక్చర్ మరియు ఐకోనోగ్రఫీ తదితర పుస్తకాలను ప్రముఖులతో కలిసి డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com